

ఆంధ్రప్రదేశ్



నతద్జ్ఞానం నతచ్ఛిల్పం, నసా విద్యానసా కళా
నాసౌయోగః,నతత్కర్మ,నాట్యే ఽ స్మిన్ యత్ నదృశ్యతే.

భరతముని

ఆగస్టు, 1965
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 9
సంచిక : 10
ఆగస్టు, 1965
శ్రావణ-భాద్రపద 1887 శకం

ప్రధాన సంపాదకులు
టి. రామచంద్రరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

మొదటి అట్ట :

ఫొటో – శ్రీ యస్. ఆర్. కె. రావు

సతద్జ్ఞానం, నతత్శిల్పం, నసా విద్యా నసా కలా
నాసౌయోగః, నతత్కర్మ, నాట్యేఽస్మిన్ యత్
నదృశ్యతే

"జ్ఞానము, శిల్పము, విద్య, కళ, యోగము, కర్మము" ఇవియేవికూడ నాట్యములో లేకుండ ఉండవు. నాట్యము సర్వవిద్యాస్థానములకు స్థానము —భరతముని.

రెండవ అట్ట :

దోలాఽధిరూఢసర సీ స్థిరపుష్కరాఽబ్దేః
దోలాఽధిరూఢపృథుకా స్వపితేవ సింధోః

పడవలు గలిగి స్థిరముగా నిలిచి యున్న యీసముద్రపునీటిసరస్సు సముద్రపు (స్త్రీ) శిశువు డోలలో సుఖముగా నిద్రపుచ్చబడినదా యనునట్లు ఉన్నది.

మూడవ అట్ట :

భక్తిద్వారం మురారేః ఇదమిహ
విలసన్మందిరౌఘః సమంతాత్

భక్తి యనెడుద్వారము గలిగి విలసించుచున్న శ్రీ మహావిష్ణువుయొక్క మందిరముల సమూహము అంతటను (కనపడుచున్నది).

నాల్గవ అట్ట :

పరార్థఫలపుష్పిణో మహిరుహా ఇవేమే స్వయమ్
పరార్థఫలసంపదం పరివహంతిరథ్యాఽఽపణే

ఇతరుల ప్రయోజనముకొరకై ఫలపుష్పములను వహించువృక్షములవలె ఈ కనపడు పురుషులుగూడ రాచబాటలోనున్న అంగడిలో ఇతరుల ప్రయోజనముకొరకైన ఫలసంపదను తమచుట్టు పెట్టుకొని వహించుచున్నారు.

ఫొటోలు : శ్రీ టి. రామచంద్రరావు
ప్రధానసంపాదకులు

ఈ సంచికలో

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు

ముఖ్య మంత్రికి
జూలై 28 న
ఏబదిఆరవ
జన్మదినోత్సవ సందర్భాన
"ఆంధ్రప్రదేశ్"
శుభాభినందనలు



మన ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి

గొట్టిపాటి బ్రహ్మయ్య

నిరాడంబరుడు — వేషంలోనూ, మాటల్లోనూ; చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా అందరితోనూ కలుపుగోలుతనంగా, హుషారుగా, చలాకీగా మాట్లాడే యువకులలో యువకుడు — పెద్దలలో పెద్ద.

చిన్ననాడే తండ్రిని కోల్పోయిన శ్రీ బ్రహ్మానందరెడ్డిగారికి విద్యాబుద్ధులు నేర్పి, పట్టభద్రుడుగా, సమర్థుడైనటువంటి వాదనా పటిమగల న్యాయవాదిగా జేసిన ఘనత వారి జ్యేష్ఠసోదరుడు స్వర్గీయ శ్రీ వెంకటరెడ్డిగారిది. శ్రీ వెంకటరెడ్డిగారే వీరిని తీర్చి దిద్దిన గురువు, సచివుడు, దైవము. ఈనాటికి ఏ సభలలోనైనా శ్రీ వెంకటరెడ్డిగారి పేరు స్మరణకు వచ్చినప్పుడెల్ల ఆయన కండ్ల నీరు బెట్టి, గద్గదస్వరముతో చాలసేపు మాట్లాడలేనిస్థితి, వారి అన్నదమ్ముల అనురాగాలకు, ప్రేమకు నిదర్శనము. వీరి రెండవ అన్న శ్రీ వెంగళరెడ్డిగారు మంచి వ్యవహర్త, పరిపాలనాదక్షుడు, కార్యవాది, దేశభక్తుడు. వీరిరువురు కవల సోదరులనుకునేటట్లుగా మెలుగుతుంటారు.

త్యాగానికి, పేరు ప్రతిష్ఠకు ప్రసిద్ధిగన్న సంపన్న కుటుంబము వీరిది. పేరుకు తగినట్లు కాసులకు కొదువలేదు. తల్లిదండ్రులు త్యాగధనులు, నిరతాన్నదాతలు. మేనమామలు వ్యవహారదక్షులు. పెద్ద భూస్వాములు. అభ్యుదయానికి తల్లిదండ్రుల దాతృత్వమే కారణమంటారు ఆ ప్రాంతపు జనులు.

ఆంధ్ర రాజకీయాలలో గుంటూరు గొప్పతనమునకు పేరు పడ్డది. ప్రథమశ్రేణి ఆంధ్రనాయకులు దేశభక్త కొండా వెంకటప్పయ్యపంతులు, ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు, ఉన్నవ లక్ష్మీనారాయణ, గొల్లపూడి సీతారామశాస్త్రి, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగార్లను కన్నతల్లి ఆ జిల్లా — ఆనాటి పల్నాడు ఫారెస్టు సత్యాగ్రహము; రెండవ బార్డోలిగా ప్రసిద్ధికెక్కిన పెదనందిపాడు పన్నుల నిరాకరణోద్యమము విద్యార్థిగా వున్న శ్రీ బ్రహ్మానందరెడ్డి రక్తాన్ని వుడుకెక్కించి, విద్యకు స్వస్తి జెప్పి స్వరాజ్య సంరంభంలో చేరవలెనన్న ఆసక్తి కలుగజేసినది. అయితే ఆయనలోని దీర్ఘాలోచనపటిమ (Level headedness) ఆ నిర్ణయాన్ని చదువుసంధ్యలు పూర్తి చేసేవరకు వాయిదా వేయించినది.

ఈయన నూనూగు మీసాలనాడే పట్టభద్రుడై, ప్రతిష్ఠతోపాటు ధనాన్ని ఆర్జించుకోవలె ననెడి ఆశతో న్యాయవాది వృత్తిని చేబట్టారు. చేసిన కొద్దికాలం ప్రాక్టీసులోనూ, తెలివైనవాడూ, చురుకైనవాడూ, యెంతో భవిష్యత్తు కలవాడు అని పెద్దలప్రశంసల నందుకున్నాడు. క్రిమినల్ లాయరుగా పెద్ద ఫీజులను ఆకర్షించే ప్రతిపత్తికూడ లభించింది. గురితప్పకుండా పాయింట్స్ స్కోర్ జేసే మంచి క్రీడాభిలాషికూడా ఆయన. నేటి రాజకీయ చతురతకు ఆనాటి టెన్నిస్, హాకీ ఆటలదక్షత ప్రోగిచేసిన దనుకుంటాను.

1936 ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసునకు అధ్యక్షులు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు. ఆయన చేవకు, చొరవకు తగిన గుణగణాలుగల ప్రధాన కార్యదర్శి మహాఋషి బులుసు సాంబమూర్తిగారు. వీరిద్దరు సోల్జరు — స్టేట్స్‌మెన్. ముందుచూపేగాని, వెనుకంజలేనివారు. "యశోవా మృత్యుర్వా" వీరి నినాదము. 1937 మద్రాసు శాసనసభకు ఆంధ్రలోని రెండుస్థానాలు మినహా గెలుచుకున్న ఘనత వీరిద్దరిదీని. 1937 శాసనసభల ఎన్నికలకు ప్రాతిపదికగా 1936 వ సంవత్సరములో జిల్లా బోర్డులను స్వాధీనము చేసుకోవలె ననెడి వ్యూహరచన చేశారు వీరిరువురు. ఆనాడు స్థానిక సంస్థలన్నియు ధనవంతులు, భూస్వాములు అగు జస్టిస్ పార్టీవారి స్వాధీనములో వున్నవి.

గుంటూరు జిల్లాలోని కాంగ్రెసు నాయకులు ప్రసిద్ధులైనట్లే, జస్టిస్‌పార్టీ నాయకులు ప్రతిష్ఠ, గౌరవము గలవారు. చాలా ధనవంతులు, భూస్వాములు, బలవంతులుకూడా. ఆనాడు వారిని ఓడించుటకు బ్రహ్మప్రయత్నము కావలసి వచ్చినది. ఈ సంరంభానికి ప్రథమ సైనికునిగా శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిని నిర్ణయించి ఒంగోలు జిల్లాబోర్డు అధ్యక్షునిగా ఒకఓటు మెజారిటీతో గెలిపించి జయభేరి మ్రోగించారు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులుగారు. ఒక ఓటు మెజారిటీగల పార్టీతోనే, బలవంతుడై వ్యవహార దక్షతగల ప్రత్యర్థి శ్రీ పాములపాటి వెంకట కృష్ణయ్యగారు ఉపాధ్యక్షులై నప్పటికినీ, జిల్లాబోర్డును తెలివితేటలతో, దక్షతతో సాగించి, చిన్న వయస్సుననే, పెద్దల ప్రశంసల నందుకున్నాడు శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారు. జిల్లాకాంగ్రెసు రాజకీయాలలో శ్రీ కల్లూరి చంద్రమౌళి, శ్రీ మంతెన వెంకటరాజుగార్లతో జిల్లా రాజకీయాలను పటిష్ఠంగా ప్రశంసాపాత్రంగా నిర్వహించటం జరిగింది. రాష్ట్రరాజకీయాలలో శ్రీ సంజీవరెడ్డిగారు ఉపముఖ్యమంత్రిగా, అల్లూరి సత్యనారాయణ రాజుగారు రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షుడుగా శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు ప్రధాన కార్యదర్శిగా, నాయకత్రయంగా వ్యవహరించి, కాంగ్రెసు సంస్థను పటిష్ఠంజేసి, ప్రజలమన్ననలను పొందారు. అన్ని రాజకీయ ప్లాటుఫారమ్ము మీదను వీరు ముగ్గురూ సమిష్టి పాత్రధారులయ్యే

(మిగతా 54 వ పేజీలో)

జాతీయ సమైక్యతాభావాన్ని సుదృఢము చేయాలని డాక్టర్ రాధాకృష్ణ ఉద్బోధ

భారతదేశం ఎల్లప్పుడూ సమన్విత సమైక్య దృక్పథానికే కట్టుబడినది. ఏ పేరుతో దాన్నిపిలిచినా తత్వవిచారక వాస్తవాలలో వ్యత్యాసంలేదు. జాతీయ సమైక్యతాసాధన ముఖ్యమైనది.

ఒక పుణ్యక్షేత్రము, అనేక శతాబ్దాలకు పూర్వము కొందరు వ్యక్తులు నివసించినంతమాత్రాన పవిత్రం కాదు. నిత్యమూ పుణ్యమూర్తుల సన్నిధిచేత ఆప్రదేశాలు పావనములవుతాయి.

"భవద్విధా భాగవతాః తీర్థభూతాః స్వయం ప్రభో
తీర్థీకుర్వంతి తీర్థాని స్వాంతస్థేన గదాభృతా"

(మీవంటి భాగవతోత్తములు తీర్థస్వరూపులు. డెందములో దేవుని నిలుపుకొన్న మీరు తీర్థములనే పవిత్రము చేయుచున్నారు) అని ధృతరాష్ట్రుడు విదురునితో అన్నాడు: అలాగే భద్రమహర్షి శ్రీరామునివల్ల ఇక్కడ తరుణోపాయము నొందినాడు.

మనదేశములో మత మనగా భగవత్సాక్షాత్కారము. ఈ సత్యమునే 'సదా పస్యంతి సూరయః' అని వేదము చెప్పుచున్నది. అంటే ద్రష్టలైన మహర్షులు ఎప్పుడూ భగవంతుని చూస్తూనే ఉన్నారు. స్వానుభవముతో భగవత్సాక్షాత్కారము గూర్చి 'వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్।' అని ఉపనిషత్తు ప్రవచిస్తున్నది. అనుభూతిమార్గాన స్వానుభవంతో భగవత్సాక్షాత్కారము పొందడమనేదే దీని భావము. కృష్ణార్జునుల సంవాదం, నరనారాయణులు పరస్పరంపొందిన సాక్షాత్కారం యిట్టిదే. అదే మన దేశ సంప్రదాయంకూడ. భగవంతుని ఇంత సన్నిహితంగా స్వానుభూతితో దర్శించగలిగినవారే నిజమైన మత తత్త్వజ్ఞులు.

భగవంతుని తనలో చూడగలిగినప్పుడు ఈ దేవాలయాలు ఎందుకు? ఈ విగ్రహాలెందుకు? పరమాత్మను దర్శించడమే ఉత్తమోత్తమ మతం.

"ఉత్తమా సహజావస్థా మధ్యమా ధ్యానధారణౌ
తృతీయా ప్రతిమాపూజా హోమయాత్రాచతుర్థికా."

(ఆత్మలో పరమాత్మను దర్శించడం ఉత్తమం. ధ్యాన ధారణ రెండవపద్ధతి. అది సాధ్యం కానివారికి విగ్రహపూజ. ఇది మూడవ పద్ధతి. దానివల్ల భగవంతునితో భక్తునికి అనుబంధం ఏర్పడుతుంది. ఇదికూడ వారికి అసాధ్యమైనప్పుడు హోమములు, యాత్రలు సాధనములు. ఇది నాల్గవపద్ధతి.) ఈ పద్ధతివల్ల కొండజాతివారు సైతం, అంతా యీ ప్రపంచమే కాదనీ దీనికి అవల యేదో ఒకటి ఉన్నదనీ, అదే మన జీవితానికి అర్థమూ పరమార్థమనీ వారు గుర్తించగలుగుతారు.

ఈదేశంలో మనం ఒక్క గంతులో ఉన్నతస్థానం సాధించాలని కోరడంలేదు. అనేక దశావస్థలచేత ఉన్నతి సాధించాలనుకుంటాము. ఉత్తమోత్తమ భగవత్తత్వజ్ఞతా సాధనమే జీవిత చరమలక్ష్యమైనప్పుడూ, ఆత్మానుభవం, బ్రహ్మ సంస్పర్శయే లక్ష్యమైనప్పుడూ, భగవత్సాక్షాత్కారం పొందడంలోని మార్గాలనుగూర్చి మనం వాదులాడము. భగవత్సాక్షాత్కారము నొందడానికి పరమ సాధనం భక్తిమార్గం.

"మోక్షసాధనసామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ।"

'ఇష్టదేవతల'గూర్చి ప్రజలు పరస్పర సంఘర్షణలు పడరు. దీనికి కారణం, ఈ దేశములో సర్వమత సామరస్యము ఉండుటయే. "శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే" అని

"శైవా వయం న ఖలు తత్ర విచారణీయం
పంచాక్షరీజపపరాః నితరాం తథాపి
చేతో మదీయమతసీకుసుమావభాసం
స్మేరాననం స్మరతి గోపవధూకిశోరమ్ ।"

(మేము శైవులం, పంచాక్షరియగు 'ఓం నమశ్శివాయ' అను మంత్రమును సర్వదా జపిస్తాము. అయినప్పటికీ నా మనస్సు నల్లఅవిసె పుష్పములకాంతి కలిగి చిరునవ్వు మొలకెత్తుచున్న గోపవధూ కిశోరుని స్మరిస్తున్నది) అని పైవాని తాత్పర్యము. ఈ పెద్దలు చెప్పిన మాటలు మన సర్వమత సహనాన్ని తెలుపుతున్నవి.

విష్ణువైనా, శివుడైనా భగవంతుడు ఒక్కడే. 'మహేశ్వరో వా జగదీశ్వరో వా న వస్తుభేద ప్రతిపత్తి రస్తిమే' భగవంతునికి పెట్టుకున్న యిష్టనామాలు మాత్రమే యివి.

మన జాతీయ సమైక్యానికి యీ భద్రాద్రి మంచి ఉదాహరణము. కారణ మేమంటే ఈ రామాలయాన్ని నిర్మించిన రామదాసు మహమ్మదీయ సాధువయిన కబీరునుండి తారకమంత్రోపదేశం పొందాడు. 'తారకమంత్రము కోరిన దొరికెను ధన్యుడనైతిని ఓరన్నా' అని రామదాసు గానంచేశాడు. రామదాసు హృదయంలో ఎంత ఉదారత నెలకొన్నది! ఈనాటికీ యీ దేశప్రజల హృదయం జాతిసమైక్యంపట్ల అంతే ఉదారంగా వున్నది.

దేవాలయాలకు వెళ్ళి ప్రార్థనాదికాలను అలపించినంతమాత్రం చేత ప్రయోజనంలేదు. నావలెనే ప్రపంచంలోని ఏదేశీయుడైనా, ఏ జాతీయుడైనా ఏ తెగవాడైనా దేవుని బిడ్డడు – అన్నభావాన్ని అలవరచుకోవాలి. నీవు నిజమైన మతావలంబివా? ప్రతివ్యక్తినీ నీవు నీ బంధువులవలె భావించ గలుగుచుందువా? ఒకవేళ వారిమీద నీకు స్పర్ధాసూయలువున్నవా. ఉంటే నీవు నిజమైన మతావలంబివికావు. సర్వమానవుల ఎడా నీవు జాలిని చూపగలుగుతున్నావా? కోపాన్నీ, అసూయనూ దూరం చేసుకోగలిగావా? కోపము పిచ్చివాని లక్షణము. దేవాలయము కేవలము ఆరాధనాలయమేకాదు. ఆత్మోన్నతిని కలిగించి, మనస్సులో ముసురుకున్న కారుచీకట్లను పారద్రోలి ఉన్నత పథములో మనసును విహరింప జేయడానికి తోడ్పడేదే ఆలయము.

శ్రీరాముని మహనీయ లక్షణములను మనము గ్రహించవలెను. ఉన్నత మార్గములో అడుగుపెట్టుటకు మనకు ఒక సాధనముగా తోడ్పడుటకై వాల్మీకిమహర్షి రామాయణమును ప్రసాదించాడు. అందులో ఉన్నతమయిన నీతులు కలవు. ఉదాహరణగా :

'రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజాం
అయోధ్యాం అటవీం విద్ధి గచ్ఛ తాత ! యథాసుఖం.

"శ్రీరాముని తండ్రివలెను, సీతను నావలెను (తల్లివలెను), అడవిని అయోధ్యవలెను భావించి సుఖముగా వెళ్ళిరానాయనా" అని సుమిత్ర లక్ష్మణునితో చెప్పెను. ఇంతేకాక సీతావియోగ ఖిన్నుడైన రాముడు ఋశ్యమూక పర్వతముపైన సీతనగలు చూచితిని. గుర్తించుమని కోరినప్పుడు లక్ష్మణు డిచ్చిన సమాధానం ఎంత ఉదాత్తమైనదో చూడుడు :

"నాహం జానామి కేయూరే; నాహం జానామి కుండలే;
నూపురే త్వభిజానామి; నిత్యం పాదాభివందనాత్."

(ఈ కేయూరములు నాకు తెలియవు. కుండలములు తెలియవు. ప్రతిరోజూ నేను (సీతకు) పాదాభివందనం చేస్తుంటాను గనుక అందెలుమాత్రం ఆమెవేయని గుర్తుపట్టగలను – అని శ్లోకభావము)

కాళిదాసు రఘువంశం 14వ సర్గలో చెప్పిన ఉదాత్తభావం వినండి. శ్రీరాముని సీతాదేవి కోరినమాటలు –


సాఽహం తపస్సూర్య నివిష్టదృష్టిః
ఊర్ధ్వం ప్రసూతేశ్చరితుం యతిష్యే
భూయో యథా మే జననాంతరేపి
త్వమేవ భర్తా న చ విప్రయోగః

అంటే ప్రసవానంతరం నేను సూర్యాభిముఖినై తపస్సు చేస్తూ మరో జన్మలోకూడా నీవే భర్త కావాలి, వియోగవ్యధ సంభవించరాదు అని ప్రార్థిస్తున్నాను అని శ్లోకంయొక్క భావం.

బహుభార్యాత్వంవల్ల దశరథునికి కలిగిన విపత్తు మీ కందరకూ తెలుసు. శ్రీరామచంద్రునివలె ఏకపత్నీవ్రతులు కండు. సక్రమ మార్గమున చరించుడు. ఈ విధమైన సదుద్దేశాలను ప్రజల మనస్సులలో కలిగించడానికి ఈ దేవాలయం ఏమాత్రం తోడ్పడినా వారు ఉన్నత పురుషులై, ఉత్తమమైన మానవత్వాన్ని కలిగి, మరింత నాగరకులు కాగలరు.

ఈ ఆంధ్రప్రదేశ్‌లో సహజమైన ప్రకృతిసంపద అపారంగా ఉన్నది. ఈనాటివరకూ ఆ సంపదను తగిన విధంగా అభివృద్ధి పరచడం జరగనేలేదు. దేశాభివృద్ధిని సాధించుటకు జీవితం అంకితం చేసిన ప్రజలు ఉన్నారు. వారి ప్రభుత్వం ఉన్నది. వారు ప్రగతి పథాన్ని చేరడానికి ఈ వంతెన ఒక సాధనంగా తోడ్పడగలదని నేను విశ్వసిస్తున్నాను. ఈ వంతెన నిర్మాణానికి తోడ్పడినవారందరినీ, ఈ నిర్మాణంతో సంబంధంగలవారి నందరినీ అభినందిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ఆలయంపై అజమాయిషీ అధికారాన్ని చేపట్టే నాటివరకూ నిజాం ప్రభుత్వమే అనేక సంవత్సరాలుగా ఈ దేవాలయానికి ఆర్థిక వసతులను అందజేస్తూ వచ్చింది. వెనుకటి ప్రభుత్వం కొనసాగిస్తూ వచ్చిన సంప్రదాయాల్ని చాలావరకు ఇప్పటి ప్రభుత్వం తీసివేయవచ్చు. అయితే వెనుకటి ప్రభుత్వం ఈ ఆలయాని కిచ్చే ఆదరణను మాత్రం ఇప్పటి ప్రభుత్వం రద్దు చేయదని ఆశిస్తున్నాను. ఈ వంతెన యాత్రికులకు పూర్తిగా సహాయ పడగలదనీ, ఇంతవరకూ ప్రసిద్ధికి రాని ప్రాంతాలను వెలికి తెచ్చి వాటి ఆర్థిక, భౌతిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడగలదనిన్నీ నే నాశిస్తున్నాను.

30-మెగా వాట్లు



శ్రీ కె. కామరాజ్, ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి, పబ్లిక్ వర్క్స్ శాఖామంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి, విద్యుచ్ఛక్తిమండలి అధ్యక్షులు శ్రీ జె. వి. నరసింగరావు తదితరులు.



శ్రీ కె కామరాజ్ థర్మల్ స్టేషన్‌కు ప్రారంభోత్సవం చేశారు.

★

జపాను సహకారంతో రు. 9.79 కోట్ల ఖర్చుతో నిర్మించబడిన నెల్లూరు థర్మల్ స్టేషన్‌కు జూన్ 25వ తేదీన కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కె. కామరాజ్ ప్రారంభోత్సవం చేసారు. ఈ స్టేషన్‌వల్ల రాష్ట్రంలోని "విద్యుచ్ఛక్తి కొరత" కొంత తగ్గగలదు. దీనివల్ల ప్రత్యేకించి నెల్లూరు, చిత్తూరు, కడప, గుంటూరు జిల్లాలకు విద్యుచ్ఛక్తి సరఫరా అధికం కాగలదు. తద్వారా యీ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధికి దోహదం కలుగుతుంది.


పెన్నానది ఉత్తరాన ఉన్న ఆగ్నేయాసియాలో అతి ఎత్తైన 300 అడుగుల కూలింగ్ టవర్ పట్టణ స్వరూపాన్ని మార్చి వేసింది. నిముషానికి 32000 గ్యాలనుల శక్తి యీ కూల్ టవర్‌కు ఉంది. సరస్సు

థర్మల్ స్టేషన్


★

స్థాయిలో దీని వ్యాసార్థం 215.5 అడుగులు. ఈ థర్మల్ స్టేషన్ నిర్మాణంలో జపానీయులు, భారతీయ ఇంజనీర్ల ఆధ్వర్యంలో 2 సంవత్సరాల పాటు 1500 మంది పనివారలు నిర్విరామంగా కృషిచేశారు. దాదాపు 6800 టన్నుల సిమెంటు, 2200 టన్నుల ఉక్కు కమ్మీలు, ప్లేట్లు ఉపయోగించారు.

1956లో రూపొందించబడి, 1959లో నిర్మాణంపని ప్రారంభించబడిన తుంగభద్ర జలవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టులో భాగంగా నెల్లూరు థర్మల్ స్టేషన్ నిర్మించ బడినది. తుంగభద్ర గ్రిడ్, మాచ్‌ఖండ్ గ్రిడ్‌ల చివరన నెల్లూరు ఉన్న కారణంగా తుంగభద్రగ్రిడ్ ఉత్పత్తి శక్తి వ్యత్యాసాన్ని పూరించటానికి యీ 30 మెగావాట్ల స్టేషన్‌ను రూపొందించారు.



300 అడుగుల కూలింగ్ టవర్ దృశ్యం.



పవర్ హౌస్.

మన జాతీయ పతాకం

డాక్టర్ యస్. రాధాకృష్ణన్

ఈ దేశం పతాకంకేవలం భారతదేశానికే గాక మొత్తం మానవతకు చిహ్నం.

దేశప్రజల లేక ప్రపంచ ప్రజల జీవితానికి సంబంధించిన వివిధ అంశాలను యీ పతాకం అభివర్ణిస్తుంది.

పతాకం మధ్యలో నీలవర్ణం చక్రాన్ని మీరు చూస్తారు. ఆకాశంవంటి లేదా సముద్రమువంటి నీలివర్ణంతోగల యీచక్రం కాలచక్రానికి చిహ్నం. ఈ చక్రం తిరుగుతూనే ఉంటుంది. అయితే అంతటితో సరిపోతుందా ? కాలమే సర్వస్వం అయినప్పుడు అంతా హరించిపోతుంది. యేమి మిగులదు. సకలజీవులకు మృత్యువే అంతమవుతుంది. సర్వనాశనం మనను యెదుర్కొంటుంది.

అందుకే యీ ప్రపంచానికి అర్ధంలేదనీ, మన ఉనికికి ప్రయోజనంలేదని ప్రజలు భావిస్తుంటారు. సముద్రమువంటి లేదా ఆకాశంవంటి నీలిరంగు చిహ్నంగల యీ జగత్తుసృష్టిక్రమాన్ని తెల్పేచక్రం – ఇది స్వయంశక్తి, స్వయంపోషకం లేదనీ దాని వెనుక యేదో శాశ్వతశక్తిపై యిది ఆధారపడి ఉన్నదని యీచిహ్నం సూచించదా అని మనం అడుగుతుంటాము. ఈ చిహ్నానికి వెనుక భాగంలో ధవళవర్ణం ఉన్నది. ధవళవర్ణం శాశ్వతత్వాన్ని ప్రకాశింపజేస్తుందని షెల్లీఅంటాడు. ప్రాపంచికమైన యీ క్రమం విశ్రాంతి నొందడానికి యేదైనా ఆధారభూతంకావాలి.

కాలమే అంతాకాదు. మన ఉనికికి మరోవైపు ఉన్నది. అదే శాశ్వతమైనవైపు. అందువల్ల సముద్రం, ఆకాశవర్ణమైన నీలంరంగును యివ్వడంతోపాటు దాని వెనుక భాగాన్నే ధవళవర్ణం ఇవ్వబడినది. భావనలతో యీ శాశ్వతత్వాన్ని వర్ణించేవారు ఆ రహస్యానికి చెందిన ఆధిక్యతకు అన్యాయం చేస్తున్నారని యీచిహ్నం సూచిస్తున్నది.

ఆశాశ్వతత్వాన్ని గూర్చి సవివరంగా తెలిపే స్థితిలో వారులేరు. పరిమితికల మనస్సు అనంతత్వానికి జోహార్లు అర్పిస్తుంది. అంటే నీవు వర్ణనాతీతమైన అగోచర విషయానివి.

అందువల్ల కాలమే సర్వస్వంకాదు. అదేఅంతా అయితే అన్నిటికీ అంతం మృత్యువే అవుతుంది. ఈ కాలప్రభావం నుండి మృత్యువునుండి 'సంసార్' అని మనం పిలిచే యీ శాశ్వత క్రమంనుండి తప్పించుకోలేమా అని మనం ప్రశ్నిస్తుంటాము.

కాలమని మీరు పిలుస్తుంటారు. మంచిదే. మనం కాలక్రమంలో జీవిస్తున్నాము. శాశ్వతత్వం ఉందని మనకు తెలుసు. అయితే భవిష్యత్తులోని శాశ్వతత్వమును గూర్చి తలుస్తూ యీ కాలప్రవాహంలో మానవుడు యెలా జీవించ గలుగుతాడు? ఈ రెండు ఒకేసారే పొందడం ఎలాసాధ్య మవుతుంది? మొత్తం విషయానికి రెండు ముగింపులు ఉండవచ్చు – తాత్కాలిక ముగింపు, శాశ్వతముగింపు. సక్రమ జీవనం, ఆత్మోన్నతి, మానసిక పరిణామము, మనోవికారాల విసర్జన – ఇవీ యిందుకు తోడ్పడే సాధనాలు.

అగ్నివర్ణం అన్ని చెడులను దహించివేస్తుంది.

మన సాధువులు యీ నారింజ వర్ణం గల దుస్తులను ధరిస్తారు. ఇది అగ్నివర్ణం. బుద్ధుడు కూడ ధరించాడు. ఆయన శిష్యులు యిప్పటికీ యీ వర్ణం దుస్తులనే ధరిస్తున్నారు.

మన పతాకంలో ప్రథమ సరసలో యీ వర్ణం యిచ్చారు. శాశ్వతానికి సోపానమైన యీ కాలచక్రపు ప్రపంచంలో ప్రతివ్యక్తి జీవనం సాగించడానికి యిది చిహ్నం. అందువల్లనే ఆవర్ణాన్ని మొదట ఉంచారు.

అదంతా యేమిటి!

నీవు యెన్నో కష్టాలు అనుభవిస్తావు. నీకు నీవు క్రమశిక్షణలో మెలగుతావు. నీకు నీవు బాధలు కల్పించుకుంటావు. ఇన్ని కష్టాలను అధిగమించి నీ ప్రకృతిలో ఒక విధమైన మార్పుకు ప్రయత్నిస్తావు. అయితే యిదేనా పరమావధి? కష్టాలను అనుభ

(మిగతా 47 వ పేజీలో)


రాష్ట్రపతి దక్షిణాది పర్యటన

రాజభవన్‌లో విందు





గవర్నరు, శ్రీమతి పట్టమ్‌థానుపిళ్ళె, శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి, శ్రీ బి. రామకృష్ణారావులతో రాష్ట్రపతి





ముఖ్యమంత్రి, శాసన సభాధ్యక్షులు శ్రీ బి. వి. సుబ్బారెడ్డి, శాసనమండలి అధ్యక్షులు శ్రీ జి బ్రహ్మయ్యలతో
రాష్ట్రపతి సంభాషిస్తున్న దృశ్యం




జూన్ 22 వ తేదీన రాజభవన్‌లో రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి
శ్రీ వై. శివరామప్రసాద్‌ను రాష్ట్రపతికి పరిచయం చేస్తున్న దృశ్యం



కేంద్ర ఉక్కుశాఖ మంత్రి డాక్టర్ ఎమ్. చెన్నారెడ్డి జూలై 6వ తేదీన రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతిని సందర్శించారు.



ఎ ఒ సి కేంద్రంలో రాష్ట్రపతి.



జూలై 10వ తేదీన రాష్ట్రపతి నెహ్రూజూలాజికల్ పార్కును సందర్శించారు.



జూలై 7వ తేదీన బొల్లారంలోని ఎ. ఒ. సి. కేంద్రానికి వచ్చినప్పుడు రాష్ట్రపతికి స్వాగతం చెప్పుతున్న బ్రిగేడియర్ జి. యం. సయీద్.



ప్రెస్ రిపోర్టర్స్ గిల్డువారు ప్రచురించిన సావెనీర్‌ను జూలై 10వ తేదీన రాష్ట్రపతి ఆవిష్కరించారు.




నెహ్రూజూలాజికల్ పార్కులో రాష్ట్రపతి 'అశోక' వృక్షం మొక్కను నాటారు.






రాష్ట్రపతి, రెవిన్యూమంత్రి శ్రీ యస్. రామచంద్రారెడ్డి పబ్లిక్‌వర్క్సు శాఖమంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి, ఆరోగ్య శాఖమంత్రి శ్రీ వై. శివరామప్రసాద్, వ్యవసాయ శాఖమంత్రి శ్రీ ఎ. బంగారురెడ్డి ప్రభృతులతోపాటు పార్కులో తేనీరు సేవిస్తున్న దృశ్యం.




రాష్ట్రపతి కారులో పార్కుచుట్టూ తిరిగారు ప్రదర్శనా వస్తువులను ఆసక్తితో తిలకించారు.



జూలై 12వ తేదీన రాష్ట్రపతి నిలయంలో జరిగిన విందులో రాష్ట్రపతితో గవర్నరు.



జూలై 12వ తేదీన రాష్ట్రపతి నిలయంలో జరిగిన విందులో రాష్ట్రపతితో ముఖ్యమంత్రి,




ప్రత్యేక రైలులో భద్రాచలానికి వెళ్ళడానికి ముందు రైల్వే అధికారులతో సంభాషిస్తున్న దృశ్యం.

భద్రాచలంలో




జూలై 13వ తేదీన భద్రాచలంరోడ్డు రైల్వేస్టేషన్‌లో అధికారసభ్యులను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి



భద్రాచలం రైల్వేస్టేషన్‌లో నెలకొల్పబడిన ప్రత్యేక షామియానాలో రాష్ట్రపతి.




జూలై 13వ తేదీన భద్రాచలంలో రాష్ట్రపతికి ముఖ్యమంత్రి స్వాగతం చెప్పుతున్న దృశ్యం.







రు. 60 లక్షల ఖర్చుతో భద్రాచలంవద్ద గోదావరిపై నిర్మించ [illegible] జూలై 13వ తేదీన రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేశారు.



బహిరంగసభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి "శ్రీ శంకరాచార్యులవారి ఆదేశానుసారము గర్భాలయ పునర్నిర్మాణ కార్యక్రమము కొనసాగుతున్నది." అన్నారు.




పబ్లిక్ వర్క్సుశాఖమంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి బహిరంగసభలో ఉపన్యసిస్తున్న దృశ్యం. "వచ్చే ఏడాదికి గౌతమి. వశిష్టనదులపై బహుశా మరో రెండు వంతెనలు పూర్తికావచ్చు."






బహిరంగసభను తిలకిస్తున్న సభికులు.



ఆలయ అర్చకులు రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న దృశ్యం.




ఆలయంలోని శ్రీరాముడు, సీత, లక్ష్మణుల విగ్రహాలు.


ఆలయంలో రాష్ట్రపతి



















సీతా రామ లక్ష్మణుల విగ్రహాల నమూనాలను రాష్ట్రపతికి బహూకరిస్తున్న దృశ్యం.



కొత్తగూడెం విద్యుదుత్పాదక కేంద్రం అధికారుల్ని రాష్ట్రపతికి పరిచయం చేస్తున్నప్పటి చిత్రం.



జూలై 14 న హైదరాబాదులో కళాభవనానికి ప్రారంభోత్సవం చేస్తున్నప్పటి చిత్రం



నిర్మాణంలో వున్న కొత్తగూడెం విద్యుదుత్పాదక కేంద్రం నమూనాను రాష్ట్రపతి జూలై 13 న సందర్శించినప్పటి చిత్రం.



కొత్తగూడెం విద్యుదుత్పాదక కేంద్రంలో జూలై 13 న ఆహూతుల పుస్తకంలో సంతకం చేస్తున్న రాష్ట్రపతి.



కళాభవనం ప్రారంభోత్సవ సందర్భంలో జ్యోతి వెలిగిస్తున్న రాష్ట్రపతి.

స్వాతంత్ర్య గీతి

దూపాటి సంపత్కుమారాచార్య

మ॥ ఇది మాభారత సుస్వతంత్రదివసం;
ఈనాడు భానుండు నిం
దుదితుండై పరదాస్యతాఽంధతమసం
బూడ్చెన్ దిగంతాల; న
భ్యుదయాకాంక్ష పదమ్ము వేసి నడచెన్
ప్రోత్సాహియై జాతి శాం
తి, దయా, సత్య పథంబు నిత్య మనుసందే
శమ్ము మార్మ్రోగగా॥

ఇది గతించినజీవిత మెల్ల స్మృతిప
థాన నిల్చుపర్వము; రక్తధార లొలుక
నార్జన మొనర్చుకొన్నయాయామహత్త్వ
శక్తి నిల్పుకో గల మని చాటనిమ్ము
తరతరమ్ముల మమ్ము స్వతంత్రలక్ష్మి!

ఈ గడ్డ ప్రతిబిడ్డ యేమహాశిల్పివి
ఖ్యాతినో రాల్గరగంగ పాడు;
నీ నేల ప్రతిబాల యేమహావీరచ
రితమునో తా పునస్సృష్టిచేయు;
నీ వీట ప్రతిచోట నేమహాగానమా
ధురులరసమ్మో నిర్ఝరులు వారు;
నీ స్థలాన పొలంబు లేమహాసస్యసం
పద జనించిన వాస్తవమ్మో తెలుపు;

సర్వదిక్తటులను యశశ్చంద్రికలను
జల్లె భారతచంద్రుడు; సాంద్ర మైన
యాస్వతంత్రతేజంబు మాయనివిధాన
సతము గడగుము! నీవు భారతకుమార!

ఒకనాట నీ సీమలో రతనాలు బ
జారుల విరజిమ్మినా రటంచు,
ఒకనాట నిట లలితకళావిలాసముల్
జగము లే పులకింప సాగె నంచు,
ఒకనాట మాభూమి నుజ్జ్వలసాహితీ
సంగీతవర్షమ్ము జారె ననుచు,
ఒకనాట పాశ్చాత్యు లుబ్బగా సర్వ
సౌభాగ్యమిట కొనసాగె నంచు,

ఒక్కనా డిట జాతి తా నొక్కడగుచు
శాంతియుద్ధమునందు విజయము నందె
నంచు కథలుగా వాకొనునట్టి ఘనత
తిరిగి నిలుపుకొందము భారతీయులార!

అలనాడు మరఫిరంగులగుండ్ల కెదురు ని
ల్చిన భారతీయుల స్మృతుల నిలిపి,
అలనాడు ఝాన్సిబా యగణిత స్వాతంత్ర్య
కాంక్షామహాదీక్షకవిత నిల్పి
అలనాడు జన్మహక్కుల నిల్ప త్యాగంబు
లొనరించువారి కేల్మోడ్చి మ్రొక్కి
అలనాడు మాతృపదాంకితమ్ముగ బలి
యైనవారి చరిత్రలందు నిలిపి.

సర్వము త్యజించి మాతృరక్షణ మొనర్చి
నేటిస్వాతంత్ర్యగీతిక నిస్వనింప
జేయుదేశనాయకులకు చేతులెత్తి,
మన స్వతంత్రగీతిక పాడుమా! కుమార!

అడవి మల్లె

సీరియల్ (గత సంచిక తరువాయి)

5

జరిగిన కథ

చిన్ననాడే తల్లిదండ్రులను పోగొట్టుకున్న చంద్రం, తన అన్న కృష్ణారావు చుట్టూ ఆశలతీవెల్ని చుట్టుకుని భవిష్యత్తుకలలు కంటుండగా, వదిన కాంతమ్మ సుడిగాలిలా వచ్చి తీగెల్ని కుప్పగా నేలకూల్చి, అతని బంగారు కలలపంట మీద ఆగ్రహాన్ని అగ్నిలా కురిపించి, భవిష్యత్తును మసిబొగ్గు చెయ్యబోయింది. భార్యకు జడిసి, తమ్ముడిమీద దొంగతనాన్ని రుద్ది, పశువులపాకలో రాటకు కట్టి వేశాడు అన్న. అనురాగాలు మసిబొగ్గయి అంధకారం అలముకున్న చీకట్లో చంద్రునికి ఒకేఒక ఆశాకిరణం పక్కింటి ప్రసాదరావుగారి కుమార్తె హేమ మాలిని. కాని మరోమూల అతి బీదగా రెండు చిన్న అమాయకపుకళ్ళు మిణుకుమిణుకుమని వెలిగాయి. అతనిమీద జాలిని కురిపించాయి ఆకళ్ళు. అమాయకురాలైన గౌరిమీద దుర్మార్గపు వ్యాపారం చేసే నాగేంద్రం, ఆదెమ్మలకు సానుభూతి కలుగుతుంది. స్వతహాగా అవినీతి వ్యాపారం చేస్తూ వుండే నాగేంద్రం గౌరిని పెళ్ళిచేసుకోవాలని చూడగా, ఆదెమ్మ తన చాకచక్యంతో, తన పాపపరిహారార్థం బాలిక అయిన గౌరిని అనాథశరణాలయంలో చేర్చి తన జీవితం మంచిమార్గంలో గడుపుతుంది.

గౌరి కట్లిప్పగానే గొడ్లచావిడి మొండి గోడ దూకిన చంద్రం, తను ఎటు వెళ్ళుతున్నదీ చూసుకోకుండా ఊళ్ళోకి చాలాదూరం పారిపోయాడు. అతడి ఉద్దేశం తను ఇంటి నుంచి ఎంతదూరం పోగలిగితే, అంత మంచి దని.

బాగా అలిసిపోయిన చంద్రం, ఒక వీధి మలుపులో గోడ కానుకుని నిలబడ్డాడు. ఆసరికి బాగా పొద్దెక్కి, ఎండ తీక్షణం కాసాగింది. చంద్రానికి ఎక్కడలేని ఆకలీ పుట్టుకొచ్చింది. ఇంట్లో వుండగా అత నేనాడూ అంత ఆకలి ఎరగడు. జేబులు తడువుకుంటే, ఒక్క అర్ధరూపాయి బిళ్ళ దొరికింది. దానితో ఆ దాపులనున్న హోటలులోకి పోయి, రెండు ఇడ్లీ తిని, కాఫీ తాగి సూటిగా పార్కులోకి వెళ్ళి, అక్కడ చెట్లమాటున వున్న ఒక బెంచీ మీద పడుకున్నాడు. బాగా అలిసిఉన్నాడేమో అతడికి నిద్రపట్టింది.

చాలా సేపటి తరవాత అతడు కళ్ళు తెరిచేసరికి చుట్టూ చిమ్మ చీకటి. బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ చంద్రం లేచి కూర్చు న్నాడు. పార్కులో జనం అంతగా లేరు. తను ఏదో విధంగా గుంటూరు వదిలి, ఎవరికంటా బడకుండా బొంబాయికి పారి పోవాలని అతడు నిశ్చయించుకున్నాడు. బొంబాయి — చాలా పెద్ద పట్టణమట. అక్కడ పనిలేనివా డంటూ వుండడట. అక్కడ తను చాతనైనపని ఏదోఒకటి చేసి బతగ్గలడు. కొంత డబ్బు కూడబెట్టిన తర వాత గురుకులానికి వెళ్ళి చదువుకోవాలి.

చంద్రం బయలుదేరాడు. ఒళ్ళంతా నొప్పులుగా వున్నది. జ్వరం తగిలినట్టు కాలిపోతున్నది. త నెక్కడికి పోవాలో ఆలోచించుకోకుండానే పార్కు వదలి నడవ సాగాడు. కొంతదూరం వెళ్ళేసరికి రైలు కట్ట కనిపించింది. దూరంగా రైలుకూత వినబడింది. రైలన్నా, రైలుస్టేషనన్నా అతడి కెందుకో దిగులూ, ఆనందంకూడా కలుగుతుంటుంది. ఇలా అంటే, స్కూల్లో అతడి స్నేహితులంతా నవ్వి, వేళాకోళం పట్టించేవాళ్లు. రైళ్ళు, విమానాలూ వచ్చి ప్రపంచాన్ని కుదించేశాయి — అంటాడు మేష్టరు. తనకుమాత్రం అలా అనిపించదు. ఇవి వచ్చింతరవాతే ప్రపంచం మరింత విశాలమైం దనుకుంటాడు. తను ఇష్టంలేని వాళ్ళనుంచి ఎంతదూరమైనా పారిపోయేం దుకు యీ రైళ్ళు, విమానాలూ బాగా ఉపయోగిస్తవి. ఇల్లేకాదు, ఈ దేశమే వద్దనుకుంటే, వాటి సహాయంతో మరోదేశం పోయి హాయిగా బతకవొచ్చు. అలా దేశమే వదలి పారిపోయినవాళ్లు కొందరున్నారట!

రైలుకట్టమీద ఇలా ఆలోచిస్తూ నడుస్తున్న చంద్రానికి, పట్టాలమీద నీడలా కదులు

వాసిరెడ్డి సీతాదేవి

తున్న ఓ ఆకారం కనిపించింది. ఆశ్చర్య పోతూ, చంద్రం అటుకేసి ఒకడుగు వేసేంతలో, స్టేషన్‌కేసి వస్తున్న రైలు పెద్ద కూత వేసి, మహావేగంగా ఆ ప్రాంతాన్ని సమీపిస్తున్నది. చంద్రం ఒక్కదూకులో పట్టాలమీదికి పోయి, అక్కడ వున్న ఆకారాన్ని రెండుచేతులతోనూ పట్టి పట్టాల మీంచి అవతలికి నెట్టి, కాలు నిలదొక్కుకోలేక దభీమంటూ ఆ ఆకారంమీద పడిపోయాడు. ఇంతలో రైలు ప్రళయభయంకరంగా గర్జిస్తూ దాటిపోయింది చంద్రం లేచి నిలబడ్డాడు. అంతవరకూ అతడితో పెనుగులాడిన ఆకారంకూడా లేచి నిలబడుతూనే, "ఎవరూ? చంద్రం!" అంటూ చంద్రాన్ని కావిలించుకుంది.

"నువ్వా, ప్రకాశం! ఏమిటిది? ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావా?" అన్నాడు చంద్రం, తన స్నేహితుణ్ణి గుర్తించి.

"అవును చంద్రం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాను. నువ్వు ఎందు కడ్డు తగిలావు? రెక్కల కష్టంమీద బతికే మా నాన్న నా చదువు కోసం ఎంతో ఖర్చుపెట్టాడు. నేను బాగా చదివి, ఏ ఐఏయస్ ఆఫీసర్నో అవుతా నని ఆయన ముచ్చటపడేవాడు. నేను పరీక్ష తప్పాను. ఈ సంగతి తెలిస్తే నాన్న ఎంత బాధపడతాడో నీకు తెలుసా!" అన్నాడు ప్రకాశం ఏడ్పుగొంతుతో.

"తెలివితక్కువగా మాట్లాడవోకు, ప్రకాశం. నువ్వు పరీక్షతప్పావని తెలిస్తేనే అంతబాధ పడే మీ నాన్న, నిజంగా నువ్వు ఆత్మహత్య చేసుకుంటే బతికుండగల డనుకుంటున్నావా?" అన్నాడు చంద్రం కోప్పడుతున్నట్టు.

"నువ్వన్నది నిజమే, చంద్రం. పరీక్ష తప్పానన్న విచారంలో యివేమీ నే నాలోచించలేదు. ప్రాణానికి తెగించి నన్ను కాపాడావు. పద. మా ఇంటికి పోదాం నువ్వీరాత్రికి మా ఇంట్లో వుండాలి," అంటూ ప్రకాశం ముందు దారితీశాడు.

చంద్రం మౌనంగా ప్రకాశంపక్కన నడవసాగాడు. హఠాత్తుగా ప్రకాశానికో అనుమానం కలిగింది. ఇంత రాత్రివేళ చంద్రం యీ రైలుకట్టకేసి ఎందు కొచ్చినట్టు? చంద్రంకూడా పరీక్ష తప్పాడు. అతడూ తనలాగే......

'చంద్రం! నువ్వీప్రాంతాని కెందు కొచ్చావ్? నాలాగే నువ్వూ...అవునా?" అని అడిగాడు ప్రకాశం.

"అలాంటి అనుమానం ఏమీ పెట్టుకోకు. నేను చచ్చేందుకు ఇటు రాలేదు. ఒకవేళ రైలుకిందపడి చచ్చినా, నాకోసం దిగులు పడేవాళ్ళెవరూ లేరు," అన్నాడు చంద్రం నిస్పృహగా.

"నీకోసం దిగులుపడేవాళ్ళే లేరా?" అంటూ ప్రకాశం ఆప్యాయంగా చంద్రం చేయి పట్టుకున్నాడు. చంద్రంచేయి వణికింది. అతడు గద్గదస్వరంతో, "అవును, ప్రకాశం! యీ లోకంలో నాకోసం దిగులుపడేవాడివి నువ్వొకడివి వున్నావు." అన్నాడు.

ఆ తరవాత యిద్దరూ మౌనంగా నడిచారు. ఇంటిని సమీపించేసరికి ప్రకాశం తండ్రి భద్రయ్య వాకిట్లో తల వంచుకుని విచారంగా కూర్చుని వుండటం వాళ్ళకు కనిపించింది. వాళ్ళు వస్తున్న అలికిడి వింటూనే భద్రయ్య తల ఎత్తి, వాళ్ళకేసి చూసి, కొడుకును గుర్తించి, "వచ్చావా, బాబూ!" అంటూ పరిగెత్తి వెళ్ళి ప్రకాశాన్ని కావిలించుకుని, "పరీక్ష తప్పినందుకు నీ వేం



అఘాయిత్యం చేసుకున్నావో అని పొద్దుటి నుంచీ కుమిలిపోతున్నాను. ఇంతకాలం ఎక్కడెక్కడ తిరుగుతున్నావు చంద్రం! నువ్వు పరీక్ష పాసయావా?" అంటూ ఆ ఇద్దర్నీ ఇంట్లోకి తీసుకుపోయాడు.

కొద్దిసేపటి తరవాత ప్రకాశం, చంద్రం భోజనం చేశారు. చంద్రానికి తిండి సహించలేదు. కాని, భద్రయ్య బలవంతం చేయగా తిన్నాడు. భద్రయ్య ఒకటికి రెండుసార్లు అడిగినమీదట, ప్రకాశాన్ని రైలు పట్టాలమీద తానెలాంటి స్థితిలో చూసిందీ అతడికి చెప్పాడు.

భద్రయ్య హృదయం చంద్రంపట్ల కృతజ్ఞతాభావంతో నిండిపోయింది. అతడు తనకు పుత్రభిక్ష పెట్టాడు! అంత చిన్నవాడికి తన కృతజ్ఞతాభావం ఎలాంటి మాటలతో చెప్పటం? భద్రయ్య చంద్రం చేతులు పట్టుకుని, నుదుటిమీద చేయి వేశాడు. అది వెచ్చగా వున్నట్టు తోచింది.

"చంద్రం, నీకు బాగా జ్వరం వచ్చినట్టున్నది. ఒరే, బాబూ ఆ మంచం వేసి చంద్రాన్ని అక్కడ పడుకోబెట్టు. నేను డాక్టర్ని పిలుచుకు వస్తాను," అంటూ భద్రయ్య, చంద్రం వద్దని వారిస్తున్నా వినక డాక్టరుకోసం పరిగెత్తాడు.

డాక్టరు వచ్చి చూచి, ఇది మామూలు జ్వరంలా లేదన్నాడు. ఏవో మందు లిచ్చాడు. మూడు నాలుగు రోజుల తరువాత అది టైఫాయిడు అని తేలింది. భద్రయ్య, కృష్ణారావుకోసం కబురు చేస్తా నన్నాడు. చంద్రం వద్దంటే వద్దనటమేగాక, అన్న అక్కడికి వచ్చేలా వుంటే, తను ఎటైనా పారిపోతా నన్నాడు. మీకు యిక్కడ ఇబ్బందిగా వుంటుందిగనక, తనను ధర్మాసుపత్రికి తీసుకుపొమ్మన్నాడు.

"ఎక్కువగా మాట్లడకు, చంద్రం! నువ్వు యిక్కడ వుండటం మాకిబ్బందిగా వుంటుందా? ఎంతమాట! నువ్వు నా బిడ్డను కాపాడావు: నా బిడ్డతో సమానుడివి." అంటూ భద్రయ్య పైపంచతో కళ్లు తుడుచుకున్నాడు.

"నేను పొరపాటుగా మాట్లాడాను, ఏమీ అనుకోకండి. ఈ టైఫాయిడ్ నన్నేమీ చేయలేదు. నేను బతుకుతాను; నేను నిర్దోషినని రుజువు చేస్తాను. కాని, ఒకవేళ యీ జ్వరంతో చచ్చిపోతే, నా శవాన్ని కాల్చివేసిన తరవాత, మా అన్నావాళ్ళకు కబురు చేయండి. చంద్రం చనిపోతూ తను డబ్బు దొంగిలించ లేదని అన్నట్టు ఆయనతో చెప్పండి," అంటూ చంద్రం కళ్ళనీరు పెట్టుకున్నాడు.

చంద్రానికి జ్వరం వదిలి, స్వస్థత కలిగేందుకు నెలరోజులు పట్టింది. ఆ తరవాత ఓ వారంరోజులు గడవగానే, చంద్రం, యిక తను వెళ్ళిపోతా నన్నాడు. భద్రయ్య ఒప్పుకోలేదు. "మరికాస్త ఆరోగ్యం కలగ్గానే వెళ్ళుదువుగాని. మా ప్రకాశం నీగురించి అంతా చెప్పాడు. నువ్వు డెహరాడూన్‌కో ఎక్కడికో వెళ్ళి చదువుకోవా లనుకుంటున్నావట, అలాగే చదువుకో. ప్రకాశం పాసయితే, కాలేజీ చదువు ఖర్చులకు వుంటుందని, ఏడు సంవత్సరాలుగా కొంత డబ్బు కూడబెట్టాను. ఆది యిప్పుడు ఆరువంద లయింది. ఆడబ్బు నీకిస్తాను. అది తీసుకుని మరికొంత ఆరోగ్యం కలిగింతరవాత, నువ్వెక్కడ చదువుకోవాలంటే, అక్కడికి వెళ్ళు. నువ్వు బాగా చదివి, ప్రయోజకుడివై తిరిగి రావాలని నా కోరిక," అన్నాడు భద్రయ్య.

"నాకు డబ్బవసరం లేదండీ, నా తిప్పలు నేను పడగలను," అన్నాడు చంద్రం.

"ఈ డబ్బే నీతండ్రి యిస్తానంటే. వద్దనగలవా?" అన్నాడు భద్రయ్య నిట్టూరుస్తూ.

"చంద్రం, నాన్న చెప్పినట్టు చెయ్యి. నాన్నకూ, నాకూ కూడా సంతోషం కలుగుతుంది," అన్నాడు ప్రకాశం.

వాళ్ళు చూపిన ఆదరానికి చంద్రంకళ్ళల్లో నీళ్ళు తిరిగినై. ఇంత ఆదరం, ప్రేమా అతడేనాడూ ఎరుగడు. డబ్బు తీసుకోవడానికి ఒప్పుకున్నాడు. కాని, అతడికో సంగతి తెలుసుకోవా లనివున్నది. తమ కుటుంబానికీ, యీ కుటుంబానికీ ఎందుకంత బద్ధవైరం? భద్రయ్య కాస్త తటపటాయించి, చివరకిలా చెప్పాడు:

"నువ్వింకా చిన్నవాడివి. అయినా బలవంతం చేశావుగనక చెపుతున్నాను. మా తాతగారిదీ, మీ ముత్తాతగారిదీ ఒకేఊరు. అప్పట్లో మాది చాలా మోతుబరి కుటుంబం కింద లెక్క. మీ ముత్తాతగారు కుటుంబ పోషణకు చాలా అవస్థలపా లవుతుండేవారట. ఆయన ఒకసారి మా తాతగారితో అన్నిసంగతులూ చెప్పుకున్నారు. మా తాత ఆయనకు మూడువందల రూపాయ లిచ్చి, గుంటూరు వెళ్ళి పొగాకుదుకాణం పెట్టుకోమని సలహా యిచ్చారు. ఆనాడు మూడువందల రూపాయలంటే, యిప్పటి మూడువేల రూపాయలతో సమానం.

మీ ముత్తాతగారు గుంటూరు వెళ్ళి వ్యాపారం సాగించారు. గిట్టుబాటుగానే వుంది. మరికొంత పెట్టుబడి పెట్టి, భారీ ఎత్తున వ్యాపారం చేయా లని ఆయనకు ఆలోచన వచ్చి, ఆమాట మా తాతగారితో చెప్పారు. వ్యాపారంలో భాగస్వామికమ్మన్నారు. అందుకొప్పుకుని, మా తాత, వున్నపొలం మమ్ముకు గుంటూరు చేరారు.

"మా తాతా, మీ ముత్తాతా వ్యాపారంలో భాగస్వాము లయారు. వ్యాపారగొడవ లన్నీ మీ ముత్తాతగారే చూసేవారు. వ్యాపారంలో ఎంత లాభాలు వస్తున్నదీ మా తాతకు తెలియదు. కుటుంబఖర్చులకు డబ్బుమాత్రం తీసుకుంటూ వుండేవారు. కొన్నేళ్ళు గడిచాయి. వ్యాపారం ఏపాటి లాభసాటిగా నడుస్తున్నదో తెలుసుకునేందుకు మా తాత, మీ ముత్తాతను ఆ వివరాలు అడిగారు. ఆ వివరా లన్నీ చెపితే నీకు వున్న మతిపోతుంది. కుటుంబ ఖర్చులకు సరిపడా డబ్బిస్తున్నా గదా? కాలక్షేపం చేసెయ్యి? అన్నారట మీ ముత్తాతగారు. ఇద్దరూ

(మిగితా 13వ పేజీలో)

స్వాతంత్ర్య దినోత్సవం

వక్కలంక లక్ష్మీపతిరావు

ఇది స్వతంత్ర దినోత్సవం!
ఇది పతాక దినోత్సవం!
ఇది హిమాచలసేతుమధ్యమ
హీ ప్రజానయనోత్సవం!

మాతృదాస్యము తలగ ద్రోసిన
మానధనుల మహోత్సవం
భారతీయ మహాజనావళి
బ్రతుకు పండిన ఉత్సవం!

దేశసేవకు పౌరు లందఱు
దీక్ష గైకొను ఉత్సవం!
అమరవీరుల దేశభక్తికి
అంజలించు మహోత్సవం!

మన పతాకము లాల్ ఖిలాపై
మొనసి యెగిరే ఉత్సవం!
బాపుజీ జవహరులు కని దీ
వనలు కురిసే ఉత్సవం!

భరతమాతకు ప్రజలు హృదయా
ర్పణ మొనర్చు మహోత్సవం!
ఉల్లముల జాతీయభావము
ఉరుక లేసే ఉత్సవం!

అమ్మ భారతి విజయగీతిక
లాలపించు మహోత్సవం!
శ్రావ్యముగ 'జయహింద్' నినాదము
జగతి నిండు మహోత్సవం!

ఇది స్వతంత్ర దినోత్సవం!

(12 వ పేజీ తరువాయి)

ఘర్షణ పడ్డారు. అసలు నీకు వ్యాపారంలో వాటాయేలేదు, పో పొమ్మన్నాడట మీ ముత్తాత. పల్లెలో మిగిలిన కొద్దిపొలమూ అమ్మి, కోర్టుకు వెళ్ళాడు. కేసు గెలవలేదు. లెక్కల పుస్తకాల్లో ఎక్కడా మా తాత వాటాదారు డన్న సంగతే లేదు. ఏదో జీతం డబ్బులు తీసుకుని పని చేసేవాడన్న ధోరణిలో ఆ లెక్క లన్నీ రాసివున్నయి.

"ఆ దెబ్బతో మా తాత మంచం పట్టి మూణ్ణెల్లు తిరక్కుండానే చనిపోయాడు. అప్పట్లో మా నాన్న హైస్కూల్లోనే అనుకుంటాను-చదువుతూండేవాడు. ఆరోజులలో ఆయన చాలా దుడుకుమనిషి. చదువు పాడవటం, వున్న చదువుతో మంచి వుద్యోగం దొరక్కపోవటంతో, ఆయన బాగా పగబట్టి, ఒక రోజున దారిలో ఒంటరిగా మీ ముత్తాతను దొరకపుచ్చుకుని బాగా కొట్టాడు. అప్పటికే ముసలివాడై వున్న మీ ముత్తాత, యీ దెబ్బలతో మంచంమీంచి లేవలేని స్థితికి వచ్చాడు. మా నాన్నమీద కోర్టులో కేసుమాత్రం పెట్టలేదు. కదిలిస్తే డొంకంతా కదిలి, తన పాత మోసా లన్నీ మళ్ళీ కోర్టు కెక్కుతవని ఆయన భయపడి వుంటాడు; ఏదేమయితేనేం. ఆనాటినుంచీ మీ కుటుంబం మా కుటుంబం బద్ధశత్రువు లైపోయారు.

"మానాన్న ఎక్కడా సరైన ఉద్యోగం దొరక్క. గోతాల మిల్లులో కూలీపనికి కుదిరాడు. ఆయన వారసత్వమే నాకూ వచ్చింది. ఎలాగో కాలక్షేపం చేస్తున్నాను. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న ప్రకాశం మీదే నా ఆశ లన్నీ; ఈ సంవత్సరం పరీక్ష తప్పా డని, వాడిమీద నా కేం కోపం లేదు. మరో సంవత్సరం చదివి పాసవుతాడు. నువ్వూ. ప్రకాశం స్నేహితులు కావటం, నా కెంతో సంతోషంగా ఉంది. వాణ్ణి రైలు కింద పడకుండా కాపాడి, మా వంశాన్ని నిలబెట్టావు. ఒకప్పుడు మీ కుటుంబమే. మా కుటుంబానికి రుణపడివున్న దనుకునే వాడ్ని. ఇప్పుడు మేమే మీ కెంతో రుణపడి వున్నాం. మా రుణం రూపాయలూ, అణాల్లో తీర్చకలిగింది కాదు."

భద్రయ్య చెప్పిందంతా శ్రద్ధగా విన్న చంద్రానికి తన కుటుంబం ఎంత నీచానికి ఒడిగట్టి, యీనాడు యింత ధనాన్ని కూడబెట్టిందో అర్థమయింది. కూలి చేసుకుని పొట్ట పోసుకునే భద్రయ్యముందు, తనూ, తన అన్నా ఎంతో అల్పులు! భద్రయ్య దారిద్ర్యానికి తన కుటుంబమే కారణం. కాని ఈనాడు ఆ భద్రయ్యే తన చదువుకోసం డబ్బిస్తున్నాడు.

చంద్రం హృదయంలో భద్రయ్యమీద కృతజ్ఞతాభావం పొంగి పొర్లింది. అతడు మైకం కమ్మినవాడిలా లేచి, భద్రయ్య కాళ్ళమీద పడిపోయాడు. భద్రయ్య అతన్ని ఎంతో ఆప్యాయతతో పైకెత్తి గుండెలకు హత్తుకున్నాడు.

(సశేషం)

మణినీ ముక్తావళి

జడబుద్ధి :

శ్లో॥ చిరం హ్యాపి జడశ్శూరః పండితం పర్యుపాస్య హి ।
న స ధర్మం విజానాతి దర్వీ సూపరసానివ ॥

ప్రాజ్ఞుడు :

ముహూర్తమపి తం ప్రాజ్ఞః పండితం పర్యుపాస్య హి ।
క్షిప్రం ధర్మం విజానాతి జిహ్వా సూపరసానివ ॥ ——మహాభారతము-వ్యాసముని.

"మూఢుడు ఎంతకాలము పండితుని సేవించినప్పటికిని, గరిటెకు వంటలరుచి తెలియనట్లు, ధర్మమును తెలిసికొన జాలడు."

"ప్రాజ్ఞుడు ఒక్కక్షణకాలము పండితుని సేవించినను చాలును. అతడు, నాలుక వంటలరుచి నెరిగినట్లు తొందరగా నే ధర్మమును గ్రహించ గలడు."

సత్పురుషులు :

శ్లో॥ అపి ముదముపయాంతః వాగ్విలాసైః స్వకీయైః
పరభణితిషు మోదం యాంతి సంతః కియంతః ।
నిజఘనమకరందస్యందిపూర్ణాలవాలః
కలశసలిలసేకం నేహతే కిం రసాలః ? ॥ ——సుభాషితము.

"తమవాగ్విలాసములచేతనే సంతసపడువారైనప్పటికిని సత్పురుషులు ఎందరో, ఇతరులమాటలను విని యానందించుచుందురు. సత్యమేకదా ! తనపూదేనెచేత పూర్తిగా తనపాదు నిండినప్పటికిని తియ్యమామిడిచెట్టు, తన పాదులో కడవలతో నీరుపోయుటను కోరదాయేమి ?"

కృతఘ్నుడు :

చ॥ ఒకరునిచేతిప్రోపున, దదున్నతిప్రాప్తను గాంచి, యెల్లవెం
టకును గొఱంత లేక పొగడందగుసంపద నొందినట్టిదా-
తకు దుదిఁ గీడు సేసినకృతఘ్నునిపీనుఁగు నైన రోత పు
ట్టక కబళింపఁ గుక్కలు నొడఁబడునే ? కురువంశవర్ధనా !" ——తిక్కన సోమయాజి.

ఎల్లప్పుడును అందరిప్రశంసలను పొందుచున్న దాతవలన రక్షణమును, ఆశ్రయమును పొందికూడ అతనికి అపకారముచేయుటకు పూనుకున్నకృతఘ్నునియొక్క పీనుగునుగూడ అసహ్యపడక తినుటకు కుక్కలు ఇష్టపడవుగదా!

సైంధవునిచేత చిక్కిన ద్రౌపది.

సీ॥ బూదిలోఁ దొరఁగి పూర్ణాహుతియుఁ బోలెఁ, గుక్కతోల్తిత్తిఁ గూరిపట్టి
రాజితకపిలగోరసధారయును బోలె, మసనంబులోఁ బడ్డమహితపుష్ప
మాలికయును బోలె మదిరాక్షి దుర్జనుకతమున దూషిత గాక మున్న
చనరయ్య ! వేగంబ, చనునె సన్మంత్రపవిత్రితపురోడాశంబు శునకమునకుఁ ?

తే॥గీ॥ జనునె కమలసుగంధికాసారకేళి కలుషశవభక్షకాది యైనశృగాలమునకుఁ ?
జనునె తన్వంగి సౌందర్యచతురభావ, భంగి యాదుష్టచరితునిపాలఁ బడఁగ?" ——ఎఱ్ఱాప్రెగ్గడ.

బూడిదలో పడిన ఆహుతివలె, కుక్కతోలుసంచిలో ఉంచిన ఆవుపాలువలె, వల్లకాటిలో బడిన మంచి పుష్పమాలికవలె, ఈ ద్రౌపది దుర్జనుడగు సైంధవుని చేతిలో బడి చెడిపోకపూర్వమే త్వరగా పోయి విడిపింపుడు. మంత్రపూతమగు పురోడాశము (యజ్ఞములో హోమము చేయబడు పిండిరొట్టె) కుక్కకు తగునా ? సుగంధమైన కమలసరస్సులో జలక్రీడ చేయుట, శవములను తిను నక్కకు, తగునా? సౌందర్యము, చాతుర్యము, హావభావములు గల కృశాంగియైన ద్రౌపది ఆ పాపాత్ముడైన సైంధవుని పాలబడుటకు తగునా ?

శ్రీరంగనాథస్వామి :

స్రగ్ధర ॥ సేవించెన్ రంగధామున్ శ్రితనివహపయస్సింధుసంపూర్ణసోమున్,
కావేరీమధ్యసీమున్, ఘనకలుషమహాకాలకూటోగ్రభీమున్,
దేవారిశ్రీవిరామున్, దివిజవినుతసందీపితానంత నామున్,
ధీవిజ్ఞానాభిరామున్, త్రిభువనవిలసద్దేవతాసార్వభౌమున్." —పోతనామాత్యుడు.

ఆశ్రితులైన భక్తులకు పాలసముద్రపుపూర్ణచంద్రునివలె మనస్సునకు కన్నులకును ఆనందదాయకుడును, కావేరీమధ్యప్రదేశమునందు వేంచేసియున్నవాడును, మహాపాపము లనెడుమహోగ్రవిషమునకు తీవ్రమగు భయమునుకలిగించువాడును, రాక్షసుల సంపదలను నశింపజేయువాడును, దేవతలచే పొగడబడు ఉజ్జ్వలములగు అసంఖ్యాకము లైన నామములు గలవాడును, జ్ఞానవిజ్ఞానములచేత ఒప్పుచున్నవాడును, మూడులోకములందు గల దేవత లందరికిని చక్రవర్తియు నగు శ్రీరంగనాథస్వామిని సేవించెను.

ఆతిథ్యాగౌరవము:

శా॥ అనిష్ఠానిధిగేహసీమ నడురే యాలించినన్ మ్రోగు నెం
తే నాగేంద్రశయానుపుణ్యకథలున్ దివ్యప్రబంధానుసం
ధానధ్వానము: "నాస్తి శాకబహుతా; నాస్త్యుష్ణతా; నాస్త్యపూ
పో; నాప్యోదనసౌష్ఠవం చ కృపయా భోక్తవ్య" మన్మాటలున్. —శ్రీకృష్ణదేవరాయలు.

ఆ పరమనైష్ఠికుడగువిష్ణుచిత్తునియింటిలో అర్ధరాత్రివేళలలోగూడ శ్రీమన్నారాయణమూర్తియొక్క పుణ్యకథలు దివ్యప్రబంధము (ద్రావిడ వేదము) పఠించుధ్వని, "కూరలు ఎక్కువలేవు, భోజనము వేడిగాలేదు, పిండివంటలు లేవు, అన్నము (భోజనము) బాగుగాలేదు, ఐనను కృపతో భోజనము చేయవలెను" అనుమాటలున్ను వినబడుచుండును. ఇది ఆతడు అతిథులకు చేయుగౌరవము."

అర్జునశౌర్యము.

శా॥ జెండాపైఁ గపిరాజు, ముందు సితవాజిశ్రేణియుం గూర్చి, నే
దండమ్ముం గొని తోలుస్యందనముమీఁదన్ నారి సారించుచున్,
గాండీవమ్ము ధరించి ఫల్గునుఁడు మూఁకన్ జెండుచున్నప్పు డొ
క్కండున్ నీమొఱ నాలకింపఁడు కురుక్ష్మానాథ! సంధింపఁగన్." —తిరుపతి వెంకటకవులు.

టెక్కెముపై హనుమంతుడు, ముందు తెల్లనిగుఱ్ఱములను గలిగి, నాగలిపై నేను కళ్ళెము బుచ్చుకొని తోలుచున్న రథముపై గాండీవమును ఎక్కుపెట్టి అర్జునుడు నీ సైన్యమును హతమార్చుచున్నప్పుడు, ఓ దుర్యోధనా! ఒక్కడుగూడ, నీవు సంధికి గోరినను, నీ మొఱను వినడుసుమా! ఇప్పుడే యోచించుకొను" మని కృష్ణుడు హితవులు చెప్పెను.

వర్షాకాల నదీనదములు.

తే॥ గీ॥ అల్పనదిసంగమోత్సుకు నాపగాబ్ధి, పతిని సంప్రతి గనుచు నధ్వముఁ గ్రమించి
నీచము లగునదాంతరనివహములను, దమకుఁ దామె మహానదుల్ త్వరగఁ జేరె."
—ఆంధ్రబిల్హణ.


సంస్కృతములో నదీశబ్దము స్త్రీలింగము, నదశబ్దము పుంలింగము. రెండును ఇంచుమించు ఒకే యర్థమును చెప్పుచున్నప్పటికిని, ఈ లింగభేదముచేత కవి ఆ రెంటిని చమత్కరించుచున్నాడు :—

"వర్షాకాలమునందు భూమి జలమయమైయుండగా సముద్రుడు నీచనదులసంగమముగూడ చేయుచున్నాడని మహానదులైన యమునా గంగాదులు పతియైన సముద్రునకు, అతడు నీచనదీసంగమము చేయకుండ,అతనికి పాఠము నేర్పవలెనను తలంపుతో తాము నీచనదముల (పుంలింగము)తోగూడ సాంగత్యము చేయ మొదలిడినవి. అనగా పతియైన సముద్రుడునీచనదీ సాంగత్యము వర్షాకాలములో చేయగా, అతడు నోట చెప్పినదో వినడని మహానదులు తాముగూడ నీచనద (పుం) సాంగత్యము చేయుచు అతనికి బుద్ధి నేర్పుచున్నవా యనున ట్లున్నది — అని ఉత్ప్రేక్ష.


మెట్రిక్ పద్ధతి మాత్రమే న్యాయమయిన పద్ధతి



కిలోగ్రాములు




మీటర్లు




లీటర్లు

లెక్కచొప్పుననే కొనండి

DA 64/678




కళాభవనంలో రాష్ట్రపతి, శ్రీ బి. గోపాలరెడ్డి, శ్రీ యల్. యన్. గుప్త, శ్రీ డి. రామానుజరావు గూడ చిత్రంలో ఉన్నారు.




కళాభవన్ ప్రారంభోత్సవ సందర్భంలో ప్రసంగించుచున్న రాష్ట్రపతి. "మానవ హృదయాల పునర్వికాసం జరుగవలసిన అవసరం ఎంతో ఉన్నది."






శ్రీమతి టి. టి. సీత సంగీత కార్యక్రమంతో సమావేశం పరిసమాప్తమైనది.



హైదరాబాద్ నుండి బయలుదేరుతున్న సమయంలో రాష్ట్రపతి రాకకు సంబంధించిన ఫోటో ఆల్బమ్ డాక్టర్ రాధాకృష్ణకు సమర్పించబడినది.




జూలై 15వ తేదీన హైదరాబాద్ నుండి బయలుదేరుతున్న రాష్ట్రపతి.




జూన్ 13వ తేదీన కడప జిల్లాలోని మంటపంపల్లిలో పంచాయత్ కార్యాలయానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం జరిపారు.




జూన్ 15వ తేదీన ప్రొద్దుటూరు బహూళార్థ సాధక ఉన్నత పాఠశాలలోని సైన్సు ప్రయోగశాలను ముఖ్యమంత్రి సందర్శించారు.



జూలై 6వ తేదీన కేంద్ర ప్రభుత్వ ఉక్కు శాఖ మంత్రికి విమానాశ్రయంలో పూలదండ వేసి స్వాగతమిస్తున్న ముఖ్యమంత్రి.







జూలై 6వ తేదీన ఎగ్జిబిషన్ క్లబ్‌లో డాక్టర్ యన్. సంజీవరెడ్డి.




కడపలోని సెంట్రల్ బ్యాంకులో జూన్ 13 వ తేదీన స్వర్గీయ శంభురెడ్డి చిత్రపటాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.




జూన్ 15 వ తేదీన చిన్నపెట్టిపల్లె నీటి సరఫరా పథకానికి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన జరిపారు.



నెహ్రూ జూలాజికల్ పార్కులో జూలై 4వ తేదీన మొక్కను నాటుతున్న సహకార శాఖామంత్రి శ్రీ తోట రామస్వామి.




జూన్ 23 వ తేదీన వరంగల్లులో జిల్లా గెజిటీర్సు యూనిట్‌కు రెవిన్యూ శాఖమంత్రి శ్రీ యస్. రామచంద్రారెడ్డి గారు ప్రారంభోత్సవం చేశారు







జూన్ 13 వ తేదీన సికింద్రాబాద్‌లోని పికెట్‌లో వర్ణాంతర వివాహాలు జరుపబడ్డాయి.



ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల అధికారుల సమావేశానికి జూన్ 14 వ తేదీన హైద్రాబాద్‌లో డాక్టర్ యమ్. చెన్నారెడ్డి ప్రారంభోత్సవం కావించినారు.



పరిశ్రమల అధికారుల సమావేశపు సభికులయొక్క దృశ్యం.



జూన్ 21 వ తేదీన తాండూర్ పంచాయత్ సమితిలోని సంగం (ఖుర్ద్) గ్రామంలో కాకరవేని నదీతీరాన సంగమేశ్వర లిఫ్ట్ ఇర్రిగేషన్ పథకానికి ప్రారంభోత్సవం జరుపుచున్న డాక్టర్ యమ్. చెన్నారెడ్డి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రెస్ ఉద్యోగుల సంఘపు నాలుగవ వార్షిక మహాసభకు జూన్ 10 వ తేదీన డాక్టర్ యమ్. చెన్నారెడ్డి ప్రారంభోత్సవం జరిపారు.

శరవేగంతో నిర్మింపబడుతున్న శ్రీశైలం ప్రాజక్టు

-కె. తా తా రా వు

స్వర్గీయ జవహర్లాల్ నెహ్రూ శ్రీశైలం జల విద్యుచ్ఛక్తి ప్రాజక్టుకు శంకు స్థాపనం చేసి యీ జూలై 24వ తేదీకి రెండేళ్ళు పూర్తయింది.

ఈ సందర్భంలో ప్రాజక్టు నిర్మాణంలో జరుగుతున్న పనిని సమీక్షిస్తే ఎంతో సంతృప్తి ద్యోతక మౌతుంది. నే నీ మధ్య అక్కడికి వెళ్ళినప్పుడు నిర్మాణకృషి శరవేగంతో సాగిపోతుండటం చూచాను.

నాగార్జున సాగర్ ప్రాజక్టుకు ఎగువన 60 మైళ్ళ దూరంలో కర్నూలు జిల్లా నంది కొట్కూర్ తాలూకాలో కృష్ణానదిపై యీ ప్రాజక్టు నిర్మించబడుతున్నది. 1935 లోనే సర్వే జరిగినా, అవిభక్త మద్రాసురాష్ట్రంలో తలెత్తిన ఇబ్బంధులు, ఆ తరువాత నదీ జలాల వివాదం ఫలితంగా ప్రాజక్టు నిర్మాణం వెనకబడిపోయింది. 1963 లోనే శంకు స్థాపన జరిగినా ప్రాజక్టుకు అవసరమైన సివిల్ వర్కు్స్ను రాష్ట్రప్రభుత్వం అంతకు ముందునుండే జరిపిస్తూ వచ్చింది.

విదేశీ మారకం మంజూరి కావడంలో ఏర్పడిన యిబ్బందుల వలన ప్రాజక్టు పని యీ రెండేళ్ళల్లో అనుకొన్నంత చురుగ్గా సాగలేదు. అయితే, రాష్ట్రప్రభుత్వం విదేశీ మారకానికి సంబంధించిన పని అలా ఉంచి మిగిలిన పనిని త్వరితగతిని జరిపించాలని నిర్ణయం గైకొనడంతో మళ్ళీ అతివేగంగా పాజక్టు నిర్మాణం కొనసాగుతున్నది.

నిజానికి యీ ప్రాజక్టు నిర్మాణం ఎంత శరవేగంగా జరిగితే అంత మంచిది. అటు నాగార్జునసాగర్ ప్రాజక్టు పని జరిగి పోతుండటంతో శ్రీశైలం ప్రాజక్టుపనిలో జాప్యం జరిగితే నీటిమట్టం పెరుగుదలవలన తర్వాత శ్రీశైలం డాం నిర్మాణానికి యిబ్బందులు ఏర్పడతాయి.

ఇది గమనించే రాష్ట్ర ప్రభుత్వం సుమారు 5,500 మంది కార్మికులతో నిరంతరం పని చేయిస్తున్నది. ఉత్సాహవంతులైన ఇంజనీర్ల మార్గదర్శకత్వంతో ప్రాజక్టు తమదే అనే దీక్షతో ఎండలో, వానలో యీ కార్మికులు పని చేస్తున్నారు.

ఈ ప్రాజక్టు నిర్మాణంలో ఉత్పన్నమయ్యే మొదటిసమస్య స్థలం లేకపోవడం–పనిచేయడానికీ, గాలి పీల్చుకోడానికీ తగినంత స్థలం కనిపించదు. ఏ నాగార్జున సాగర్‌లోనో, పోచంపాడులోనో మరో ప్రాజక్టు ప్రదేశంలోనో అయితే తేలిగ్గా క్రేన్‌లు, డ్రిల్లింగ్ యంత్రాలవంటివి అమర్చుకోడానికి కావలసినంత స్థలం ఉంటుంది.

శ్రీశైలం ప్రాజక్టు స్థలం అంతా రెండు బ్రహ్మాండమైన కొండల మధ్యగల వాలు మాత్రమే. అక్కడే యంత్రాలు అమర్చుకోవాలి. అక్కడే పని చేయాలి.

అయితే అక్కడి ప్రకృతి రమణీయత వర్ణనాతీతం. ఉన్నత శిఖరాల మధ్య మందగమనయై ప్రవహిస్తున్న కృష్ణానదీ దృశ్యం అక్కడ పని చేసేవారికి నిరంతరం ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

దగ్గర నున్న కర్నూలు, గుంటూరు, మహబూబ్‌నగరం జిల్లాల నుండే గాక విశాఖపట్నం జిల్లా నుండి వచ్చిన కార్మికులుకూడ ప్రాజక్టుపనిలో నిమగ్నమై ఉన్నారు. సాధారణంగా వర్కింగ్ సీజన్ నవంబర్ నుండి మే నెల వరకూ అయినా, యీ సంవత్సరం యింకా పెద్ద వర్షాలు ప్రారంభం కాకపోవడంతో నది సమీపంలో సొరంగం, మళ్ళింపు కాల్వల త్రవ్వకం కొనసాగుతూనే ఉంది. వీటిపని చాల వరకూ పూర్తయింది.

డాం నిర్మాణానికి యీ రెండూ అత్యవసరం. వచ్చే వర్కింగ్ సీజన్‌లో కృష్ణా నదీ జలాలన్నిటినీ రెండు కాఫర్ డాములతో అడ్డగించి 20 వేల క్యూసెక్‌లను సొరంగం ద్వారా, 10 వేల క్యూసెక్‌లను మళ్ళింపు కాల్వద్వారా మళ్ళించి డాం నిర్మాణం ప్రారంభిస్తారు.

మొత్తం శ్రీశైలంప్రాజక్టు ఖర్చుముందు అంచనా వేయబడిన 42 కోట్లనుండి 50 కోట్ల రూపాయిలకు పెరుగుతుండగా మళ్ళింపు సొరంగంఖర్చు అంచనా వేయబడిన రు. 137 లక్షలనుండి సుమారు కోటి రూపాయిలకూ

తగ్గడం విశేషం. కోటి రూపాయిల కంటె తక్కువలోనే తేల్తుందని సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ జె. రాజారావు అన్నారు. ఈ సొరంగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ కామేశ్వరరావు యిందుకు అభినందనీయుడు. అక్కడ నదికి కుడి వైపు పనులలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయిన శ్రీ వీరాస్వామి శరవేగంగా ప్రాజక్టు నిర్మాణం సాగడానికి పడుతున్న శ్రమా, కనబరుస్తున్న పట్టుదలా, దీక్షా గమనార్హం.

అటు సొరంగం పనిలోగాని, రెండో వైపు డాం స్థలిలో డ్రిల్లింగ్ పనులలో గాని ఎలాంటి రిస్కు తీసుకోకుండా ఉండడానికి అనుమానాస్పదంగా ఉన్న రాతి విషయంలో నిర్లక్ష్యము చేయడంలేదు. వీలైనంత వరకూ అలాంటి రాతిని పగలగొడుతున్నారు.

అక్కడ నిర్మించబడే డాం ఎత్తు 500 అడుగు లుంటుంది అది 18 వ బ్లాక్ వద్ద ప్రసిద్ధికెక్కిన పాతాళగంగకు దిగువన కృష్ణానది వెడల్పు అతి సన్నగా ఉన్న చోట నిర్మించబడుతుంది. రోడ్డు లెవెలులో 1680 అడుగుల పొడవున ఉండే యీ డాం 15 లక్షల క్యూసెక్‌ల వరదనీటిని డిశ్చార్జి చేయడానికి వీలుగా 826 అడుగుల భాగం వినియోగపడుతుంది. మిగిలిన భాగం మీదుగా నీరు ప్రవహించలేదు. అందులో 490 అడుగుల భాగాన్ని పవర్ డాం ఆక్రమిస్తుంది. పవర్ హౌస్ 450 X 140 అడుగుల ప్రదేశాన్ని ఆక్రమిస్తుంది. ముందు నాలుగు, తరువాత మూడు 110 మేగావాట్ల యూనిట్లు నెలకొల్పబడుతాయి.

అంటే శ్రీశైలం ప్రాజక్టు పూర్తయిన తరువాత 770 మేగావాట్ల విద్యుచ్ఛక్తి ఒకే ప్రదేశంలో లభిస్తుం దన్నమాట. వెయ్యి మేగావాట్ల ఫరమ్ పవర్ యిచ్చే మైసూరులోని శరావతి మినహా యింతటి జలవిద్యుచ్ఛక్తి ప్రాజక్టు మన దేశంలోఉండదు.

శ్రీశైలం రాష్ట్రానికి నడి బొడ్డున ఉండటం వలన యిక్కడి నుండి ట్రాన్స్‌మిషన్ తీగలు వేయడం అతి తేలిగ్గా చౌకగా జరుగుతుంది. అంటే యీ ప్రాజక్టు నిర్మాణం పూర్తయిన తరువాత రాష్ట్రంలో చౌకగా విద్యుచ్ఛక్తి లభిస్తుంది. నాల్గో ప్రణాళికాంతానికి ముందే ఎగువ సీలేరు. దిగువ సీలేరు, రామగుండం, కొత్తగూడెం విద్యుచ్ఛక్తి పథకాలుకూడా పూర్తయిపోతాయి.. అప్పటికి రాష్ట్రంలో పుష్కలంగా విద్యుచ్ఛక్తి లభిస్తుంది.

అయితే యీ ప్రాజక్టు పని యిప్పటివలె శరవేగంగా జరగడానికి బుల్‌డోజర్లు, డంపర్లు, షవల్స్‌లాంటి భారీ యంత్రాల్ని దిగుమతి చేసుకోడానికి కేంద్ర ప్రభుత్వం జాప్యం లేకుండా విదేశీ మారకాన్ని మంజూరీ చేయాలి. అమెరికా సహాయ సంస్థ (ఎ. ఐ. డి.) యీ ప్రాజక్టుకు కావలసిన సర్వ సామాగ్రిని సమకూరుస్తామని ముందు చెప్పింది. వచ్చే సంవత్సరం ఆ సహాయం సమకూర్చ గలమని యిప్పుడంటున్నది: అప్పటివరకూ వేచి ఉండడానికి వీలులేదు. అందువలన రష్యా, ఫ్రాన్స్ మొదలైన మరో దేశం ఏదైనా యిందుకు ముందుకు వస్తుందేమో గాలించడం జరుగుతున్నది.

సహాయం ఎవరు యివ్వజూచినా స్వీకరిస్తామనీ, అయితే అది సకాలంలో రావాలనీ ప్రాజక్టుల శాఖ కార్యదర్శి శ్రీ జి. ఏ. నరసింహారావు అన్నారు. ఆయన యీ విషయమై శ్రీశైలం ప్రాజక్టు చీఫ్ ఇంజనీరు శ్రీ ఎం. ఏ. రహ్మాన్‌తో సహా ఎన్నోసార్లు ఢిల్లీ వెళ్ళి కేంద్రంతో చర్చలు జరిపారు. ఏమైనా ముందు కేంద్రం పూనుకోవాలి.

ఈ ప్రాజక్టుకు సిమెంట్ సమస్య యింత వరకూ ఎదురవ్వలేదు. అయితే వచ్చే మూడు మాసాల కాలానికి 4,500 టన్నుల సిమెంటు కావాలి.

ఈ ప్రాజక్టు విషయంలో ఒక్క సొరంగం పని పటేల్ ఇంజనీరింగ్ కంపెనీ వారికి యిచ్చారు. మిగిలిన కంట్రాక్టులన్నీ రాష్ట్రంలోనివారికే యిచ్చారు.

ఆ మధ్య డాం ప్రదేశానికి దిగువన ఒక తాత్కాలిక వంతెనను నిర్మించి హైద్రాబాద్‌తో కలిసేటట్లు ఎడమవైపున రోడ్డు వేశారు. దీనితో శ్రీశైలం హైద్రాబాద్ మధ్య దూరం 130 మైళ్ళకు తగ్గిపోయింది. ఈ మార్గం లేకపోతే రాజధానినుండి కర్నూలు మీదుగానే శ్రీశైలం వెళ్ళవలసి ఉంటుంది. అంటే హైద్రాబాద్–కర్నూలు 240 కిలో మీటర్లు; కర్నూలు–శ్రీశైలం 112 మైళ్ళు.

వర్షాలు ప్రారంభమౌతున్నందున తాత్కాలిక వంతెనను పడగొట్టివేశా రీ మధ్య; నలభై లక్షల రూపాయలతో శాశ్వత వంతెనను నిర్మించడానికి శ్రీశైలం ప్రాజక్టు కంట్రోలు బోర్డు జూన్ 10 వ తేదీన హైద్రాబాద్‌లో సమావేశమై నిర్ణయించింది.

తాత్కాలిక వంతెన వేసినచోటే యీ శాశ్వత వంతెనను నిర్మించవచ్చునని లోగడ అనుకొన్నారు. కాని నాగార్జున సాగర్ వంతెన కూలిపోయిన అనుభవం దృష్ట్యా డాం కు 6,500 అడుగుల దిగువన లింగాలగట్టు అనబడే ప్రదేశంవద్ద యీ వంతెనను నిర్మించడానికి హైద్రాబాద్‌లోని హైడ్రాలిక్ పరిశోధనాలయంలో పరిశోధనలు జరుపుతున్నారు. స్థల నిర్ణయం ఇంకా జరగలేదు.

ప్రాజక్టు నిర్మాణం వలన కృష్ణానదికి కుడివైపున 10 వేలకు పైగా జనాభా ఉండే పట్టణం వెలిసింది. అక్కడ ప్రాజక్టు ఉద్యోగులకు 1800 క్వార్టర్లు నిర్మించారు. ఉద్యోగులకు అనేక విధాల సౌకర్యాలు కల్పించారు. ఉచితంగా యిల్లు, విద్యుచ్ఛక్తి నీరు యిస్తూ, మలేరియా అలవెన్సు, రిక్రియేషన్ క్లబ్బు, పార్కు, సహకార స్టోర్సు సమకూర్చబడినాయి. 350 మంది విద్యార్థులతో ఉన్నత పాఠశాల ఉంది. 30 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి అవుతున్నది.

(మిగతా ప్రక్క పేజీలో)

కృష్ణానుభూతి ★

రత్నాకర

భయదమున్, సుదాభము, ప్ర
    పంచమునందలి జీవగర్భితా
శయము నెఱింగితిన్ తుదకు;
    స్వర్భువనంబు నతిక్రమించు శ్రీ
ప్రియుచరణంబులందు రహి,
    స్పృథ్వి క్షుధాహృదయంబు నా హృదిన్
స్వయమనుభూతమై, అమృత
    భాసుర నేత్రయుగంబు గాంచితిన్॥

ప్రియతము వేణునాదమున
    పెంపగు నుజ్జ్వలరాగ మాత్మలో,
అయమగు మౌననిష్ఠ విని,
    యందితి నిత్యరసానుభూతి వి
స్మయతను; హృద్విషాదరుచి
    సంతత మౌనము కోరి కంటి, నా

ప్రియు మధుగాన మల్లదె. స్ఫు
    రించెను చేరువ చేరువై హృదిన్॥
చేరున యయ్యొ గానము, వి
    చిత్ర రసానుభవంబు చెంది వే
మారు వణంకె ప్రాణము, ర
    మాధవు స్పర్శ రహించి శ్లిష్టమై
చేరి, అభేద నిర్వృతిని
    జెందు మనోరథ మందగోరి, వి
స్తార విమోహమై, ప్రకృతి
    స్తబ్ధతగాంచె నికేమి చెప్పుదున్॥

ఈ ముహూర్తంబు కోసమై యెదురు చూచి,
గతయుగంబులు జీవించె; కాంచినాడ
పరమ నిర్వాణసుఖము; విశ్వంబు నాదు
హృదిని పరిపూర్ణ మగుచు స్పందించు నిపుడు॥

(ప్రక్క పేజీనుంచి)

పోస్టు ఆఫీసు, పోలీస్ స్టేషన్ ఉన్నాయి. హైద్రాబాద్‌తో వైర్‌లెస్ సౌకర్యం ఉంది. అయితే బయట ప్రపంచంతో టెలిఫోన్ సంబంధం లేదు. అంతరంగిక టెలిఫోన్ విధానం ఉంది. త్వరలో కర్నూలుతో ట్రంక్‌ఫోన్ వస్తున్నది.

అయితే అక్కడివారికి అన్ని వస్తువులూ అధిక ధరలకే దొరుకుతాయి. కూరగాయలు దొరకవు. అన్ని వస్తువులూ గుంటూరు ఒంగోలు ప్రాంతాలనుండి రావాలి. దగ్గరలో నున్న రైలు స్టేషన్- మార్కాపురం—58 మైళ్ళదూరంలో ఉంది.

అందువలన యిలాటి ప్రాజక్టులలో పని చేసేవారికి ప్రత్యేకంగా బోనసు యిచ్చే పథకాన్ని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని జూన్ 11వ తేదీన పబ్లిక్ వర్క్సు మంత్రి ప్రకటించారు. దీనివలన అక్కడి ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేయడానికి వీలవుతుంది.

అయితే కుడివైపు పట్టణం నేటికీ సుండిపెంట అనే పేరుతో వ్యవహరించ బడుతున్నది. ఆ ప్రాంతాలలో నివసిస్తున్న కొండజాతి చెంచులు అలాంటి పేర్లతో వ్యవహరించేవారు. అయితే యిప్పటికైనా నాగార్జున సాగర్‌వద్ద విజయపురి వలె యిక్కడి పట్టణానికి ఒక ఆధునికమైన పేరు పెట్టుకోవడం మంచిది. ఈ విషయం పరిశీలనకు వచ్చిందనీ, నెహ్రూ నగర్ అనిగాని, శ్రీశైలంలో శ్రీ ఉండేటట్లు మరో నగర్ అనిగాని పేరుపెట్టాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తున్నది.

నదికి ఎడమవైపున ఎలాంటి పట్టణమూ వెలయలేదు. సర్క్యూట్ హౌస్, సి. ఇ. ఎస్. ఇ. క్వార్టర్స్‌తో సహా కొన్ని యిండ్లను అక్కడ నిర్మించడానికి ప్రాజక్టు అధికారులు సంకల్పిస్తున్నారు. ప్రధాన కంట్రాక్టర్ల కాలనీ కూడా అక్కడే నిర్మించబడుతుంది క్రమంగా ఎడమవైపే ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. అది హైద్రాబాద్ వైపు ఉంది కాబట్టి, కుడివైపు పట్టణం ప్రాజక్టు నిర్మాణంతో కొంత ప్రాముఖ్యాన్ని కోల్పోతుంది. అప్పుడిక కేవలం నిర్వాహక సిబ్బంది మాత్రమే ఉంటుంది.

అయితే అక్కడ పుష్కలంగా నీరు చౌకగా విద్యుచ్ఛక్తి సరాఫరా అవుతాయి గనుక ఆప్రాంతం బ్రహ్మాండమైన పారిశ్రామిక కేంద్రంగా రూపొందగలదని ప్రాజక్టు ఇంజనీర్లు భావిస్తున్నారు. త్వరలో కృష్ణానదిపై నిర్మించబడే వంతెన అందుకు దోహదం చేస్తుంది.

ఈ అధునాతన దేవాలయానికి చేరువలో ఉన్న అతి ప్రాచీన దేవాలయం శ్రీ భ్రమరాంబా మల్లికార్జునస్వామి ఆలయం. అక్కడికివచ్చే యాత్రికుల సంఖ్యకూడ విపరీతంగా పెరిగిపోతోంది. ✲

బతికిన కాలేజి

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్ : 5

జరిగిన కథ

శంకరయ్య జ్యోతిషంలో దిట్ట. ఆ యింటిలోని అందరికందరూ తలా ఒక తరహా మనుషులు. కూతురు రాధ పెళ్ళి సంబంధం నిమిత్తం వెళ్ళిన పెళ్ళివాళ్ళు పేరయ్య, పట్టూ మరికొంతమంది పరివారంతో అకస్మాత్తుగా అడుగు పెడతారు. పెళ్ళి ప్రస్తావన జ్యోతిషంమీదకు ఎగిరి, సిద్ధాంత, రాద్ధాంతాలతో సిగపట్లగొత్రంవరకూ వచ్చేసరికి ఆ యింటి యిల్లాలు శాంతమ్మ అతి తెలివిగా ముందుచూపుతో కళ్ళుతిరిగి పడిపోవటంతో గొడవ మాని ఎవరి దారిన వాళ్లు చల్లగా జారుకుంటారు. అయితే రాధ అందంఎరలో చిక్కుకున్న పట్టూ, పేరయ్య సహాయంతో స్నేహితుడైన చింతా సలహాకై అతనివద్దకు వెళతాడు. చింతా సలహాతో రంగంలో దిగిన పేరయ్య రామయ్యవద్ద పెళ్ళి ప్రస్తావన తెచ్చి పట్టూ రాధనే పెళ్ళి చేసుకోవాలనుకున్న సంగతి తెలియజేస్తాడు. రామయ్య మంగలిరాముడి సహాయంతో పట్టూ పథకానికి అడ్డుపుల్ల వేసి తన బాధ్యత నెరవేర్చుకుంటాడు. కాని పరిస్థితి తీవ్రమైకమారుడు ఇల్లు వదిలేస్థితిలో రామయ్య తాను ఓడిపోయానని గ్రహించినా దానికిమాత్రం సమ్మతించడు.

అది మొదలు పేరయ్య అసులోకండె పాత్ర ధరించాడు. ఈకొసనుంచి ఒక సూత్రాన్ని అవతలకి మోసుకుపోవడం, దాన్ని అవతల లంకెవేసి మళ్ళీ ఆసూత్రాన్ని ఈకొసకి పట్టుకురావడం, ఇల్లా తన నిర్విరామకృషివల్ల ఆఖరికి సంబంధాన్ని అల్లేశాడు. సృష్టిలో ఎవరూ చెయ్యలేని పని సాధించానని గర్వపడ్డాడు. కట్నాల విషయంలో తగాదాలొస్తే కాస్త తెలివిగా మధ్యస్థం చేసి పరిష్కరించొచ్చు. జాతకాల విషయంలో అభిప్రాయభేదాలొచ్చినా, సర్దడానికి అవకాశముంది. పిల్లతండ్రి – పెళ్ళికొడుకు తండ్రిని అవమానించినప్పుడు – స్పష్టంగా నువ్వు వెధవ్వు అని తిట్టినప్పుడు– ఇంక సంబంధం కలవడం అసంభవం. పెళ్ళికొడుకు తండ్రి – పిల్ల తండ్రిని ఆమాటన్నప్పకీ ఇంకాకాస్త అవకాశముంది. ఎంచేతంటే, పిల్ల నిచ్చుకునేవాడు ఎలాగా వెధవే. కాని ఈ ప్రస్తుత సంబంధం విషయంలోమాత్రం తను జీవితాంతం చెప్పుకోతగ్గ విజయం సాధించాడు పేరయ్య. ఈ విజయంలో తనపాలు ఎంత ? అన్న ప్రశ్న అతనికి అప్రస్తుతం. విజయం తనది, అని అతడు నిర్ధారణచేసుకున్నాడు, అంతే. అందులో శంకరయ్యతో మాట్లాడినప్పుడు అతని ధీమా, చాకచక్యం చూస్తే విజయం అతనిదే నని ఒప్పుకుతీరాలి.

"చూడు శంకరయ్యా ! ఇంక ఈ విషయంలో నువ్వు నోరెత్తడానికి వీల్లేదు. ఒకసారి నీ మూర్ఖత్వంవల్ల అంతా చెడిపోయిందన్న సంగతి గుర్తుంచుకో. చెప్పవలిసినదంతా నేను చెప్పుతాను. తద్దినం పెట్టేవాడి తమ్ముడిలా నువ్వు మసనుకో, తెలిసిందా.

"అల్లాగే." అన్నాడు శంకరయ్య.

"వొచ్చే ఆదివారం పొద్దున్న తొమ్మిది గంటలకి చంద్రుడు తులలో ప్రవేశించగానే –"

"అదుగో మళ్ళీ నీ ఎడంచెయ్యి తియ్యి. నా పుర్రచెయ్యి పెడతానంటావేమిటీ ? వాళ్ళనిక్కడికి నే నెప్పుడు తీసుకొస్తే అప్పుడు చంద్రుడు తులలో ప్రవేశించాడన్నమాటే– తెలిసిందా ? నోరు మూసుకుని కూచోడం నీకు చేతకాకపోతే, ఆ సమయానికి మరో ఊరు వెళ్ళిపో, నేను నడిపిస్తా వ్యవహారం. తెలిసిందా ? అంతేగాని నీ చంద్రుణ్ణీ, తులనీ ఈ సందర్భంలో మాత్రం బయటికి రానియ్యకు. అర్దమయిందా ?"

శంకరయ్యకి అర్థమయింది. పేరయ్య పరిగెత్తాడు. అక్షరాలా పరిగెత్తాడు. వ్యవహారం చాలాగడ్డుది, వేడి చల్లారకండా సుత్తిదెబ్బ పడకపోతే ఇనుము అనుకున్న ఆకారంలోకిరాదు.

అంచేత దారిలో కాఫీ భోజనంవంటి అంతరాయాల నన్నింటినీ పక్కకి నెట్టేసి, రెక్కలు గట్టుకు వాలినట్టు, రామయ్య సమక్షంలో వాలాడు. సంప్రతింపులు నడిపిన రెండురోజులూ అతను స్నానం చెయ్యలేదు. గుడ్డలుకూడా మార్చుకోలేదంటే, అతని పట్టుదల ఎటువంటిదో మీకర్థ మౌతుంది.

"అంతా నీ కొదిలేశాడయ్యా." అన్నాడు పేరయ్య రామయ్యతో.

"పిల్లని చూసుకోవడానికి మీ రెప్పుడొచ్చినా సరే. ముహూర్తం నువ్వే పెట్టెయ్యి."

"వొద్దు." అని కంగారుగా అరిచాడు పట్టూ.

పేరయ్యా రామయ్యా విస్తుపోయారు. కొడుక్కు నిజంగా దెయ్యం పట్టిందేమో నన్న సందేహం రామయ్యని ఈనాటి వరకూ వొదిలిపెట్టలేదు. అతన్ని భూతాల పిచ్చెయ్య చేతుల్లో పెట్టడం అన్నివిధాలా మంచిదేమో నన్న ఆలోచన తరుచు వొస్తూనేఉంది. పట్టూ అరుపు వినగానే,

పోనీ అత న్నొక్కసారి పిలుద్దామా అని కూడా అనుకున్నాడు. కాని తరవాత అనిన మాటలు అతన్ని కాస్త వెనక్కు లాగాయి.

"పిల్లని చూడక్కర్లేదు." అన్నాడు పట్టూ. "పెళ్ళికి ముహూర్తం పెట్టించెయ్యి."

"అది కాదురా..." అన్నాడు రామయ్య.

"మళ్ళీ మీ రిద్దరూ దెబ్బలాడుకుంటే— ఆయనా నువ్వూ?" అన్నాడు పట్టూ.

పట్టూ చెప్పింది సబబుగానే తోచింది రామయ్యకి. కాని దెయ్యాలు అప్పుడప్పుడు సబబుగానే మాట్లాడతాయట. అయితే ఈ విషయం వివరించకుండానే రామయ్య పట్టూ చెప్పినట్టు ఒప్పుకున్నాడు.

అతడు ఒప్పుకోవడానికి చాలా కారణాలున్నాయి. పట్టూని దెయ్యం పట్టుకుందనిగాని, అతనికి పిచ్చెక్కిందనిగాని బైటికి పొక్కిందంటే అతని కింక పెళ్ళవడం కష్టం; కష్టమేమిటి; అసంభవ మని చెప్పవచ్చు. మరో కారణం ఏమిటంటే, అవి చెప్పినట్టు కొంత వరకూ ఒప్పుకుంటే, దెయ్యాల్ని మంచిమాటలవల్ల లొంగదీయవచ్చు నంటారు. అన్నిటికన్నా ముఖ్యమైన కారణం ఏమిటంటే — పెళ్ళయితే పిచ్చి కుదురుతుందని పెద్ద లన్నారు. దెయ్యాలు పట్టుకోవడం, గాలి తగలడం వంటి అవస్థలన్నీ 'పిచ్చి'కిందే లెక్కగట్టాడు రామయ్య. అదీగాక అసలు ఈ 'పిచ్చి' 'పెళ్ళి'తో ప్రారంభమయినట్టు కనబడుతోంది — అంటే పెళ్ళి చెడిపోవడంతో ఇప్పుడిదిక "పెళ్ళి ముందా, పిచ్చి కుదరడం ముందా." అన్న మీమాంసలో పడితే దానికి పరిష్కారం దొరకదు. అందుకని తన అభిమాన మంతా దిగమింగుకుని. ఈ సంబంధానికి ఒప్పుకున్నాడు రామయ్య. కొడుకు పరోక్షంలో పేరయ్యని ఒక్కటిమాత్రం కోరాడు — శంకరయ్యచేత తనని క్షమార్పణ చెప్పించాలని. పేరయ్యకి అదెంతపని? శంకరయ్య అసలు మేకలాంటి మనిషి.

అంతా సవ్యంగా జరిగిపోతుం దనుకున్న సందర్భంలో, అనుకోకుండా శాంతమ్మ ఒక అడ్డుపుల్ల వేసింది. రామయ్యగారి వంశవృక్షాన్ని ఆమె తల్లివేరుదాకా పరిశీలించిన సందర్భంలో, శాంతమ్మకి బొత్తిగా రుచించని ఒకసత్యం బయట పడింది. రామయ్య ముత్తాతగారి మేనత్త, ఒక కలెక్టరుగారింట్లో వంటమనిషిగా పనిచేసిందట! అటువంటి సంగరంతో సంబంధం పెట్టుకుంటే ఆవిడ వంశానికి మూలవిరాట్టైన దివాన్‌గారి గౌరవానికి ఎంతదెబ్బ? పేరయ్యా శంకరయ్యా ఎంత నచ్చజెప్పటానికి ప్రయత్నించినా లాభం లేకపోయింది. శాంతమ్మతోటి ఒక పెద్ద చిక్కుంది. తను చెప్పినదానికి ఎవరన్నా కాదంటే, ఆవిడ మరింత బిగిసిపోతుంది. ఆవిణ్ణి దారికి తీసుకురావాలంటే ఆవిడ అన్నదాన్ని వెంటనే బలపరచాలి. పేరయ్య చేసిన పొరపాటేమిటంటే, ఆవిడ అభ్యంతరం చెప్పగానే—

"ఆ! ఏదో మూడుతరాల వెనక ఆవిడెవత్తో వంటపని చేస్తే, ఇప్పుడా కుటుంబానికి కొరతేమిటమ్మా?" అన్నాడు; అలా అసకండా పేరయ్యగనక—

"ఇంకా నయం ఆ మూడుముళ్ళూ పడ్డాక తెలిస్తే కొంప మునిగిపోను. రామరామ— వంటమనిషి ఛఛ. వాళ్ళింటో పారేస్తామా— మనమ్మాయిని?"— అంటే— అప్పుడు శాంతమ్మ "పోనీలే— ఏదో మూడుతరాల వెనకటి కథగదా, ఇంకా ఎవరికి జ్ఞాపకం ఉండి ఏడిసింది గనకా. ఫరవాలేదులే," అని ఉండును.

ఒక్కసారి బిగిసిపోయాక శాంతమ్మ పట్టు విడవదు. పేరయ్య తన ప్రయత్నమంతా గంగపాలై పోయిం దనుకున్నాడు. ఆ పరిస్థితిలో మిస్టర్ చింతా ఆదుకున్నాడు. తన బంధువుల్లో మరీ ముసిలివాళ్ళు-తొంభై



య్యాపడి - ఇంచుమించులో వాళ్ళు ఎంత మంది ఉన్నారో— అందులో చింతలపల్లితో సంబంధం ఉన్నవా ళ్ళెవరో ఆచూకీ తీశారు. వాళ్ళ సహాయంతో చింతలపల్లి దివాన్‌గారి వంశాన్ని చారిత్రక పరిశోధనకి గురి చేశాడు. అసలు ఆరవై ఏళ్ళు దాటగానే ప్రతి మనిషీ ఆత్మహత్య చేసుకు చచ్చిపోవాలనీ, అలా చచ్చిపోని వాళ్ళని ప్రభుత్వం వేటాడి చంపెయ్యాలనీ అతని సిద్ధాంతం ఒక టుంది. అతని వాదం ఏమంటే— అరవై ఏళ్ళు దాటిన మనిషి— అన్ని విధాలా సమాజం పురోభివృద్ధికి అడ్డు పడతాడు. అస లతను సమాజానికి బొత్తిగా అనవసరంకూడాను. ఈ రోజుల్లో ఈ ముసిలాళ్లు అడుగడుగునా యువకులకి అడ్డు తగులుతున్నారు. పించను పుచ్చుకున్న ముసలి పీనుగులు మళ్ళీ ఉద్యోగాల్లో ప్రవేశించి యువకుల అవకాశాల్ని అపహరిస్తున్నారు. డబ్బూ, తెలివితేటలూ అన్నీ ఉన్న యువకుడు పెద్ద చదువులకి పై దేశాలకు పోతానంటే, ముప్ఫై ఏళ్ళుగా మంచంపట్టిన ముసలిబామ్మ బేరుమంటుంది. దాంతో అమ్మా నాన్నా ససేమిరా అంటారు. మంచి ఉత్సాహవంతు డైన యువకుడు, ఎందుకూ కొరగాని మెట్టపొలం అమ్మేసి, కొడుకు పళ్ళడబ్బాల ఫ్యాక్టరీ పెడతానంటే, "అయ్యో, అది పిత్రియంరా నాయనా, దాన్ని అమ్మేస్తే నన్ను చంపుకుతిన్నట్టే." అంటుంది విధవప్పగారు. అందుచేత నాగరక సమాజం అనవసర వ్యక్తుల్ని నిర్దాక్షిణ్యంగా తొలిగించిపారెయ్యా లని అతని వాదం. అయితే, ఈ చారిత్రక పరిశోధన సందర్భంలో— కాటికి కాళ్ళుచాచుకున్న ముసలిపండుకూడా ఒక్కొక్క విపరీతమయిన సందర్భంలో ఉపయోగపడొచ్చునని మిస్టర్ చింతా గ్రహించాడు. వెంటనే తన సిద్ధాంతం తప్పని ఒప్పుకున్నాడు. ప్రస్తుతం అతని పరిశోధన కుపయోగించిన ఆసామీ అతని బంధువన్నా కాడు; అతని బంధువులకు ఇరుగుపొరుగువాళ్ళ - దూరపు చుట్టం. పదేళ్ళక్రితం చుట్టపు చూపులుగా వచ్చి పక్షవాతం తెచ్చుకుని, వాళ్ళింట్లో పడిపోయాడు. అతనికున్న కొద్దిపాటి ఆస్తికే వారసు లెవళ్లూ లేని కారణంగా, ఆ చుట్టాలితన్ని ఎంతో ఆదరంగా ఆదుకున్నారు; తన ఆస్తంతా తన అనంతరం ఆ చుట్టాల కిస్తానని అతడు ఒప్పుకున్నాట్ట. అయితే తీరా ఆస్తి ఇచ్చేస్తే ఆ చుట్టాలు ఏమి అఘాయిత్యం తలపెడతారో అని అతడు వ్రాతమూలకంగా ఏమీ చెయ్య లేదు. అతన్ని తొందర పెడితే, కోపమొచ్చి మరోచోటికి పోతాడేమోనని— అతడికి ఆశ్రయ మివ్వడానికి, వాళ్ళ చుట్టాల్లోనే కొందరు దుర్మార్గులు సిద్ధంగా ఉన్నారనీ, అప్పుడే కొంద రతనికి రహస్యంగా ఆహ్వానాలు అందజేశారనీ వీరికి తెలిసింది— ఈ చుట్టాలు తమ చిరాకును తమలోనే అణచిపెట్టుకున్నారు. ఈ కథంతా తన బంధువులైన ఒక ముసలమ్మద్వారా మిస్టర్ చింతా విన్నాడు. ఇదంతా అప్రస్తుతమైనా, ఆ పక్షవాతానికి గురి యయిన ఆసామీ తత్వం కొంతవరకూ తెలుస్తుందని ఇక్కడ ఉదహరించడం జరిగింది. అంతేగాకుండా మిస్టర్ చింతా ఆసామీని చూడాలని ఆ ఇంటి యజమానిని అడిగినప్పుడు, ఆ యజమాని వీల్లేదన్నాడు.

అబ్బే! ఏదో పాపం సున్నితంగా అలా కాలక్షేపం చేసుకొస్తున్నాడు. ఎవరన్నా మాట్లాడిస్తే అలిసిపోతాడు." అన్నాడాయన.

"చూడండి విఘ్నేశ్వరంగారూ——"

"నా పేర్లు గణేశ మండీ —"

"క్షమించండి వినాయకంగారూ!... మీ పేరేమన్నారూ!... గణాచారికాదూ... సారీ, చూడండి. వారి ఆస్తి రాయించుకోడానికి గాని, వారి నిక్కణ్ణించి తీసుకుపోడానికిగాని నేను రాలేదు. అటువంటి అభిప్రాయాలున్న దుర్మార్గుల తరపున ఏజెంటుగానూ నేను రాలేదు."

"అయ్యయ్యో— అదేంకాదండి... నేనన్నది— ఆయన శరీరంస్థితి—"

"చూడండి — వినాశంగారూ—"

"నాపేరు గణేశమండి..."

"సారీ— క్షమించండి... ఇది ఉంచండి..."అని మిస్టర్ చింతా ఒక పచ్చనోటు ఆ యజమాని చేతిలో పెట్టాడు. ఆ యజమాని కళ్ళు పెద్దవయాయి. పెదవులు చిరునవ్వునవ్వుతున్నట్టు విచ్చుకున్నాయి.

"దయచెయ్యండి — ఇలాగ" అంటూ మిస్టర్ చింతాని రోగి పడుకున్న గదిలోకి తీసుకువెళ్ళాడు. దుమ్ము దులిపి ఒకకుర్చీ వెయ్యబోయ్యాడు. మిస్టర్ చింతా నిరాకరించాడు. రోగి మూలగడం మొదలు పెట్టాడు. గణేశం అన్నాడు —

"బాబాయి! నిన్ను చూడ్డాని కొచ్చారు వీరు."

రోగి మరింత మూలిగాడు. మిస్టర్ చింతా తనజేబులు తడుముకుని,

"అరే, అగ్గిపెట్టి ఏమైంది?" అనుకున్నాడు, నోట్లో చుట్ట పెట్టుకుని.

"నే తెస్తానండి." అంటూ గణేశం లోపలికి వెళ్ళాడు. మిస్టర్ చింతా చటుకుని రోగికి దగ్గరగా వంగి,

"అయ్యా! నేను వైద్యుణ్ణికాదు, మీ వారసుణ్ణికాదు. అంత మీరు మూలిగి శ్రమపడ్డం అనవసరం." అన్నాడు. రోగి మిస్టర్ చింతావంక కొంచెం కోపంగా చూశాడు. మిస్టర్ చింతా చిరునవ్వు నవ్వాడు. రోగికూడా నవ్వాడు. గణేశం అగ్గిపెట్టితో వచ్చేసరికి మిస్టర్ చింతా రోగి మంచం అంచుని కూర్చుని అతిచనువుగా మాట్లాడుతున్నాడు; అదీగాక చుట్ట వెలుగుతూంది. గణేశం అనుమానించాడు, కాని కాస్త సంభాషణ విన్నాక అతని అనుమానం నిరాధారమైనదని తేలిపోయింది. అయినా విషయం కాస్త కుతూహలం కలిగించేది గనక తనుకూడా కూర్చుని విన్నాడు.

"అద్భుతం!" అన్నాడు మిస్టర్ చింతా. "అయితే లేటుదివాన్‌గారి మేనమామ, రాజావారి ఇంట్లో నీళ్ళుమోసే వాడన్నమాట"

"ఆన తీయన దివా నెల్లా అయాడు మరి. మా బాబాయికి అప్పుడు బాగా చిన్నతనమే అనుకోండి. ఆయన చెప్పా డీ కథ; వాళ్ళ అమ్మమ్మ చెపుతుండేదట; ఆ మేనమామకి ఒక్కర్తే ఆడపిల్లట. ఈయన్ని అల్లుణ్ణి చేసుకుని రాజావారిని ఆశ్రయించి కాస్త పెద్ద చదువులు చెప్పించాట్ట. ఇంతకీ ఆ కుర్రవాడు మెరికి లాంటివాడు లెండి. అతని తెలివితేటలు చూచి, రాజావారు ఇంగ్లాండుకూడా తీసికెళితే అక్కడ ఇంగ్లీషువాళ్ళతో సమాన ఫాయాని మాట్లాడేశాట్ట — ఆ తరవాత రాజావారే బారిష్టర్ పరీక్షకి డబ్బిచ్చి, పాసయి దేశానికి తిరిగొచ్చాక........"

"చూడండి. ఆ చరిత్రంతా సరే. ఈ సంగతి — అంటే — దివాన్‌గారి మేనమామ నీళ్ళబ్రాహ్మణు డైనట్టు — మీ దగ్గిర పాత ఉత్తరాల్లో ఏదన్నా......"

"అబ్బే! అదెల్లా ఉంటుంది నాయనా.! అయినా ఏనాటి సంగతిది?"

"పోనీ చింతలపల్లి పోస్టు ముద్రతో ఉన్న ఉత్తరా లేంలేవూ?"

"లేకేం — అయితే రంగు మాసిపోయి సరిగ్గా కనబడవు —"

గణేశం అవులిస్తే పేగులు లెక్కపెట్ట గల సమర్థుడు. తన బాబాయి పాతపెట్టె తిరగేసి 1885 చింతలపల్లి పోస్టుముద్ర ఉన్న కార్డొకటి పట్టాడు. కాస్త కరక్కాయిసిరా, బాతుఈక కలం, రంగు మాయడానికి బూడిద సహాయంతో మాసిపోయిన పాత పంక్తులమీద ఆనవాలు తెలీకుండా కొత్త ఉత్తరం తయారుచేశాడు గణేశం. అతని చాకచక్యం కళ్ళారా చూశాక ముసలివాడికి తెలీకుండా అతని వీలునామా ఒకటి అప్పుడే తయారైపోయి ఉంటుందని నిర్ణయించుకున్నాడు మిస్టర్ చింతా. గణేశానికి మరో వంద — ఈ సందర్భం మింజామలె — ముట్టింది.

అకస్మాత్తుగా శాంతమ్మకి ఒక ఉత్తరం వచ్చింది. రాసినవాడు ఆకాశ రామన్న. అందులో మరో కార్డుంది. ఉత్తరం ఇది;

"చింతలపల్లి దివాన్‌గారి వంశీయురాలైన శ్రీమతి శాంతమ్మగారూ, వంటమనిషి వంశీయుణ్ణి. నీళ్ళబ్రాహ్మడి సంగరానికి గౌరవ ప్రతిపత్తుల విషయంలో ఏమాత్రం తీసిపో రనుకుంటాను.

ఇట్లు
మీ శ్రేయోభిలాషి.

తా. క:— ఇందులో పంపిన పాతకాలపు కార్డు మీకు రుజువుకోసం పంపడమైంది.

తా. తా. క.:— ఆ కార్డు మీరు చింపివేసినా ఇటువంటి రుజువులు నావద్ద మరికొన్ని ఉన్నవని ఇందుమూలంగా తెలియజేయడమైనది. మీ అమ్మాయి పెళ్ళి జరిగినపిమ్మట మాత్రం అవి ఏమీ బయటికి రావని నా హామీ —— మీ.........

శాంతమ్మ ఉత్తరం, ఉత్తరం లోపలి ఉత్తరం ఎంత కోపంగా చింపేసినా, దాని సారాంశం ఆవిడ బుర్ర కెక్కకపోలేదు. ఈ విషయం పదిమందిలోనూ ప్రచారం కాకుండా ఉండాలంటే ఈ పెళ్ళికి తను ఒప్పుకుతీరాలి.

ఆ తరవాత పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభమయాయి. ఈ సందర్భంలో ఈ కథకి సంబంధించిన వివిధ పాత్రల్ని గురించీ పరామర్శించడం అప్రస్తుతంకాదు.

మొదట ఇంటికి పెద్దయిన శంకరయ్య విషయం. ఆయన పంచాంగాలూ, జాతక గ్రంథాలూ, సలుగురైదుగురు ఈ పిచ్చి బాగా ఉన్న స్నేహితులూ, వాళ్ళ స్నేహితులూ, అందరితోటీ అరుగుమీద కూర్చుని, కడవలతో కాఫీ తాగుతూ, మిగతా వాళ్ళ చేత తాగిస్తూ, కాబోయే వియ్యంకుడుపెట్టిన ముహూర్తం అంత మరీ చెడ్డది కాదని నిరూపించుకోడానికి నానాతంటాలూ పడుతున్నాడు.

"ముహూర్తం నిర్ణయమైపోయాక ఇంకా ఎందుకండీ ఈ గొడవ? పందిళ్ళూ పాకలూ కాస్త చూడక," అంది శాంతమ్మ.

"పందిళ్ళూ అవీ అవుతున్నాయిగా," అన్నాడు శంకరయ్య.

ఇంక శాంతమ్మ — ఆవిడ మంచంమీదే కూర్చుని సాయం చెయ్యడానికి వచ్చిన అమ్మలక్కలమీద అజమాయిషీ చేస్తోంది. పదిమందికీ ఆజ్ఞలు జారీచేసీ, వాళ్ళు చేసిన మిఠాయిలూ మినపసున్నేలూ రుచి చూసీ, దాహం తీరడానికి మజ్జిగ కడవలకొద్దీ తాగి తాగీ, ఆవిడ అలిసిపోతూంది.

కామన్న మాత్రం తనకి ఈ పెళ్ళితో సంబంధ మేమీ లేనట్టు తన ఆసనాల్లోనే మునిగితేలుతున్నాడు. అందులోంచి అతన్ని ఇవతలికి లాగి పెళ్ళిబాధ్యతలు అతనిమీద పెట్టడానికి శాంతమ్మకికూడా చేతకాలేదు.

కల్యాణి పెళ్ళికూతురైనా, పెళ్ళిపనుల బాధ్యతంతా ఆమెమీదే పడింది. రాధ అనుక్షణం తను చేస్తానని అడ్డుపడుతున్నా కల్యాణిమాత్రం చెయ్యనివ్వడంలేదు. ఒక కారణం — రాధచేత ఏపనీ చేయించకుండా ఉండడం కల్యాణికి చిన్నతనంనించీ అలవాటైపోయింది. మరో కారణం ఏమంటే, ఈపెళ్ళిని తలుచుకుంటేనే ఆమెకేదో కంగారుగా ఉంది. పెళ్ళిచూపుల సందర్భంలో జరిగిన పెద్ద దెబ్బలాట, ఆ తరువాత సంప్రదింపులు, వంశవృక్షాలు, ఆకాశరామన్న ఉత్తరం, ఇవన్నీ కలిసి, ఇదేదో అబద్ధమో, కలో అన్నట్టుంది. ఆమె ఆ ఆందోళననించి తప్పించుకోడానికి పనిలో మునిగితేలడంతప్ప మరోమార్గం

కనిపించలేదామెకు. నిద్రలోకూడా ఏదో ఆందోళనా, అర్థంలేని కలలూ ఆమెను ఆవిరి పెడుతున్నాయి. ఇది తొందరగా ముగిసిపోతే ఈ మాయలోంచి బయట పడగలనని ఆమె కొక ఆశ.

రాధకిమాత్రం ఇదంతా తను తరుచు చదివే నవలల్లో ప్రధాన ఘట్టంలాగుంది. ఆమెకు ఆ నవలలే నిజం. అంచేత ఈఘట్టం ఎంతో నిజమైనది. అదీగాక, కల్యాణి పెళ్ళికొడుకుని చూడలేదు. తను చూసింది. క్షణంసేపే అనుకోండి – చూడ్డం మటుకు చూసింది. అతని ఆకారం రూపురేఖలూ ఎంతవరకూ ఆమెకు గుర్తున్నాయో ఆమెకే తెలియదు. ఊహానీ నిజాన్నీ కలగలిపేసి ఆమె ఒక వింత పెళ్ళికొడుకుని సృష్టించుకుంది.

"ఎంత కలకల్లాడుతూ ఉందనుకున్నావు అతనిముఖం! కళ్ళలో ఏదో మంచి వెలుగుందేఅక్కా. 'ప్రేమబికారి' నవలలో 'మధు'లేడూ! అచ్చంగా అల్లాగే వున్నాడే. మంచిపొడగరి. మరీ అంత కాదనుకో. ముఖం అంత కోలాకాదు గుండ్రం కాదనుకుంటా. ముక్కూ కళ్ళూనే! నేను చూసినప్పుడు నేలమీద బోర్లా పడిపోయి ఉన్నాడులే. అంచేత పచ్చని పసుపో, చామనఛాయో సరిగ్గా కనబడలేదు. కాని కళ్ళలోమట్టుకు ప్రేమ ఉట్టిపడిందే! అచ్చంగా కథలో మధులాగే. తన తల్లిదండ్రుల్ని కాదని, నిన్ను పెళ్ళిచేసుకోడానికి సిద్ధపడ్డాడు. ఎంత అదృష్టమే నీది అక్కా? "ప్రేమదేవత,"లో కూడా సరిగ్గా ఇల్లాగే జరిగిందే. రాం పిల్లని చూడ్డానికొచ్చాడు. పెద్దవాళ్ళు దెబ్బలాడుకున్నారు. పిల్లతండ్రి పిల్లని అతనికి చూపించనన్నాడు. కాని అనుకోకుండా ఏ తలుపు సందులోంచో అతను పిల్లని చూశాడు. ఒసేవు అక్కా! రాం వాళ్ళనాన్నతో అన్న ముక్కలు ఎంతబాగా రాశాడే ప్రేమశ్రీ! 'ఎండిపోయిన మీ హృదయాలకు ఎండమావులవంటిది ప్రేమ. అందని ద్రాక్ష పండ్లను పులుపని అపహసించిన నక్కల వలె, మీరు ప్రేమను వెక్కిరిస్తారు.'"

"అబ్బ! చాల్లేవే నీ పిచ్చి వాగుడూ నువ్వూను." అని వారిస్తుంది కల్యాణి. కాని కల్యాణి కీ పుస్తకాల్లో ప్రేమ అబద్ధమని నమ్మకం. అది నిజం కావాలని ఆశ. అంచేత రాధమాటలు విన్నప్పుడల్లా ఆమె గుండెలు ఎంతో ఆవేశంతో కొట్టుకుంటాయి. అయితే తన మనస్సును అందోళనపెట్టే రకరకాల ఉద్రేకాలూ, ఉత్సాహాలూ, భయాలూ, అపనమ్మకాలూ, ఆశలూ, నిస్పృహలూ, ఇవన్నీ తనవి. అవి తన చెల్లెలితోనైనా పంచుకోడం ఆమె కిష్టంలేదు. ఆమె తన జీవితంలో ఎవరూ భంగపరచని ఏకాంతాన్ని కోరుకోడం అదే మొదటిసారి.

ఇక పట్టూ విషయం. అత వసలు భూమిమీదే లేడు. తాడు తెగిన గాలిపటం లాగ అతని మనస్సు ఆకాశంలో దిక్కూ తెలియకుండా కొట్టుకుపోతోంది. అంచేత అతను మిస్టర్ చింతా చుట్టలు కాల్చడం మొదలెట్టాడు. ఆ చుట్టల్ని సిగరెట్లలాగ కాల్చిపారేస్తున్నాడు.

మిస్టర్ చింతా మట్టుకు, పట్టూ పరధ్యానంగా ఆ చుట్టలతో ఇంటికి నిప్పంటించకుండా జాగ్రత్త పడుతున్నాడు. పెళ్ళికి తప్పకుండా రావాలని పట్టూ పట్టుపట్టినప్పుడు మిస్టర్ చింతా రానని కచ్చితంగా చెప్పేశాడు. పెళ్ళనేది, ఒక పిల్లకీ పిల్లవాడికీ మధ్య జరగవలసిన వ్యవహారం. మూడో వ్యక్తి అనవసరమే కాదు, పెద్ద అడ్డంకి కూడాను. పెళ్ళి లాంఛనంగా జరిగిన వెంటనే, పిల్లా పిల్లవాడూ అందర్నీ వొదిలేసి, అడ్రసు తెలియని చోటికి వెళ్ళిపోవాలి. పిండివంటలూ, విందుభోజనాలూ మిగిలిన జనాభాకి వదిలేసి వెళ్ళిపోవాలి. పట్టూకి ఆ సలహా నచ్చింది. ఆ కార్యక్రమం ఆచరణలో పెట్టడానికి పట్టూ, మిస్టర్ చింతా కారడిగాడు. భూమేదో ఆకాశమేదో తెలియని స్థితిలో ఉన్న పెళ్ళికొడుకు చేతులో తన కొత్త ప్లిమతు పెట్టడానికి మిస్టర్ చింతా అంగీకరించలేదు.

కావలిస్తే మన పాత గ్రాహమ్ పేజ్ టూరరుంది. అది బాగుచేయించి తీసుకుపో. గరాజ్‌లో ఉంది. టూరర్ గనక వూరేగింపుకు పనికొస్తుంది. నీ కలాంటి సరదా ఉంటే సుమా —"

అది మొదలు పట్టూకి గ్రాహంపేజ్ బాగుచేయించే పని తగిలింది. పెళ్ళి వారం రోజులే ఉంది. అంచేత ఒక మెకానిక్‌ని పిలిపించి, కారుకింద దూరి నట్లూ, బోల్టులూ చెప్పి బిగించాడు. అతని చర్మంలోని రంధ్రాలద్వారా నల్లని గ్రీజు శాశ్వతంగా శరీరంలోకి పాకిపోయింది. అంచేత స్నానం చేసి, కొత్త బట్టలు వేసుకున్నా, మిస్టర్ చింతా అతన్ని తన గదిలోకి రానివ్వలేదు.

పెళ్ళి రేపనగా కారు మొదటిసారి కదిలింది. బద్ధకించిన నరాలూ, వేళ్లూ మొదట కాస్త బిర్రబిగిశాయి. పెటపెటలూ, చిరాకులతో కొంచెం తన అభ్యంతరాన్ని ప్రకటించింది కారు; తరవాత కదిలింది. కదిలిన తరవాత ఇక పట్టూకి స్నానం చెయ్యడానికి కూడా తీరిక చిక్కలేదు. అప్పటి కప్పుడు బయలుదేరితే తప్ప ఉదయం స్నాతకానికి పెళ్ళివారి ఊరు చేరుకోవటం కష్టం. మంగళా స్నానాలప్పుడే, ఇంక గ్రీజు వొదలదు.

(సశేషం)

హైదరాబాదులో ప్రధానమంత్రి




జూలై 6వ తేదీన విమానాశ్రయంలో హార్దిక స్వాగతం.



ప్రధానమంత్రికి స్వాగతమిస్తున్న గవర్నర్.



ప్రధానమంత్రిని పూలహారంతో అలంకరిస్తున్న ముఖ్యమంత్రి.





గవర్నర్, ముఖ్యమంత్రితో ప్రధానమంత్రి.






ప్రధానమంత్రిని ఆహ్వానిస్తున్న అధికారులు, అనధికారులు, ఇతర ప్రముఖులు.






నెలపుడిసం కొంటపోయినా ప్రధానమంత్రికి స్వాగతం ఇవ్వడానికి విమానాశ్రయానికి విచ్చేసిన జనసమూహం.





కారులో శ్రీ యన్. సంజీవరెడ్డి, శ్రీ కె. బ్రహ్మానందరెడ్డిగారలతో కలిసి రాజభవన్‌కు వెళ్తున్న ప్రధానమంత్రి.



ప్రధానమంత్రికి స్వాగతమిస్తున్న బడిపిల్లలు



రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి —

ప్రభుత్వ రికార్డుల భవనానికి ప్రారంభోత్సవం




ప్రభుత్వ రికార్డుల భవనంలో ప్రధానమంత్రికి పుష్ప గుచ్ఛాన్ని సమర్పించుచున్న సాంస్కృతిక శాఖామంత్రి శ్రీ యమ్. ఆర్. అప్పారావు.




ప్రధానమంత్రిని ఆహ్వానిస్తున్న శ్రీ యమ్. ఆర్. అప్పారావు.




ప్రభుత్వ రికార్డుల భవనానికి ప్రారంభోత్సవం కావిస్తున్న ప్రధానమంత్రి.






ఆదే సందర్భంలో ప్రసంగించుతున్న ప్రధానమంత్రి — "పరిశోధకులకు పెన్నిధివంటిది" అన్నారు.




ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి ఉపన్యసించుతున్న దృశ్యం.




కృతజ్ఞతలు సమర్పించుతున్న ప్రధాన కార్యదర్శి.



ప్రభుత్వ రికార్డుల భవనంలో రికార్డులను పరిశీలించుతున్న ప్రధానమంత్రి.



"హైదరాబాద్‌లో యిదొక ప్రత్యేకమైన సంస్థ. ఇది ప్రజలకు విజ్ఞానకేంద్రముగా ఉండగలదు."



ప్రభుత్వ రికార్డుల భవనంయొక్క ఒకదృశ్యం.





రాజ్‌భవన్‌లో పత్రికా ప్రతినిధులతో ప్రధానమంత్రి.



రాష్ట్రపతి నిలయంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రిణి శ్రీమతి సుశీలానయార్.




రాజ్‌భవన్‌లో శ్రీమతి మెహ్‌దీ నవాజ్‌జంగుతో ముచ్చటించుతున్న ప్రధానమంత్రి.



రాష్ట్రపతి నిలయంలో ప్రధాన మంత్రితో కరచాలనం చేసున్న కార్మిక, రవాణా మరియు సమాచారశాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి, వారి ప్రక్కన శాసనమండలి మాజీ అధ్యక్షులు శ్రీ యమ్. హనుమంతరావు.



రాజ్‌భవన్‌లో ప్రధానమంత్రి. శ్రీమతి లలితాశాస్త్రి, గవర్నర్, శ్రీమతి పట్టం థానుపిళ్ళే —




రాజ్ భవన్ లో విందు.




శ్రీమతి లలితాశాస్త్రి, శ్రీమతి పట్టం థానుపిళ్ళై.




బాలబాలికలతో శ్రీమతి లలితాశాస్త్రి.




రాజ్ భవన్ లో గవర్నర్ తో ప్రధానమంత్రి.





రాజధాని నగరంలో శ్రీ అశోక్ మెహతా






జూన్ 30 వ తేదీన ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేయబడిన సమావేశంలో ప్రసంగించుచున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ అశోక్ మెహతా.




జూలై 1 వ తేదీన ఫేర్‌లాన్స్‌లో జరిగిన విందులో ముఖ్యమంత్రితో శ్రీ అశోక్ మెహతా.



ప్రధానకార్యదర్శితో శ్రీ అశోక్ మెహతా.




జూన్ 30వ తేదీన జూబిలిహాలులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సభ్యుల సమావేశంలో ప్రసంగించుచున్న శ్రీ అశోక్ మెహతా.



సమావేశంలో ఉపన్యసించుచున్న ఆర్థిక, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ యమ్. చెన్నారెడ్డి.



జూన్ 30వ తేదీన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ యేర్పాటుచేసిన సమావేశంలో కృతజ్ఞతలు సమర్పించుచున్న ప్రధాన కార్యదర్శి.



జూలై 3వ తేదీన నాగార్జునసాగర్ వద్ద శ్రీ అశోక్ మెహతా.

పెద్దనార్యుని ప్రయోగ నైపుణి

వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

మహాకవులు ప్రయోగించు శబ్దములు రసనిర్భరములై శాస్త్రములందలి పదములవలెఁ బరిమితార్థప్రదములు గాక యాలోచించుకొలఁది యర్థస్ఫూర్తి నొసగుచుండును. ఆ పదముల యర్థసంపద తత్పఠితల యాలోచనశక్తిపై నాధారపడియుండును. సాహిత్య మాలోచనామృతముగదా!

సురుచిరాంధ్రప్రబంధములలో బహుళ జనాదరణపాత్రమై ప్రసిద్ధికెక్కిన ప్రబంధరాజము స్వారోచిషమను సంభవము. దానికే మనుచరిత్రమను నామాంతరము గలదు. తద్గ్రంథకర్త అల్లసాని పెద్దనార్యుడు. ఆంధ్రకవితాపితామహ బిరుదాంచితుఁడతఁడు. ఆతని ప్రయోగనైపుణీ పరిశీలనమే ప్రకృత వ్యాసోద్దేశ్యము. ఇయ్యది బహుజనపరిచితమైన వరూధినీ ప్రవరఘట్టమునుబట్టి పరిశీలింపఁబడును.

పెద్దనార్యుఁ డేపదమును బ్రయోగించినను దాని ముందు వెన్కలఁ బరిశీలించిన నా పదముయొక్క యుచితానుచితములు వ్యక్తపడును. 'అల్లసానివాని యల్లికజిగిబిగి' యనుటలో నాతఁడు మొదటఁ గథాంశములను జక్కగఁ జమత్కారజనకముగా జిగిగాఁ గల్పించుననియుఁ దరువాత తరువాత వాని ననంతరకథలో నటనట నుపపత్తులతో సమర్థించుననియు దాని భావమని యాతని రచనమునుబట్టి చెప్పవచ్చును.

పెద్దనార్యుని సజీవపాత్రపోషణా చాతుర్యమునకు బ్రవరపాత్ర యొక పతాక. కవి యాపాత్ర నెట్లెట్లో వర్ణించుచు 'శీలంబున్...' అను పద్యమున భూపాలు నాలంబముగాఁ గొని ప్రవరుని బ్రశంసించి యాతని సమగ్రాకృతిని బ్రదర్శించినాడు. 'శీలంబున్ గులమున్ శమంబు దమమున్ జెల్వంబు లేఁబ్రాయముం' అను పదములన్నియుఁ గథాగతిలో మిక్కిలి ప్రాధాన్యము గలవియే. ఆతని యతిథి సత్కారాసక్తి, వీతిహోత్రుని సాక్షాత్కరింపఁ జేసికొనఁగల నైష్ఠిక ప్రవృత్తి మున్నగు సుగుణములా శీలశబ్దబోధితములు. ఆతనిలోని రెండవ విశిష్టత సత్కులీనత. పెద్దన యెపుడు ప్రవరుని గూర్చి చెప్పవలసివచ్చినను నాతనిని 'అంబురుహగర్భకులాభరణుండు, చతురాస్యవంశకలశోదధి పూర్ణశశాంకుఁడు, కాంచనగర్భాన్వయమణి...' అని భూమి నిర్జరవంశోత్తమునిగనే చెప్పును. ఆతని వంశోన్నతిని గుల శబ్దముచే నిట సూచించినాఁడు. అనుభవైకవేద్యమగు ననుభూతిని గలిగింపఁ దలఁచిన వరూధినిని ద్రోసిపుచ్చిన యా ప్రవరుని వైరాగ్య ప్రవృత్తిని బీజరూపముగ నాతఁడు శమదమములు గలవాఁడని హెచ్చరించెను. పిదప నీ పద్యమున గవి ప్రవరుని సౌందర్యమును బ్రశంసించినాఁడు. వరూధిని నలకూబరసన్నిభు నద్ధరామరుని జూచినట్లును, ఎక్కడివాఁడో యక్షతనయేందు జయంత వసంత కంతులం జక్కఁదనంబునం గెలువంజాలెడు వాఁడని యబ్బుర పడినట్లును జెప్పి కవి యా యంశములను సూక్ష్మపఱచి ముందుగ నీతని చెల్వంబు నీ పద్యమున శ్లాఘించినాఁడు. ప్రవరుఁడు లేఁబ్రాయముగలవాఁడఁట. అసలు వరూధినివంటి జవ్వని ప్రేమించుటచేతనే యాతఁడు చిన్నవయసు వాఁడని చెప్పవచ్చును. అంతమాత్రమేగాక యామె యాతనితో సంభాషించుచు 'విప్రకుమార, ధరణీసుర నందన' అని సంబోధించుటలోని కుమార, నందన యను శబ్దములు ఆతని యవ్వనమును నిరూపించుచున్నవి.

సామాన్య దృష్టితోఁ బరికించిన నీ పద్యమునఁ బ్రవరపాత్రను గ్రమవికాసమును సూచించుచు నున్నతముగఁ బెద్దనార్యుఁడు వర్ణించెననియు, నల్లసానివాని యల్లికజిగి యిట్లుండుననియుఁ దెలియును. కాని యనంతర కథా సమ్యక్పరిశీలనచేనా యా పదముల బిగియు సువ్యక్తమగును.

కవి ప్రవరుని యతిథిసేవాతత్పరతను 'తీర్థసంవాసు లేతెంచినా రని విన్న...' అను పద్యమున వెల్లడిచేసినాఁడు. ఆ పద్యమందలి ఏగు—ఏగి, తెచ్చు—తెచ్చి, ఇచ్చు—ఇచ్చి, అను నవ్యవధాన క్రియాప్రయోగము ప్రవరున కతిథుల సంభావించుటలోఁ గల విశేష భక్తి తాత్పర్యముల వ్యక్తపఱచును. ఇయ్యది యాతఁడు సిద్ధునకుఁ గనఁబఱచు విశేష గౌరవ ప్రతిపత్తికి నుపోద్బలకముగ నున్నది.

ఆ సిద్ధున కతిథిసత్కారములఁ గావించి ప్రవరుఁడు 'మీ మాటలు మంత్రంబులు, మీ మెట్టినయెడఁ బ్రయాగ, మీ పాద...' అని భక్తితోఁ బ్రశంసించను. అందు మీ, మీ యని చెప్పుట యాతని యావేశిత భక్తి భావసూచకము. అట్లే తరువాతి పద్యమున నాతఁడు సిద్ధునితో 'వానిది భాగ్యవైభవము, వానిది పుణ్యవిశేషము...' అని పలుమార్లు వానిని అను శబ్దము ప్రయోగించుటలో నాతనిపైఁ దనకుఁ గల మహాగౌరవభావము వ్యక్తపడినది. తరువాతి సంభాషణమునను నాతఁడా సిద్ధునితో 'ఏయే దేశములన్ వసించితిరి మీ రేయే గిరుల్ చూచినా రేయే...' అని ప్రశ్నించినపుడు ఏయే యనుపదమును మూడు నాల్గుతడవలు వాడుట యాతనికిఁ దీర్థయాత్రలపైఁ గల మమకారము సువిదితమైనది. దానికనుగుణముగనే పోయి సేవింపలేకున్న పుణ్యతీర్థ మహిమ వినుటయు నఖిలకల్మషహరంబు గాన వేడెద ననినాఁడు. సిద్ధుఁడాతని యాదరాభిమానములకు సంతుష్టి నొంది 'ఓ చతురాస్యవంశకలశోదధిపూర్ణశశాంక!' అని సంబోధించినాఁడు. ఆ దీర్ఘసంబోధన మాతనికిఁ బ్రవరునిపైఁ గల సౌహార్ద్రతను వెల్లడించుచున్నది.

పెద్దన యా సిద్ధునిచే నాతఁడు చూచిన పుణ్యస్థలములఁ బేర్కొను సందర్భమునఁ బర్వతముల విశేషములఁ బేర్కొనునపుడు 'ఆ పటీరాచల పశ్చిమాచల హిమాచల పూర్వదిశాచలంబులన్' అను దీర్ఘసమాసమును బ్రయోగించినాఁడు. అయ్యాది యాయా పర్వతములందలి విశేషము లశేషము లనియు వాని మాహాత్మ్య మధికమనియు సూచించును.

సిద్ధుఁడు ప్రవరునితోఁ గేదారేశుని భజించితిని. హింగుళాపాదంభోరుహముల్ శిరమునన్ గీలించితి....' అని పేర్కొంటిని చెప్పుచు 'అది యట్లుండనిమ్ము గృహస్థ రత్నంబ...' అని పల్కి యుదయాచల మలయ పర్వతాస్తమయ నగాదుల విశేషముల నుద్ఘాటించినాఁడు. అతఁడు 'అది యట్లుండనిమ్ము' అనుటఁ బట్టి ఓ ప్రవరుఁడ! ఏవేవో చూచితి నని చెప్పితినే. వాని నట్లుంచుము, వాని కంటె నెక్కుడు విశేషములు గల యుదయాచలాది పర్వతములఁ జూచితిని. ఆ నగవైభవ మెట్టిదో చూడుము, లెస్సగా వినుమని హెచ్చరించినట్లున్నది. తదనుగుణముగ నప్పర్వత వైశిష్ట్యము చక్కని తూగుగల దీర్ఘసమాసములఁ జెప్పఁబడెను. ఇట్లు చెప్పుచు నా సిద్ధుఁడు మధ్యమధ్యలో 'ఘనం బులకలిప్పుడుం బోదమెదు, ...బహుజన్మ సుకృత పరిపాకంబునం గాక యేల చేకూఱు నేర్పు...' అని యా యా పర్వతములఁ జూచుచుఁ జెప్పుచున్నట్లన టచేఁ బ్రవరునిలో హిమచలమును దర్శింపవలె నను కౌతుక మిమ్మడి ముమ్మడియైనది. వెంటనే సిద్ధునితోఁ బ్రవరుఁడిట్టని యెల్లనీ లేఁబ్రాయమున నెల్లు చూడఁగల్గితిరి? మీ మహిమ లెఱుంగ మాకు శక్యమా! అని వ్యంగ్యముగ నట్టి తీర్థయాత్రా సందర్శనమున కుపాయము నుపదేశింపుఁ డనినాఁడు. సిద్ధుఁడు పాదలేపమును గూర్చి చెప్పి తద్భూరి ప్రభావమునఁ బవమానమానసతిరస్కారిత్వరాహంకృతిఁ జరియింతుమనినాఁడు. ఆ సమాస మా యౌషధ ప్రభావమును సూచించును. ఆ పద్య గమనములోని మార్పు సిద్ధుఁడు చరించు వేగస్ఫూర్తి సూచకము.

ప్రవరుఁడా రస సాహాయ్యమునఁ దన సంకల్పమును నెరవేర్చుకొనఁదలఁచి లోకజ్ఞతగలవాఁ డగుటచే రసము నొసఁగుఁడని స్పష్టముగ నడుగక 'సత్కృపన్ నను మీ శిష్యుని దీర్థయాత్రవలనన్ ధన్యాత్ముగాఁ జేయరే' అని కోరినాఁడు. అట్లనగనే సిద్ధుఁడు ప్రవరుని యెడ నాదరాయత్తచిత్తుఁ డగుట నాతని పాదములకుఁ బాదలేపమును బూసినాఁడు. ఆ పద్యము 'అనుటయు' నని ప్రారంభింపఁబడుట యా సిద్ధుని యాదరాయత్తతను సూచించుచున్నది.

ఆ మందిడి సిద్ధుఁ డరిగెను. భూమీసురుఁడును 'తుహినభూధరశృంగ శ్యామల కోమలకానన హేమాద్యదరీ ఝురీనిరీక్షాపేక్ష'నరిగినాఁడు. ఇందుఁ బెద్దనార్యుఁడు శైలిని మార్చుట ప్రవరుని ప్రాదేశిక చలనమును సూచించుచున్నది.

ప్రథమాశ్వాసాంతమునకుఁ బెద్దన ప్రవరుని హిమాచలమునకుఁ బంపివేసినాఁడు గాని దానిని జూపలేదు. ద్వితీయాశ్వాసాదిని హిమాలయ పర్వతము నాతనికిఁ జూపించినట్లు 'అటఁ జని కాంచె భూమిసురుఁడు' అని చెప్పినాఁడు. ఏ ప్రదేశమును జూచుటకుఁ బ్రవరుఁడు సిద్ధు నాగమనమునుండి కౌతుకభరవ్యగ్రాంతరంగుఁడైనాఁడో యా ప్రదేశముఁ జూచుటకు వెళ్ళి చూచినాఁ డని కవి భావము. కాంచె భూమిసురుఁ డనుటతోఁ గవికిని గొంత భారము తగ్గినట్లున్నది. ఆతఁడు నక్కడితో నొక నిట్టూర్పును విడిచిపుచ్చియుండును. ఇంచుక విశ్రమించిన పిదప మఱల నూపిరి గొని 'అంబరచుంబి' అనుదీర్ఘసమాసరచనమున గావించి యుండునని యా నిలుపుదలఁ బట్టియు నా సమాసరచనారీతిని బట్టియుఁ దెలియఁగలము.

మనుచరిత్రలోని ప్రసిద్ధవర్ణనములలో హిమవత్పర్వత వర్ణన మొకటి. ఆ పర్వత స్వరూపము నిట్లు కవి వర్ణించినాఁడు.

'అటఁ జని కాంచె భూమిసురుఁ
డంబరచుంబిశిరస్సరజ్ఝరీ
పటలముహుర్ముహుర్లుఠద
భంగతరంగమృదంగనిస్వన
స్ఫుటనటనానురూపపరి
ఫుల్లకలాపకలాపిజాలమున్
గటక చరత్కరేణు కర
కంపిత శైలము శీతశైలమున్.'

ఇందలి దీర్ఘసమాసగుంభనము బట్టి

యది యొక దివ్యప్రదేశ మనియు, నం దేవియో విశిష్టములు, విలక్షణములు, నైన విషయములు జరుగఁగల వనియు సూచించినాఁడు పెద్దన. అంతటి మంచు కొండపై వరూధిని వసించుట, పరమ ఛాందసుఁడైన ప్రవరు నామె ప్రేమించుట, ఇంటికి వెడలుట కేవిధమైన యవకాశము లేనప్పటికి నామె వలపులకు నతఁడు విముఖుఁడగుట, చివఱకుఁ భావకుఁడు సాక్షాత్కరించి యాతనిని స్వగృహమునఁ జేర్చుట, ఈ వృత్తాంతమును గమనించిన గంధర్వుఁడు ప్రవర వేషధారియై వరూధినిని గలియుట...అను మున్నగు విషయము లద్భుతావహములు, విశిష్టతాపాదకములును. కవికూడ నీ హిమాద్రి యెంతయో విశిష్టమైనదని చెప్పఁదలఁచి కొంత చెప్పి చివఱకు 'తలమే బ్రహ్మకు నైన నిన్నగమహాత్మ్యం బెన్న...' అని చెప్ప శక్యముగాదనినాడు. ఆపర్వతమహాత్మ్యము భాసింపఁజేయుటకుఁ బై పద్యమున దీర్ఘ సమాసము ప్రయుక్తమైనది. ఇందేగాక తత్పూర్వత ప్రసక్తి వచ్చిన నాల్గైదు స్థలములందును దీర్ఘసమాసములే ప్రయుక్తములైనవి. "నరనారాయణ... మండలాంతరసరణిన్, ఉల్లలదలకాజలకణ ... మల్లధ్వనులు, ఉద్దండ వేదండ... వ్యాఘ్రము" అను సమాసములఁ దిలకింపుఁడు.

ఈ పద్యమందలి పదప్రయోగ సార్థక్యము పరిశీలనార్హము. చుంబనక్రియలోఁ బ్రధానపాత్రలు పెదవులు. ఆ శైలశిఖర మాకాశమును జుంబించుచున్నదను నర్థమున 'అంబరచుంబి' యనుటలో సానునాసిక బకారము ప్రయుక్తమైనది. ఉభయోష్ఠ్య (Bilabial) వర్ణమగు బకారమును రెండుమారులు వాడుటలోఁ జుంబనక్రియ యొక్క స్ఫూర్తి చక్కఁగఁ గల్గినది. ఆ సెలయేటి ప్రవాహమును శిరస్సరజ్ఝరీ' అను సమాసముచేఁ గవివ్యక్తపఱచినాఁడు. సకార జకారములతో రేఫను మేళవించి ప్రయోగించుటచే నా ప్రవాహము జరజర సాఁగిపోవుచున్నట్లనిపించును. ఆ ప్రవాహమునుండి వచ్చు ధ్వని మృదంగధ్వనివలె నున్నదఁట. దానిని 'లుఠదభంగ తరంగ మృదంగ...' అను సమాసమునఁ బెద్దన చెప్పినాఁడు. అందు బిందుపూర్వక గకార ప్రయుక్తకనిందైన మృదంగధ్వనిని స్ఫురింపఁజేయుచున్నది. అట్లే స్ఫుటనటనానురూప... అను సమాసమును టకారావృత్తితో రచించుటచే నాట్యస్ఫూర్తియుఁ గల్గుచున్నది.

నడచుచున్న కథలో భావికథను సూచించుట మహాకవులకుఁగాని తదితరులకు సాధ్యపడదు. పూర్వాపర సన్నివేశములను బరిశీలించిన పరిశీలకుఁ బై పద్యమునఁ దదుపరికథావైఖరి యించుక స్ఫురింపకపోదని నా యాశయము. అందు శీతశైల మంబరమును జుంబించుచున్నది. అంబరచుంబి యనుటంబట్టి వరూధిని ప్రవరుని జుంబింపఁగలదని సూచన. కాని యది యంబరము. అనఁగా శూన్యమైనదని యర్థము. ప్రవరుఁ డనురాగ శూన్యుఁడు. ఆ వరూధిని వలపులకు మురియువాఁడు కాఁడు గావున నామె వలపులు విఫలములు గాఁగలవను మున్నగు సంశము లస్తినాస్తిగ నా పద్యమున భాసింపఁగలవు

మధ్యాహ్నకాల మగుటఁ బ్రవరుఁ డింటి కేఁగఁదలంచినాఁడు. కాని పాద లేపము కఱగిపోయినది. నిజపురీయాత్రామిళత్కౌతుకోద్ధతి నను దీర్ఘసమాసమున నాతని గృహోన్ముఖత్వము సూచింపఁ బడెను ఇట నా సమాసము సార్థకము. తన్ను నిల్లు సేర్చుటకుఁ బుణ్యాత్ముఁ డెవఁ డైనఁ గలుగడా యనుచు ప్రవరుఁడు పోవుచుండ నొకకోన కనఁబడినది. పెద్దన యందలి సెలయేటిధారను 'నికట మహీధరాగ్రతట నిర్గత నిర్ఝరధార' అను సమాసమునఁ జెప్పినాఁడు. ఆసమాసమా సెలయేటి ధారయొక్క వేగమును వ్యక్తపఱచుచున్నది.

అప్పటి కాంతారమందు ద్రాక్షా లతలు, పూఁదీగెలు దట్టముగ నల్లుకొనిన వని 'ఐందవగ్రావాకల్పిత కాయమాన జటిలద్రాక్షాగుళుచ్ఛంబులన్' అను దీర్ఘ సమాసములు నల్లి కవి యవి యెంత దట్టముగా నల్లుకొనినవో యెఱిఁగించిన విధము హృదయంగమముగా నున్నది.

ప్రవరుఁడు వరూధినీ భవనమును సమీపించునప్పటి కొక మారుత మొలసెను. ఆ మారుతము మృగ మద సౌరభ విభవ ద్విగుణిత ఘనసారసాంద్ర వీటీ గంధస్థగితేతర పరిమళము గలది. ఆ దీర్ఘ సమాసము మారుత పరిమళముల ఘుమ ఘుమమును వ్యక్తీకరించుచున్నది.

అంతఁ బ్రవరుఁడు వరూధినిని గాంచి నాఁడు. ఆమెయు నీ సుందరుని యాగమనమున కాశ్చర్యపడినది. అతని జూచి ఝళంఝళత్కటకసూచిత వేగపదారవింద యైనది. ఇందు సహజసుందరి యగు వరూధినిలోని సౌందర్యమునకుఁ జలనము గల్గించి యా చలద్రూప సౌందర్యము (Dynamic beauty)ను బెద్దనార్యుఁడు ఆ సమాస మూలమునఁ జూపించినాడు.

ప్రవరుని సౌందర్యమునకు వరూధిని పారవశ్య మొంది యా సౌందర్యమునే చింతించుచు మన్మథవేదనకు లోనయినది. ఆ యవస్థనుగని 'మీనకేతనధనుర్జ్యాముక్త నారాచదుర్దినసమూర్ఛితమానసాంబురుహ యైన దనినాఁడు. ఆ దీర్ఘసమాస మామె యెంత తీవ్రముగ సమ్మూర్ఛిత మానసాంబురుహ యైనదో తెలుపుచున్నది.

ప్రవరుఁ డామె యున్కికి విభ్రాంతి నొంది యామె నెవ్వతెవీవని ప్రశ్నింపఁగా నామె తన్నుగూర్చి పరిచయము సేసికొను నపుడు 'విప్రకుమార!' అని సంబోధించినది. మఱియు నాతనిని స్వేర దీర్చికొని తానొసఁగు నాతిథ్యముఁ బరిగ్రహింపు మనునపుడు 'కైతవకుసుమశరాసన!' అని సంబోధించినది ఈ సంబోధనలు వరూధిని తన ప్రేమ వ్యాపారమును వ్యక్తపఱచుటకుఁ బ్రయత్నించుచున్నదని తెల్పుచున్నది.

కాని యాతఁడు సత్క్రియా కాండము తీర్చ వేగఁ జనఁగావలెను. ఇల్లు సేరుట కుపాయ మెద్దియని యామె నర్థించినాడు. ఆమె దానికి సమాధానముగ 'ఎక్కడ యూరు కాళ్ళు లువకింటికిఁ బోయెదనంచు పల్కెదీ వక్కట....' అని దీనముగఁ బల్కినది. దాని కాతనిలో నేమియు మార్పు వచ్చినట్లు గన్పట్టను. వెంటనే వ్యంగ్యోక్తుల వలనఁ బ్రయోజనములేదని 'ధరణీసురనందన!' అని సంబోధించి యావరూధిని స్పష్టమగు నచ్చతెనుఁగులో 'నిక్కము దాఁపనేల, ఇంక నీపయిం జిక్కె మనంబు నాకు....' అని తన కోర్కెను వెల్లడించినది. అచ్చటి యచ్చతెనుఁగుపదప్రయోగ మామెయొక్క స్వచ్ఛ మగు మనోభిప్రాయసూచకము.

వరూధిని ప్రవరునితో బ్రహ్మపదార్థ చర్చను గొంతవఱకు నెఱపి మాటలవలనఁ బ్రయోజనము లేదని గ్రహించి ప్రాంచద్భూషణబాహుమూలరుచితోఁ బాలిండ్లు పొంగారఁ బైయంచుల్ మోవఁగ నాతనిని గౌగిలించి యధరం బాసించినది. కాని యాతఁడు రోసి యోర మోమిడి తదీయాంసద్వయం బంటి పొమ్మనుచుఁ ద్రోసినాఁడు. ఆ త్రోపునకు ఘనలజ్జాపరవశయై వరూధిని ప్రవరుని కొరకొర చూచినది. ఆ చూపు యొక్క తైక్ష్ణ్యము 'జురచుర' శబ్దప్రయోగము చక్కగ వ్యక్తీకరించుచున్నది.

ప్రవరుఁడు హవ్యవాహుని సాహాయ్యమున నింటి కేగినాఁడు వరూధిని యాతనినే తలఁచి తలఁచి యంగభవ కోదండోగ్రమౌర్వీరవక్షోభాకంపిత ధైర్యయైనది. ఆ దీర్ఘసమాస మామె మన్మథవ్యథచే నెంతపొగిలినదో తెలుపుటకు సమర్థముగ నున్నది. ఆమె విరహతాపమున ఖిన్నవదన యైనది. అంత సూర్యుఁ డస్తమించినాఁడు.

ప్రతికథయందును గథ కొంత సాఁగునప్పటికి సూర్యుఁ డస్తమించుటో యుదయించుటో జరుగును. అంతతోఁ గవి తన భావనాశక్తిని గవితాపాటవముతో మేళవించి యేదో నొక చమత్కృతిఁ బ్రదర్శించును. పెద్దన సామాన్య చమత్కృతిఁ బ్రదర్శింపక యస్తమించుచున్న సూర్యునిచేఁ గథను బలుకరింపఁజేసినాఁడు. ఆ సన్నివేశమునందలి పద్య మిది.

"తరుణి ననన్యకాంత నతి
దారుణ పుష్పశిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవు
బారికి నగ్గముచేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డ
హంకృతితోనని రోషభీషణ
స్ఫురణ వహించె నోయన న
భోమణి దాల్చెఁ గషాయదీధితిన్."

సూర్యుఁడు అస్తమించుసమయమున నరుణవర్ణుఁడగును. ఆ యరుణిమ యాతనికి సహజమే. కాని కవి దాని నొప్పుకొనలేదు. సూర్యుఁడు రోషముచేఁ భయంకరమైన తేజస్సునొందెనో యనునట్లుండెననియు నారోషమునకుఁ గారణము నిర్దయుఁడైన ప్రవరుని తిరోగమనమని యుత్ప్రేక్షించినాఁడు. సూర్యుని యరుణిమకు హేతువు ప్రవరుని తిరోగమనము కానేకాదు. అయినను హేతువుగ వర్ణించి కథాగతికిఁ గలుపుట యద్భుతావహము

ఇందలి చమత్కార మింతమాత్రమే గాదు. సూర్యుఁడు ప్రవరుని చేష్టకుఁ గోపము నొందినాఁడు. ఆ వరూధిని దైన్యమే యిందులకుఁ గారణము. సూర్యునకే గాక, యెట్టిరసికహృదయునకైనను ప్రవరుని నిరాకరణసందర్భమును జదువునపుడు వరూధినిపై దయగలుగక మానదు. ఒకరి నననేల? కవియే యామె దైన్యమునకుఁ జలించినాఁడు. కావున నెంతయో సత్కులీనునిగఁ బేర్కొనిన ప్రవరుని మహీసురాధముఁడని యిందు నిందించినాఁడు. పెద్దన యా వరూధిని దయనీయ యనుటకుఁ దగ సామగ్రి నెట్లు సమృద్ధిగ సమకూర్చినాఁడో పరిశీలింపుఁడు.

ఆ వరూధిని నెఱజవ్వని. ఏ ముదుసలియో ప్రేమించినచోఁ దిరస్కరింపవచ్చును. కాని నా తరుణిని బ్రవరుఁడు తిరస్కరించుట న్యాయ్యముగాదు. ఆమె వివాహితయేమో.... పరదారాకాంత పాపహేతువుగదా! అని శంకించెనేమో యనిన నామె పరదారా కాదు. అనన్యకాంత. ఎవ్వరికిని జిక్కని చక్కని కన్యక. ఐనను బ్రవరుఁడు పెడమొగము పెట్టినాఁడు. అంతటితో నాగిన బాగుండెడిదేమో. కాని యూరకొనలేదు. అప్పటికే పుష్పసాయకసంబంధమైన యతిదారుణబాధలో మునిగియున్న యామెను స్వయముగ మనోభవున కప్పగించినాఁడు. అందు 'అంగభవు బారికి' ననుటలో విశేషార్థస్ఫూర్తిగలదు. మన్మథుఁడు దేహస్పర్శలేని యితరుఁడెవ్వఁడో యయిన నంతగా బాధింపకుండెడివాఁడు. కాని యాతఁ డెవ్వఁడోగాదు. ఆమె మనస్సంజాతుఁడే. కావున నామె నెక్కుడ బాధింపఁగలఁడని సూచించుటకో యనునట్లు పెద్దన 'అంగభవ' శబ్దమును బ్రయోగించినాడు 'జ్ఞాతిశ్ఛేదనలేనకి'మ్మని గదా ఆర్యోక్తి. ఆమె యింతకుఁబూర్వమే పుష్పశిలీముఖ వ్యథాభరవివశాంగి యైనదఁట. ఆమె కాంతారసంతానముల సమీపమున నున్నది. చుట్టు ననేక పుష్పము లున్నవి. అవి మన్మథుని బాణములనియు వానివలన బాధ ననుభవించుటచే నామె వివశాంగి యైనదనియుఁ గవి చమత్కరించుట మనోజ్ఞముగ నున్నది.

ఇంతకుఁబూర్వము వలఁచి తిరస్కృతుఁడగు గంధర్వుఁడు ప్రవరవేషధారియై యామె నలరించుట, స్వరోచి యుదయించుట...... అనుమున్నగు నంశములతోఁ గథ పట్టుగ సాగిపోయినది.

ఇట్టి ఘట్టమును పెద్దనార్యుఁడు తన ప్రయోగనైపుణిని బ్రదర్శించి రసరంజకముగ రచించినవిధము శ్లాఘనీయము. ఆ ప్రయోగవైఖరి సహృదసంస్కారానుగుణముగ నశేష విశేషము లొసంగుచుండును. కవితాపితామహుఁడుగదా యతఁడు. ✻

తరంగ సందేశం

వసంతరావు వేంకటరావు

శక్తి మహాసాగర తలంపై నివసిస్తున్నాము,
లక్షలు కోట్లు అర్బుదాలుగా నున్న
శక్తితరంగాలలో నున్నాము.
వాటిలో కొన్ని వేలుమాత్రమే కంటికి కనిపిస్తాయి,
మరికొన్ని వేలుమాత్రమే స్పర్శకు తగులుతాయి.
శక్తి తరంగగ్రహణసందర్భంలో,
మానవునికంటె మహోత్కృష్టమైనది రేడియో.
అగోచర తరంగాల నది లంకించుకొంటుంది,
గానంగా, ప్రసంగంగా. నాటకంగా
రూపాంతరం పొందించి మన కందిస్తుంది,
మాయామేయమైన గారడీ చేస్తుంది వర్ణపటగ్రాహకం,[1]
తరంగాలను గీతలుగా చారలుగామార్చి ఆడిస్తుందినాటకం,
పకృతిరహస్యాల నతిచమత్కారంగా వెల్లడిస్తుంది.
వర్ణపట[2] మొక మహాద్భుతమైన లిపి.
శక్తి నిచ్చు వాయువు కాంతిగల గీతలను కలిగిస్తుంది
శక్తిని గ్రహించు వాయువు నల్లటిగీతలను కలిగిస్తుంది,
దుర్నిరీక్ష్యమైన మన సూర్యుని వర్ణపటంలో
నల్లగీతలు కనుగొన్నాడు విజ్ఞాని ఫ్రాన్‌హోఫర్.
మండుతూన్న సూర్యగోళంలో నున్న
అనేక మూలతత్త్వాల ఉనికిని
ఈ నల్లగీతలే వెల్లడించేయి.
ప్రకృతినుండి మరొకరహస్యాన్ని డాప్లర్ పెల్లగించేడు :
ఆత్మభ్రమణం చేయు నక్షత్రంయొక్క
అనువైన అంచునుంచి వెలువడు కాంతియొక్క
పౌనఃపున్యం[3] ఎక్కువౌతుంది,
దాని ఎదుటిఅంచునుంచి వెలువడు కాంతియొక్క
పౌనఃపున్యం తక్కువౌతుంది.
ఫలితం ?
వర్ణపటంలో గీతలు స్థానభ్రష్టం పొందుతాయి,
నీలంవైపో ఎరుపువైపో జరుగుతాయి;
జరిగి, నక్షత్ర ఆత్మభ్రమణవేగాన్ని ఎరిగిస్తాయి.
కాని, మౌంట్‌పలోమార్ రెండువందల అంగుళా
లలోసైతం
ఏనక్షత్రమూ బింబంగా గోచరించకపోవుట సత్యం;
నక్షత్రబింబ మొక వెలుగుచుక్క.
అయినప్పటికీ దాని సహజమైన ఆత్మభ్రమణ ముంది,
డాప్లర్ ఫలిత[4] ముంది;
కాగా, గీత చారగా విస్తరిస్తుంది.
ఆ చారయొక్క వెడల్పే నక్షత్రంయొక్క
ఆత్మభ్రమణవేగాన్ని చాటుతుంది.
కాంతితరంగాలకంటె భిన్నమైన తరంగాలను
రేడియో దూరదర్శిని ఆకళిస్తుంది.
అది గెలక్సీల — జగద్ద్వీపాల —
పరిమాణాన్ని కొలుస్తుంది.
పదివేలకోట్ల నక్షత్రాలు గెలక్సీలో —
మేఘావృతమైన విశ్వధూళిలో—
ఆత్మభ్రమణం చేస్తూ పరిభ్రమిస్తున్నాయి;
విశ్వంలో పదివేలకోట్ల గెలక్సీ లున్నాయి.
అనంతం విశ్వం,
కాలాకాశతీతం విశ్వం.

---

(1) Spectrograph (2) Spectrum (3) Frequency (4) Doppler Effect.

సీరియల్ నవల

5

జరిగిన కథ

డాక్టరు కనకంగారికి ప్రతినెలా పాతిక – ముప్ఫయి రూపాయిల ఆదాయానికి కారణమైన దీర్ఘరోగులు యిద్దరువున్నారు. అదే సంపాదన ఆయనది. అంతకన్నా ఎక్కువ ఆశించడు. ఆశించినా జనం అటువైపు తొంగిచూడనన్నా చూడరు. బలవంతంగా రోగులమీద సాహిత్యాన్ని రుద్దడానికి ఆయన చేసే ప్రయత్నం ఆయనమీదే బెడిసికొడుతుందేమో! చివరకు మందుతో రోగిరైు, ఆయన స్వభావానికి లోబడిపోయిన వ్యక్తి ఒకతను దొరికాడు. డాక్టరుగారి కోరికవల్ల అద్దెదారుడుగా ప్రవేశించాడు. ఆ యింటివాళ్ళమ్మాయి నర్సూ అభిమానపు చూపులకు చిక్కాడు. డాక్టరుగారి అభిప్రాయం ప్రకారమే ఇంటివాళ్ళకి, నగలన్నా ఇతర ఏ అలంకరణ సామగ్రిఅన్నా నచ్చదు. కాని ఒక పెళ్ళి సందర్భంలో డాక్టరుగారి తండ్రి తన మనవరాలికి పెట్టిన నగలను సైతం డాక్టరుగారు వెనకకు పంపిస్తాడు. అవి తెచ్చిన విద్యార్థిని ఆయన అభిమానంతో తన ఇంటికి రమ్మంటాడు. ఇతని పెళ్ళి ప్రస్తావనకూడా వచ్చిన సందర్భంగా అతడు విడిదిలో కాలము గడుపుతాడు.

జీవితం సాఫీగా సాగిపోతున్నది. ఏరోజు ఆనందం ఆరోజు పరిమితంగా లభిస్తున్నది. డాక్టరుగారి భార్యకు నెల నెలా ముప్ఫై రూపాయ లిస్తున్నాను.

"మొహమాటపడకు. నీదగ్గిర డబ్బు లేనప్పు డడిగితీసుకుంటూ ఉండు," అని సుందరమ్మగారు ప్రతిసారీ నాతో అని మరీ డబ్బుతీసుకునేది. నేను సరేననేవాణ్ణి. అవసరం పడితే తీసుకునే చనువుకూడా నా కున్న దిప్పుడు.

కాలేజీకి పోతున్నాను, వస్తున్నాను. ఇంటిదగ్గర నా కాలేజీపుస్తకాలు చదువుతున్నాను. భాసుడి నాటకాలన్నీ డాక్టరుగారు చదివి వినిపించారు. భాసుడి పనితనం ప్రతిజ్ఞలోనూ, స్వప్నవాసవదత్తలోనూ ఎంత గొప్పగాఉన్నదీ డాక్టరుగారు చక్కగా వివరించారు. ప్రతిజ్ఞాయౌగంధరాయణంలో ముఖ్య పాత్రలైన వాసవదత్తా, వత్సరాజూ స్టేజీ మీదికి రానేరారు. కాని కథంతా వాళ్ళదే. స్వప్నవాసవదత్తలో వత్సరాజునూ, వాసవదత్తనూ ఒక్కచోటికి తీసుకురావటంలో భాసుడు చాలా ఉపజ్ఞ చూపాడు.

మేం ఏవైనా పుస్తకాలు చదువుకునేటప్పుడూ, పుస్తకాలను గురించి మాట్లాడుకునేటప్పుడూ నర్సుకూడా వచ్చి కూర్చుంటున్నది. తాతగారిని చూసినతరవాత నర్సులో ఏదో అనిర్వచనీయమైన మార్పు వచ్చింది. మనిషిలో కొంత పెద్దరికపు లక్షణం ఏర్పడిం దనుకుంటాను. ఆదివరకు నాతో చాలామితంగా మాట్లాడేది, ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడుతున్నది. తన పాఠాలలో ఏదన్నా అనుమానం వస్తే, నేను దగ్గిర ఉన్నప్పుడు నన్నే అడిగేస్తున్నది.

ప్రపంచ మంతా భ్రమే నంటారు వేదాంతులు. ఇది భ్రమా, ఇదికాదూ అని చెప్పటాని కెవరికీ హక్కులేదు. నర్సు ఒక్కతే అయినా, నామనసులో రోజూ చూసే నర్సూ, ఆనాడు మునలాయన ముస్తాబుచేసిన నర్సూ ఇద్దరూ ప్రత్యేకవ్యక్తులుగా నిలిచిపోయారు. ఈ నర్సులో ఆ నర్సు లీనమైపోకుండా, ఎడంగా నిలబడిఉన్నది. ప్రపంచమంతా భ్రమే ననటాని కింతకన్న మంచినిదర్శనం ఏంకావాలి ?

ఇన్నాళ్ళుగా డాక్టరుగారి కుటుంబంలో ఒకణ్ణిగా ఉంటున్నప్పటికీ అప్పు డప్పుడూ నాలో నేను, "నర్సు ఇట్లా ఎందుకుండాలి ? తాతగారిదగ్గిర చేరి అస్తమానమూ పెళ్ళికూతురులాగా ఎందు కుండకూడదు ? ఈ మోడుజీవితంనుంచి ఆమె పొందుతున్న అదనపుప్రయోజనం ఏమిటి ?" అనుకునేవాణ్ణి.

డిసెంబరు శలవుల్లో మేం నలుగురమూ కొండవీడు పిక్నిక్ వెళ్లాం. అదివరకొకసారి నా స్నేహితులు కొందరు కొండవీడు వెళ్ళినప్పుడు నేను వాళ్ళతో వెళ్ళలేదు. కొండల్లో అందం ఉన్నది. కొండ లెక్కటంలో సరదా ఉన్నది. కొండలమీదిగాలి పీల్చి. కొండలమీది

కొడవటిగంటి కుటుంబరావు



నీరుతాగటంలో ఉత్సాహం ఉన్నది. నాకన్న నరుసు మరింత ఉత్సాహోద్రేకాలు కనబరిచింది.

ఈ ప్రయాణం కోసమని సుందరమ్మ గారు పులిహోరా, గారెలూ చేసింది. గోంగూరపులుసు వండింది. ఇంత కొరివి కారమూ, కందిపచ్చడీ నూరిపెట్టింది. అన్నంమాత్రం వండటానికి ఒకపాత్రా, బియ్యమూ తీసుకున్నాం. ఇంత నెయ్యీ, పెరుగూ తీసుకున్నాం.

డాక్టరుగారు కొండవీడు చాలాసార్లు చూశారు. మా సామానంతా ఒక్కటిగా కట్టకుండా, నలుగురూ పట్టుకోవటానికి వీలుగా నాలుగుమూటలు కట్టాం. తేలికమూటలు ఆడవాళ్ళకిచ్చి, బరువులు మగవాళ్ళం పట్టుకున్నాం.

నేను కొండ ఎక్కటం అదే మొదలు. అయిదారు నిమిషాలపాటు వెనక్కు తిరిగి చూడకుండా ఎక్కి, మిగిలినవాళ్ళకోసం తిరిగిచూసేసరికి నాకు, మేం వచ్చిన దారీ, పరిసరాలూ ఎంతో లోతున కనిపించి, ఒక విచిత్రమైన అనుభవ మయింది. ఒక్కొక్క మెట్టే పైకి పోతూంటే కింది నేల ఒక్కొక్క మెట్టే దిగిపోవటంలో ఆశ్చర్య మేమీ లేదు. అయినా ఆ సంగతి ప్రత్యక్షంగా చూస్తుంటే చిత్రంగానే ఉంది. నిమిషానికొకసారి ఆగి, వెనక్కు చూసి, చుట్టూ కలయచూడసాగాను. కనుచూపుమేరకూడా

కూడా వి స్తరించటం నాకు వింతగానే ఉన్నది.

కొద్దిసేపటిలోనే మేం ఎక్కటం పూర్తి చేసి బంగాళా చేరుకున్నాం. బంగాళాలో ఎవరో దిగి ఉన్నారు. లేకపోతే దాని వరండాలో మకాం వేద్దామని మా ఉద్దేశం.

"ఇంకొంచెం నడిస్తే చెరువుదగ్గిరికే వెళ్ల వచ్చు పదండి." అన్నాడు డాక్టరుగారు. వెదుళ్ళ మధ్య చెరువు లాటిది ఉన్నది. అందులోవి వాననీళ్ళు; ఎంతో నిర్మలం గానూ, తియ్యగానూ ఉన్నాయి.

"ఇటీవలనే ఇక్కడి కేదో పెద్ద పార్టీ వచ్చిఉండాలి," అన్నాడు డాక్టరుగారు.

"ఎట్లా తెలుసు?" అన్నాను.

"ఆ పొగచూరిన రాళ్ళు చూడు. పొయ్యిలాగా అమర్చి ఉన్నాయి. వాటిపైన ఎంత పెద్దపాత్ర పెట్టిఉంటారో ఊహించు. కనీసం ఇరవై ముప్పై మందికి అన్నం వండటానికి సరిపడే గుండిగ కాకపోతే రాళ్ళ మధ్యను దిగబడిపోతుంది."

ఆ వెదుళ్ళ పక్కన నిలబడి చూస్తే చుట్టూ ఎత్తుగా కొండలు, వా టన్నిటిపైనా బురుజు లుండిఉంటాయి ఒకప్పుడు. ఇప్పు డొక్క కొండపైననే శిథిలమైన బురుజు కనిపిస్తున్నది.

రెడ్డిరాజుల కాలంలో ఆ ప్రదేశమంతా ఎట్లా ఉండేదో ఊహించటం నాకు సాధ్యం కాలేదు. అక్కడ ఇళ్ళుండే వనీ, మనుష లుండేవా ళ్ళనీ ఊహించటంకూడా కష్ట మయింది.

"మన సామా న్లిక్కడే ఉంచి ఓ గంట సేపు తిరిగివద్దాం," అన్నాడు డాక్టరుగారు.

"ఏదైనా ఒక కొండ ఏక్కిదిగుదాం," అన్నాను.

"నాకు తెలిసినంత వరకు ఆ బురు జున్న కొండశిఖరానికి దారిలాటిది ఉన్నది. మిగిలిన వన్నీ రాళ్ళ మీదుగా పాకి ఎక్కా లిసిందే."

"పోనీండి, దారివెంబడే పోదాం," అన్నది సుందరమ్మగారు.

మేం గమ్యస్థానం చేరటానికి ఎంతో సేపు పట్టలేదు. కాని అక్కడికి చేరిన తర వాత తిరిగి రాబుద్ధి పుట్టలేదు. అక్కడి నుంచి మైళ్ళకు మైళ్ళు కనిపిస్తుంది. ఏ స్వర్గంనుంచో భూలోకాన్ని చూస్తున్న ట్టున్నది. ఆ గాలి పీలుస్తుంటేనే బలం వచ్చిన ట్టనిపించింది

మేం వెదుళ్ళ దగ్గిరికి తిరిగి వచ్చేసరికి మా సామాను భద్రంగానే ఉంది. చిన్న చిన్న రాళ్ళు మూడు ఏరి పొయ్యిలాగా అమర్చాం. నేనూ, నర్సూ చితుకులు తెచ్చి పడేశాం. అడివి ఉన్నచోట వంటచెరుక్కు లోప మేముంటుందీ?

నర్సు చీటికీ మాటికీ బురుజుకేసి చూస్తుం డటం గమనించి, "నాక్కూడా అక్క ణ్ణుంచి రాబుద్ధి పుట్టలేదు." అన్నాను.

"అసలు అటువంటిచోటే ఉండిపోతే ఎంత బాగుంటుంది! అంతఎత్తు! ఆ ఎత్తు నుంచి ప్రపంచమంతా చూస్తూండొచ్చు. మనని పైనుంచి చూసేవాళ్ళంటూ ఉండరు," అన్నది నర్సు.

"కాని అక్కడ ఉండా లంటే ఒంటరి గాళ్ళమైపోతామే! మనుష్య ప్రపంచానికి దూరంగాఉండి ఎట్లా బతకటం?" అన్నాను.

"మన క్కావలిసినవాళ్ళతో సహానే ఉంటాం. ఒంటరిగా ఎందు కుంటాం?" అన్నది నర్సు. నేను నవ్వాను.

"మన క్కావలిసివా ళ్ళెవరో మన కేం తెలుస్తుందీ? మనం తినే బియ్యమూ, కూరలూ ఎవరు పండిస్తున్నారు? మనం కట్టుకునే బట్ట లెవరు నేస్తున్నారు? ఆ పత్తి ఎవరు పండిస్తున్నారు? మనంచదివే పుస్తకా లెవరు అచ్చేస్తున్నారు? ఎవరు చేరవేస్తున్నారు? మనం ఉండే ఇళ్లు ఎవరు కడుతున్నారు? వాటికి కావలసిన ఇటుకలూ, సున్నమూ, సిమెంటూ, కలపా ఎవరిపుణ్యాన వస్తున్నాయి? ఎట్లా తెలు స్తుంది? ప్రపంచంలో ఏమూల ఏరూపంలో శ్రమించేవాడైనా మనకు సహాయపడుతున్నా డనే అనుకోవాలి. మనం వాడే వస్తువులు మేడిన్ ఇంగ్లండ్, అమెరికా, జర్మనీ వగైరా, వగైరా! ఎవరు లేకుండా మనకు జరుగుతుందంటే, లోఫర్లూ, దొంగలూ, శ్రమించని వాళ్లూనూ—దీనికొక పారలల్ చెబుతా: కొన్నివేల ఏళ్ళక్రితం భూమిమీద జీవించిన ప్రతిఒక్క మనిషికీ ఈనాడు భూమిమీద జీవించే ప్రతిఒక్కడూ వారసుడే నని వెల్సు రుజువు చేశాట్ట? అట్లాగే —"

"సూర్యం, నిప్పెట్టె కనపడదు. బుట్టలో వేసుకున్నా ననుకున్నాను. మరిచానోఏమో! కాస్త ఆ బంగాళాదాకా వెళ్ళి వాళ్ళదగ్గిర వుంటే పట్టుకురావాలోయ్." అన్నది డాక్టరు గారి భార్య.

నేను చితుకు లేరటం మానేసి బంగాళాకు బయలుదేరాను. అక్కడ ఎవరూలేరు. ఎత్తయిన అరుగుల దిగువన ఒక ఖాళీ నిప్పెట్టె పడిఉన్నది. ఖాళీనిప్పెట్టెల్లో ఎప్పు డైనా పుల్లలు ఇరుక్కుని ఉండొచ్చు. ఆత్రంగా తీసిచూశాను. ఈ ఖాళీనిప్పెట్టె— దానింట దొంగలుదూర!—నిజంగా ఖాళీ నిప్పెట్టే. అనాలోచనగా దాన్ని విసిరి పుచ్చుకుని దూరంగా పారేశాను.

బంగాళాలో దిగినవా ళ్లెటు పోయి ఉంటారు, కొండ లెక్కుతూ ఉంటారు. చుట్టూ ఉన్నకొండలు కలయచూశాను. ఎక్కడా మనిషిపొడ లేదు. కొంచెం సేపటికి ఒకవైపునుంచి గొణిగినట్టుగా మనిషి కంఠం వినిపించింది. అది ధ్వనో, ప్రతి ధ్వనో?

కుడిచేతిపక్క, చాలా ఎత్తున, తెల్లటి గుడ్డలు ధరించిన ఆకారం కనబడింది. అటు కేసి గబగబా కొండరాళ్ళు ఎక్కసాగాను. కొన్ని బండరాళ్ళు నాలుగేసి అడుగుల ఎత్తు న్నాయి. వాటిమీదిగా దేకాను. అయిదారు నిమిషాలపాటు కొండ ఎక్కి వొగర్చుతూ చుట్టూ చూశాను. మనిషిజాడ లేదు. అయినా మొండిగా ఎక్కుతూ వెళ్ళాను.

చాలా ఎత్తు ఎక్కినమీదట నా ప్రయాస ఫలించింది. దూరాన ఎదురెండలో మనుషులు కనిపించారు. వా ళ్లొక చరియమీద కూర్చుని ఏదో చేస్తున్నారు నాకు తట్టలేదు గాని,

వాళ్ళను కనిపెట్టటానికి నేను వీలయినంత ఎత్తుకు ఎక్కటం తప్ప మరో మంచి ఉపాయంలేదు. అడవుల్లోకూడా చాలాదూరం కలయచూడాలంటే సమీపంలో ఉండే ఎత్తయిన చెట్టెక్కుతారు. ఈ సంగతి లక్షసార్లు చదివాను. కాని చదివినవి జీవితంలో ఉపయోగపడటం చాలా అరుదు.

నేను మెల్లిగా వాళ్ళను చేరుకుని అందరి చేతుల్లోనూ సిగిరెట్లు వెలుగుతూండటం చూసి పెద్దనిట్టూర్పు విడిచాను. వాళ్ళు డబ్బులు పెట్టి పేకాడుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏమండీ, మీ దగ్గిర నిప్పెట్టె ఉంటే ఇస్తారా? మేం వంట చేసుకోవా," లన్నాను.

"ఇంతకుముందు ఆడవాళ్ళతో వచ్చింది మీరేనా?... ఉన్నది రెండే నిప్పెట్టలు," అన్నా డొకడు. అందులో ఒకటి నా కిస్తే వాళ్ళకు భవిష్యత్తు లేకుండాపోయేట్టు.

"నాలుగు పుల్ల లివ్వండి చాలు. బంగాళా కింద ఖాళీనిప్పెట్టె చూశాను," అన్నాను.

వాళ్ళు నాకు అరడజను పుల్ల లిచ్చారు. వాటిని భక్తిగా అందుకుని జేబులో పెట్టుకుని, బంగాళాకు సులువుగా — అంటే పాకకుండానూ, దేకకుండానూ — వెళ్ళే దారి వాళ్లు చూపిస్తే, ఆ దారిన బయలుదేరి బంగాళాకు చేరుకున్నాను.

ఇంక ఖాళీ నిప్పెట్టె వెతికేపని ఉన్నది; అ దెక్కడో పారేశాను. ఎంతసేపు చూసినా కనపడి చావలేదు. నన్ను చూస్తే నాకే మహా మండిపోయింది. చివర కది దొరకటానికి ఏ పదినిమిషాలో పట్టింది. మళ్ళీ ఒకపెద్ద నిట్టూర్పు విడిచి, భక్తిగా ఆ ఖాళీ పెట్టెను తీసుకుని, అందులో అరడజను నిప్పుపుల్లలూ భక్తిగా పెట్టి, వెదుళ్ళకేసి బయలుదేరాను.

సగం దారిలో ఆర్తనాదం వినపడింది. ఆడగొంతు – నాకు గుండెగుభేలు మన్నది. ఏం జరిగింది? ఆకేక మా మకాంనుంచే వచ్చింది. పరిగెత్తి చెరువుదగ్గిరికి చేరాను. నాకు కళ్ళు సరిగా పనిచెయ్యటం లేదు. సుందరమ్మగారు తడిబట్టలతో నిలబడి ఉండటమూ, డాక్టరుగారు నీటికేసి చెయ్యి చాచి. "నర్సు! మునిగిపోతున్నది! సూర్యం, ఎట్లా?" అనటమూ లీలగా జ్ఞాపకం ఉన్నాయి. అరక్షణంలో చొక్కా విప్పి పక్కన పడేసి, పైజామాతోనూ, బనీనుతోనూ చెరువులోకి దూకాను. అద్దం లాటి నీరు – నర్సు ఆకారం నీటిమట్టానికి కొంచెం దిగువగా కనిపిస్తున్నది. రెండు బారలు వేసి ఆమెను చేరుకుని. నర్సును పట్టి పైకెత్తాను. కాని మరుక్షణం ఇద్దరమూ మునిగాం. ఈసారి నర్సును నాకన్న పైకెత్తి నామీద వేసుకుని, నీటిలో వెల్లికిలా పడుకున్నాను. నేను తేలిఉండగా నర్సు మునగటానికి వీలుండదు. కాకపోతే ఒడ్డు కీదటానికి కాళ్ళే ఉపయోగించాలి; అదంత కష్టంకాదు. అరనిమిషంలో ఇద్దరమూ వచ్చి లోతులేని నీళ్ళలో చతికిలపడ్డాం.

అసలా చెరువంతా ఎంత – కొండలమధ్య పెద్దగొయ్యి. ఇవతలిచివర లోతు చాలా తక్కువ. నీటికి రెండడుగులలోతున విశాలమైన చట్రాయి ఉన్నది. దానవతల పది పన్నెండడుగుల లోతు. అవతలి చివర ఏ ఇరవై అడుగులో ఉంటుందేమో కూడాను. అటువేపు కొండ నిటారుగా ఉండటంచేత అటునుంచి చెరువులోకి దిగటానికీ, ఎక్కటానికీ లేదు...కాని, గట్టిగా ముప్పై అడుగులు వెడల్పులేని ఆ గుంటలో మనిషి మునిగి చావవచ్చు. ఈత రాకపోతే.

చిత్ర మేమంటే, నర్సు ఆటే నీరు మింగలేదు. గిలగిలా తన్నుకోలేదు. ఎక్కడో సైన్సు పుస్తకంలో చదివినప్రకారం, తల వెనక్కు బాగా వాల్చేసి, మొహం నీటిపైన తేలేటట్టు చెయ్యటానికికూడా ప్రయత్నించిందిట! చిత్రమైన మనిషి! పుస్తకజ్ఞానం అనుభవం లేకపోతే ఎందుకూ పనికిరాదని నర్సుకూ కూడా ఆగంటలోనే తెలిసివచ్చింది.

నే నెంత సేపటికీ తిరిగిరాకపోయేసరికి, ఊరికే ఉండటం దేనికని ముగ్గురూ స్నానాలు చేద్దా మనుకున్నారుట. డాక్టరుగారికి ఈత రాదు. ఆయన చెరువులోకి జాగ్రత్తగా దిగి లోతులేని ప్రాంతం విశాలంగానే ఉన్నట్టు తెలుసుకుని, స్నానం చేసి వచ్చేశాడు. తరవాత ఆడవాళ్ళు వెళ్ళారు స్నానానికి. ఆటే దూరం వెళ్ళవద్దని ఆయన వాళ్ళతో చెప్పాడు. నర్సు ఎంతోదూరం వెళ్ళలేదుట; అయినా అందని లోతులో దిగబడిపోయింది.

"నీ కీత రాకపోతే ఇవాళ ఏమైఉండును!" అన్నది సుందరమ్మగారు.

"నేనా? తెనాలి బెజవాడల మధ్య ఉన్న అన్ని కాలవల్లోనూ ఈదాను, ఒక్క బకింగ్‌హామ్ కాలవలోతప్ప!" అన్నాను.

"అయినా ఈ కొండకోనేళ్ళు చాలా డేంజరస్. కొన్నేళ్ళకిందట కొండపల్లి కొండలమధ్య మడుగులో ఈత వచ్చినవాడే పోయాడు. ఎంతలోతుందో చూడాలని అడుక్కు వెళ్ళాట్ట. పాదం రాళ్ళసందున ఇరుక్కుపోయింది. శవం ఎందుకు తేలలేదా అనుకున్నారు. తరవాత మనుషులు వచ్చి నీటిలోనుంచి శవాన్ని పైకిలాగడానికి ప్రయత్నిస్తే అది ఒకంతట రాలేదు." అన్నాడు డాక్టరుగారు.

ఆ సంఘటనగురించి ఇంతకన్న పెద్ద రాద్ధాంత మేమీ జరగలేదు. పదినిమిషాల అనంతరమూ దాన్నిగురించి మాట్లాడటం మానేశాం. అరగంట తరవాత నేను దాన్నిగురించి ఆలోచించటంకూడా మానేశాను.

నేను నర్సును నీటిలోనుంచి పైకి లాగటంలో రొమా న్సున్నదని నా కప్పుడే కాదు, మరికొన్ని రోజులదాకా తట్టలేదు. జీవితాన్ని వెనక్కు తిరిగిచూసుకుంటే గాని అందులోని రుచులు సరిగా తలకు పట్టవు. అందుకే కథకులు కథలన్నీ గతంలో ఉంచి రాస్తారు.

ఒకరోజు రాత్రి నాకు ఆకస్మికంగా ఆ సంఘటన జ్ఞాపకం వచ్చి ఒళ్ళు పులకరించింది. నే నానాడు నర్సును కౌగలించుకున్నాను. నేను వెల్లికిలా ఈదుతున్నప్పుడు నర్సు నాపైన పడుకుని ఉన్నది. ఆమె

శరీరమంతా నాకు తగిలింది. నా చేతులామె చుట్టూ ఉండిపోయాయి.

నర్సు నన్ను మొదటిసారి ఆకర్షించినది సీను పెళ్ళిలో పెళ్ళికూతురి వేషంలోనే అయినా, నాలో కోరికలు రేపినది ఆ రాత్రి నేను కొండవీడు సంఘటనను స్మరించుకున్నప్పుడు. ఆ తరవాత నేను నర్సుకేసి కోరిక లూరకుండా చూడలేకపోయాను.

నే నెంత డల్‌ఫెలోని! ఆ చెరువులో నర్సు స్పర్శసుఖం ఎందుకు పొందలేకపోయాను? ఇం కే మగాడైనా ఆ సుఖం గురించి ఆలోచించకుండా ఉంటాడా? ఉంటా డని నాకు తోచలేదు. అసలు నాకు నర్సుపైన కోరిక పుట్టటాని కింతకాలం పట్టనా? 'నర్సు నెప్పుడన్నా ప్రేమగా తాకావా?' అని దేవుడు న న్నడిగితే లేదని చెప్పాలిసిందే గదా! ఇప్పుడు నాకు నర్సు స్పర్శసుఖం కావాల నున్నది. లక్షరూపాయలు సంపాదించటం ఎంత అసాధ్యమో ఇదీ అంత అసాధ్యమే! మళ్ళీ నర్సును ఏ జలగండంనుంచో కాపాడాలి! ఛీ! ఛీ! జీవితం - గోలీలాటలో నేను బొత్తిగా గురిలేని ఆటగాణ్ణి.

ఒక ఆదివారంనాడు మధ్యాన్నం నర్సు నా గదిలోకి తొంగిచూసి, "నీ కోసం ఎవరో వచ్చారు." అన్నది. నర్సు నన్ను మీ రని పిలిచేదికాదు. నేను తన మొగుణ్ణవుతా నని తెలీ దనుకుంటాను.

ఎవరో క్లాస్‌మేటై ఉంటా డనుకుని ఆత్రంగా బయటి కొచ్చాను.

"బాబుగారు తవర్ని రమ్మంటుండారు." అన్నా డెవడో నౌకరులాటి మనిషి.

"ఎవ రా బాబుగారు?"

"సర్కీలుగా రింటి కొచ్చిన బాబుగారే నండీ!"

"నన్నా? డాక్టరుగార్నా?"

"మిమ్మల్నేనండీ."

వాడు నా తెలివి తేటలను శంకిస్తూ నవ్వాడు.

"ఉండు. చొక్కా వేసు కొస్తాను."

తీరా వెళ్ళి చూద్దునుగదా, ముసలాయన. తనే సర్కిల్‌ఇన్‌స్పెక్టరు తండ్రి అయినంత ధీమాగా వరండాలో పడకకుర్చీలో పడుకుని ఉన్నాడు. ఎక్కడి కొచ్చినా ఆయన కొక వరండా, ఒక పడకకుర్చీ తప్పవల్లేఉంది.

"వచ్చావా? ఆ కుర్చీ దగ్గరికి లాక్కుని కూర్చో ... ఏ వంటుంది మా లక్ష్మి?" అన్నా డాయన.

లక్ష్మి అంటే నర్సని ఊహించటానికి నాకు పూర్తిగా ఒకటిన్నర సెకండ్లు పట్టింది.

"ఏమీ అనదు. అస లా పిల్ల బుర్రలో ఏ మాలోచన లున్నదీ ఆ ఈశ్వరుడికే తెలియాలి!" అన్నాను.

"నీ పని నువు చేస్తున్నావు కదా? చీమలు పాకితే రా ళ్ళరుగుతాయిట."

"నిజమే ననుకోండి ... కాని ఈ సందర్భంలో ... చూడండీ, డబ్బుమీద భ్రాంతి లేని పాషండుల్ని వంచుకురావటం మహా కష్టం నే నేనాడనగా ఆ క్రీ మిచ్చాను-"

"మధ్యలో క్రీమంటా వేమిటి?" అన్నా డాయన చిరాగ్గా. "డబ్బు భ్రాంతి లేనివాళ్ళంటూ ఎక్కడా ఉండరు. నీ తల వెంట్రుక లంతమందిని చూశాను. అది అన్నం తినదూ? బట్ట కట్టదూ? చదవదూ? పుస్తకాలు కొనదూ? తలకి కొబ్బరనూనెన్నా రాస్తుందిగా? ఇవంతా డబ్బు లేకుండానే అవుతున్నదా?"

నేను శాంతంగా, చిన్న పిల్లవాడికి ఒకటోఎక్కం చెబుతున్నట్టుగా, "పంతులుగారూ, మీకు తెలిసినదాన్లో నాకు నూరో వంతు తెలీదు, ఒప్పుకుంటాను. డబ్బుతో అవసరం ఉండటానికీ, డబ్బుమీద భ్రాంతి ఉండటానికీ లక్ష తేడా ఉంది. పెళ్ళాడినవాళ్ళంతా పెళ్ళాం వ్యామోహంలో పడిపోతున్నారా? మీ అబ్బాయీ వాళ్ళ అవసరాలు కూడా గడవనంత బీదగా ఉన్నారని మీ రేమన్నా అనుకుంటున్నా రేమో! అది పొరపాటు. వాళ్ళ అవసరాలకు సరిపడా వాళ్ళ దగ్గిర డబ్బుంటూనే ఉంది. అందుచేత నా సలహా ఏమంటే-"

"ఒంటిమీద ఒక్క మంచి బట్టగాని, ఒక్క నగగాని లేకుండా ఉండటమేనా అవసరాలు తీరటం?"

"—అందుచేత నా సలహా ఏమంటే, మీరు డబ్బుమీద ఆశే స్ట్రెస్ చెయ్యకండి. మీరు మా లక్ష్మికి—అదే నర్సుకు—తాతగారు. తాతగారి కుండదగిన వాత్సల్యం మీలో ఉన్నది; అది నాకు తెలుసు. ఆడవాళ్ళకి - అందులోనూ డబ్బంటే లక్ష్యం లేనివాళ్ళకి- ఆపేక్ష అంతఃకరణలపైన చాలా భ్రాంతి ఉంటుంది. నా కిన్నేళ్ళు వచ్చాయా? మా బాబాయిగాని, మా సుబ్బక్కగాని—"

"అసలు విషయం వదిలేసి ఏమిటో మాట్లాడతావేం?"

"—మా సుబ్బక్కయ్యగాని, 'అయ్యో, ఎంత చిక్కిపోయావురా! తిండి సరిగా లేదుగావాలు!' అంటే చాలు, ప్రాణం లేచివచ్చినట్టుంటుంది."

తెరిచిన నోరు మూయకుండా ఆయన నా కేసి కాస్సేపు చూసి "నీ వాలకం చూస్తే నాపైన దాని మనసు నువే విరిచేస్తున్నట్టున్నావే. తనకు రావలసిన ఆస్తి తన కూతురు కొస్తుందంటే నా కొడుక్కి కూడా ఇంత - ఇంత ఇవ్‌డిఫరె న్సుండదు," అన్నాడు.

"నన్ను బొత్తిగా అన్యాయం చేస్తున్నారు! మిమ్మల్నీ మీ మనవరాల్నీ కలిపితే నాకే లాభం గదండీ? రేపు మీ రికమెండేషన్‌తో మంచి ఉద్యోగం సంపాదించుకోవచ్చుకూడా గదా!"

ముసలాయన ఈ మాటకు సంతోషించినట్టు కనబడ్డాడు. ఆయన కుట్రదారు గొంతు పెట్టి, "చూడు, దా న్నొక్కసారి ఇక్కడికి రమ్మంటావ్? వాళ్ళకి తెలీకూడదు సుమా. అయిదే అయిదు నిమిషాలు మాట్లాడతాను, ఆఁ?" అన్నాడు.

నా కాయన వాలకం చూస్తుంటే ఏదో భయం వేసింది. నర్సును రానిచ్చి, దాని గొంతు కాస్తా పిసికేసి, సర్కిల్‌తో శవాన్ని

మాయం చేసెయ్యమని చెప్పేసి, బెజవాడ బండి ఎక్కేస్తాడేమో? అసలే కింగ్‌లియర్ లాటి మనిషి; అటువంటివాడి ప్రేమ దారుణమైన కోపంగా మారటమూ, పిచ్చెత్తటమూ అసంభావ్యం కాదు.

"ట్రై చేస్తానండీ. ఇంక నేను వెళ్ళనా?" అన్నాను.

"త్వరగా వెళ్ళమరి. నేనిక్కడ ఇంకో అరగంటే ఉంటాను. ఊళ్ళో కొంచెం పని చూసుకుని రైలు పట్టుకోవాలి," అన్నారాయన.

నేను తిరిగి వచ్చేసరికి నర్సు బయటి పాకలో నులకమంచం వాల్చుకుని పడుకుని ఇంగ్లీషు ప్రోజో ఏదో చదువుతున్నది.

"ఆ వచ్చినవాడు సర్కిల్‌గారి నౌకరు కాదూ?" అని ఆమె అడిగింది.

"అవును. మీ తాత వచ్చి అక్కడ కూర్చున్నాడు. నీతో అయిదు నిమిషాలు మాట్లాడాలిట. నన్నడిగితే ఆయనకు కాస్త మతి సరిలేదేమో నంటాను."

నర్సు మొహంలో ఎటువంటి వికారమూ లేదు. మళ్ళీ పుస్తకం చదవసాగిందామె.

నేను లోపలికి వెళ్ళి నా గదిలో పడుకున్నాను. డాక్టరుగారు పడకగదిలో పడుకుని కునుకు తీస్తున్నట్టున్నాడు. సుందరమ్మగారు దొడ్లో అంట్లో కంచాలో తోముతున్న చప్పుడవుతున్నది.

నేనేదో నవల తీసుకుని కళ్ళతో చదువుతూ, మనస్సుతో నర్సునుగురించి ఆలోచిస్తున్నాను. అవకాశం బాగున్నది. నేను మళ్ళీ బయటికి వెళ్ళి పాకలో పడుకున్న నర్సును ఒక్కసారి ముద్దు పెట్టుకుంటే ఏమవుతుంది? కెవ్వున అరుస్తుందా? ఎందుకరవాలి? నేను తన ప్రాణం కాపాడేనే! ఆ పాటి కృతజ్ఞత ఉండకూడదా? మనుషులెంత కృతఘ్నులూ!

అప్పుడే నేను నర్సును ముద్దు పెట్టుకున్నట్టూ, నర్సు కెవ్వున అరిచినట్టూ, డాక్టరుగారూ, భార్యా పరిగెత్తుకుంటూ వచ్చినట్టూ, నా దౌర్జన్యం గురించి పత్రికల్లో నా ఫోటోతో సహా పడినట్టూ అనిపించి నాకు సిగ్గూ, అవమానమూ, విరక్తీ కలిగాయి.

"అమ్మాయ్! నర్సూ!"

సుందరమ్మగారు దొడ్లోనుంచి పెట్టిన ఈ కేకతో నేను ఊబిలోనుంచి బయటపడ్డాను.

బయటినుంచి నర్సు పలకలేదు. చదువుతూ చదువుతూ నిద్రపోయిందేమో నని, బయటికి వచ్చాను – లేపి, మీ అమ్మ పిలుస్తున్నదని చెప్పటానికి.

నర్సు పాకలో లేదు. ప్రోజు రీడరో ఏదో నులకమంచమీద పెట్టిఉన్నది.

నాగుండె గుభేలుమన్నది. నర్సు ఆ ముసలాయనదగ్గిరికి వెళ్ళిందా? తల్లికీ తండ్రికీ చెప్పకుండా! ఆ పిల్లలో ఇటువంటి కూబివేషా లున్నట్టు నేను కలలోకూడా ఊహించలేదు.

తలవాకిలి తలుపులు చేరవేసి ఉన్నాయిగాని, గడియపెట్టిలేవు. తలుపులు తెరిచి వీధిలోకి తొంగిచూశాను. నర్సు ఏదో ఆలోచిస్తూ తిరిగి వస్తూన్నది – తాతదగ్గిరనుండే! నన్ను చూసి గబగబా నడిచివచ్చింది.

నేను పళ్ళు బిగబట్టి రహస్యంగా, "మీ అమ్మ కేకేసింది! త్వరగా వెళ్ళు!" అంటూ వీపుమీద ఒక్కటి వేశాను, ఎవరికీ చెప్పకుండా ముసలాయన్ను చూడబోయినందుకు శిక్షగా.

నర్సు వెనక్కు తిరిగి అదో విధంగా చూసింది – కోపంతో మటుకుకాదు. బతుకు జీవుడా అనుకున్నాను.

అయిదు నిమిషాలలో నర్సు తిరిగివచ్చిన దాకా నేను పాకలో బెంచిమీదే కూర్చున్నాను. ముసలాయన సీక్రెట్ ఏజంటుగా ఆయనపని ఒక్కటి చేసిపెట్టాను. ఆయిన ఏమన్నాడో తెలుసుకోవాలని నా మనసు కొట్టుకుపోతున్నది. సీక్రెట్ ఏజంటయిన తరవాత రహస్యాలన్నీ తెలుసుకోకపోతే ఎట్లా?

నర్సు తిరిగివచ్చి మంచంమీద కూచుంటూ, "గిన్నెలు తొలిచి ఇస్తానేమోనని అమ్మ పిలిచిందిట!" అన్నది.

"గిన్నెలమాట కేంలే? ఏమంటాడు?"

"ఏమంటాడూ? కంటతడి పెట్టుకున్నాడు. అంత పెద్దవాడు కళ్ళు తుడుచుకుంటుంటే నాకు చాలా కష్టం వేసింది...నాన్నకు చాలా అన్యాయమే చేశాడుగాని... నేనంటే పడి చచ్చిపోతున్నాడు, పాపం. కాని నేనేం చెయ్యగలనూ? నన్ను వచ్చి తనదగ్గిర ఉండమంటాడు," అన్నది నర్సు.

"మీ అమ్మనూ, నాన్ననూ వదిలిపెట్టా?" అన్నాను ఆశ్చర్యంగా.

"పెళ్ళయితే అత్తారింటికెళ్ళిపోవా? ఆడపిల్లకి అమ్మా, నాన్నా శాశ్వతమా?' అని అడిగాడు."

"ఏమన్నావ్?"

"పెళ్ళయేది, పిల్లలు పుట్టేది, మా అమ్మా, నాన్నా నా దగ్గిర ఉండాలిసిందే నన్నా."

"అసలువిషయం అదికాదు. నీతోబాటు మీ అమ్మనూ, నాన్ననూ తనదగ్గిరి కెందుకు రమ్మనడో అడక్కపోయావా?"

"అడగలేదు...మా నాన్నమీద విరోధం కట్టాడుగా?"

"పిచ్చిదానా, ఆయనకు మీ నాన్నమీద ప్రేమ లేకుండా నీపైనమాత్రమే పుట్టుకొచ్చిందంటే నమ్మావా? ఆయననుంచే గదా నువు ఆయన మనవరాలివి?"

"అయితే మమ్మల్నందర్నీ వచ్చి ఎందుకు తనదగ్గిర ఉండమనడూ?"

"అదే నువ్వాలోచించాలిసింది. నిన్ను బంగారంలో కప్పుతా నంటున్నాడుగదా! మీ అమ్మనూ, నాన్ననూ పోషించటం ఆయనకు కష్టమవుతుందా? ఎన్నటికీ కాదు. నీకోసం ఏడవటానికి సిద్ధంగా ఉన్నవాడు, నువ్వొక్కతివే రావాలని భీష్మించుక్కూచోకపోతే, నీవెంట ఉండటానికి అర్హులైనవాళ్ళిద్దర్నీ కూడా ఎందుకు రమ్మనగూడదూ?"

"అదే నాకూ అర్థంకాలేదు"

"నర్సూ, ఆయనకు నీమీద ఉన్న ప్రేమ కపటమైన దనటానికి నాకు గుండె చాలదు

[మిగతా 38వ పేజీలో]

తంజావూరు సరస్వతీ మహాలు

వికలదేవుని సుందరశర్మ

కాలము మిక్కిలి బలము గలది. దాని వలల జిక్కనిది బ్రహ్మ సృష్టిలో నేడియు లేదు. కాల మైంద్రజాలికునివలె క్రొంగ్రొత్తవాని నెన్నింటినో చూపెట్టును. అట్లే మనము చూచుచున్నవాని నెన్నింటినో తన గర్భమున మరుగు పరచుకొని భావి సంతతివారికి వివిధభావాలను కలిగిస్తుంది. దాని లీలావిలాసము లతి విచిత్రములు. మన కందుబాటులో నుండినవానిని అతి ప్రయత్నలభ్యంగా చేస్తుంది. అచింతిత మైనదానిని అతి సులభంగా అందజేస్తుంది. అపరిచితములైన వాని నెన్నింటినో మన కంటగట్టింది. సుపరిచితములైన వానిని మరువజేసింది. దాని విచిత్రశక్తిని మన మాకళింపు చేసుకొనలేము. కాలము యొక్క వివిధ విచిత్రతలలో నిదొకటి. అంతేకాని యిదియే కాలముయొక్క సమగ్ర స్వరూపము కాదు. ఒకనాడు ఆంధ్ర సామ్రాజ్యలక్ష్మి సర్వాంగసుందరియై సర్వాలంకార శోభితయై నృత్యం చేసిన రంగస్థలముగా విరాజిల్లినది తంజావూరు. అట్టి పావన కళాక్షేత్రమయిన తంజావూరు నేడు మనల నాకర్షించుట లేదు. తంజావూరును గురించిన యనేక విషయాలు మనలో చాలా మందికింకా క్రొత్తవిగానే యున్నవంటే ఆశ్చర్యం లేదు. అవును – దక్షిణ భారతమున నున్న చోళ మండలమునకు తలమానికమై వెలిగిన తంజావూరును గురించియే పై మాటలు. దానికి కారణము ముందే చెప్పబడియున్నది "కాలము" అని.

తంజావూరు పేరు విన్నదే యెన్ని మధురాతి మధురభావములు, యెన్ని ఆనందమయైక దృశ్యములు మనలను మంత్రముగ్ధులవలె చేయుచున్నవి. 16, 17 శతాబ్దములు రెండును తంజావూరికిని ఆంధ్ర సారస్వతాభివృద్ధికిని మహోన్నత కాలమని పేర్కొనదగును. స్వర్ణాక్షరాలతో లిఖింపదగిన యశోవైభవమును కలిగిన నాయక రాజులు తంజావూరును పాలించిన కాలమది. విజయనగర రాజప్రతినిధులై తంజావూరును పాలించుచువచ్చిన యీ నాయక రాజులు విజయనగర పతనానంతరము స్వతంత్రులై నిష్కంటకముగా సుమారు 130 సంవత్సరములు పాలించిరి.

ఆంధ్ర నాయకరాజులతో ఆంధ్రదేశములో పేరెన్నిక గన్న లలితకళ లాదిగా సమస్తమును దక్షిణదేశము చేరి రాజాశ్రయమును పొంది విశ్వవిఖ్యాతి నందుకొన్నవి. వానిలో కొన్నియే భరతనాట్య శాస్త్రము, కర్ణాటక సంగీతం, ఆయుర్వేద వైద్యము మొదలగునవి. ఆంధ్రదేశం నుండి దక్షిణదేశమునకు వెళ్ళినవైనా నేడు భరతనాట్యం అంటే అందరికీ తంజావూరే జ్ఞప్తికి వస్తుంది. శాస్త్రీయ కర్ణాటక సంగీతమంటే కూడా అంతే. దానికి తగినట్లుగానే పై రెంటికీ తంజావూరులో నున్నంత ఆదరణ మరెక్కడా లేదంటే సత్యదూరం కాదు. ఎన్నో ఆంధ్ర కుటుంబాలు ఆ రాజుల నాశ్రయించుటకై దక్షిణ దేశానికి తరలివెళ్ళినవి. అచ్చటనే స్థిరపడిపోయినవి కూడ. వానిలో అతిలోక చరిత్ర కల కుటుంబాలు మాత్రమే అందరి దృష్టి నాకర్షింపగలవు. అట్టి కుటుంబాలలో నొకటియే త్యాగయ్యగారి కుటుంబము. క్రొవ్విన తమిళదేశం మధ్యమందు తెలుగు తేటతనాన్ని వెదజల్లి ఆంధ్ర సారస్వత విజయపతాకను ప్రతిష్ఠించిన ఘనుడు మన త్యాగయ్య. అటు వాగ్గేయకార ప్రపంచానికి యిటు గానకళా ప్రవీణులకూ నిత్యారాధ్యుడై వెలుగొందిన పుణ్యచరితుడైన మన త్యాగయ్య అరవగడ్డలో పుట్టినా తెలుగు బిడ్డయే.

ఈ విధంగా దక్షిణదేశంలో తెలుగు బిడ్డల నీరాజనా న్నందుకొన్న తెలుగుతల్లి దక్షిణాంధ్ర సామ్రాజ్యాధినేత లిచ్చిన నివాళినికూడ స్వీకరించి సుమారు మూడు శతాబ్దాలు దక్షిణాన నిష్కంటకింగా నృత్యం చేసింది. మహారాష్ట్ర పాలకుల కాలంలో కూడ తెలుగుపలుకే రాజభాషగా కులికింది. అంతేకాదు – ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో కూడ దక్షిణాంధ్ర సారస్వతము తన కొక ప్రత్యేక స్థానమును సృష్టించుకొన్నది. ఆనాటి తెలుగు చక్కదనము మొదలుకొని తెలుగువారి చారిత్రక విశేషముల వరకు గల సకలమునకు నేకైక నిదర్శనముగా నిలిచింది తంజావూరు సరస్వతీ మహల్ గ్రంథాలయ మొక్కటే. చోళ రాజులు,

నాయక రాజులు, మహారాష్ట్ర రాజులయొక్క సంస్కృతి త్రివేణీ సంగమమువలె మిళితమై లోకుల యజ్ఞాన మనెడు పాపమును తొలగింపగల విధముగా నుండుటను మనము ప్రత్యక్షముగా చూడవచ్చును. ప్రతివారికిని ప్రతిరోజు ఒక్కొక్క క్రొత్తవిషయ మట స్ఫురించుచుండుట అనుభవ సిద్ధము.

రాజులు మారితే రాజభాషకూడ మారటం సహజం. కాని తంజావూరులోమాత్రం అట్లు కాక తెలుగు రాజుల తర్వాత మహారాష్ట్ర రాజులు పాలించినా తెలుగుమాత్రం తన స్థానాన్ని కోల్పోలేదు. అంతేకాదు, మహారాష్ట్రరాజులుకూడ స్వయంగా తెలుగు నేర్చి తెలుగు గ్రంథాలను నిర్మించి తెలుగు కవు లయి ధన్యు లైనారు. అట్టిపట్ల వారి కాలంలో తెలుగు భాషకు తెలుగు కవులకు విశేషాదరణ యుండిన దని వేరుగా చెప్ప నక్కరలేదు. త్యాగయ్యగారి మాతామహుడుగా చెప్పుకొనబడు గిరిరాజకవి యతని సహోదరుడు విచిత్రరాయవతంసుడను బిరుదనామము గం కవిగిరియు తమ సంగీత నాట్య కళా వైదగ్ధ్యమును చాటినది తంజావూరు రాజు శహాజీ (1684-1711 A. D.) కాలముననే. పద కవిత్వంలో గిరిరాజు దిట్ట. ఈ విధంగా మహారాష్ట్ర రాజు లందరును తెలుగుతల్లి యాశీస్సుల నందుకొన్నవారే.

విశేషించి యాంధ్రదేశమునకు చెందిన దేశీయ వాఙ్మయమైన యక్షగాన వాఙ్మయము తంజావూరులో నాయక రాజులు ప్రవేశ పెట్టగా దానిని నానావిధాల పోషించి తాముకూడ ఆ గేయ వాఙ్మయమును అనేక రకములుగా సృష్టించినవారు మహారాష్ట్ర రాజులు. శహాజీ కాలంలో పెక్కు యక్షగానములు పుట్టినవి. అంతే కాక శహాజీ దృష్టిలో యక్షగాన మనునది ఒక కళ. కళకు భాష అంటూ ఒకటిలేదు. అంచే ఒకే భాషలోనే కాదు; అది యే భాషలోనైనా యుండవచ్చును. కాబట్టి యక్షగానము తెలుగులోనే నిర్మింపబడ వలయు నను నియమ మక్కరలేదు, అని భావించి యతడు తమిళ, మహారాష్ట్ర, హిందీ, సంస్కృత భాషలలోకూడ యక్షగానములను సృజియించి నూతన మార్గ ప్రవక్తకు డైనాడు. ఇటువంటి యపూర్వ సంవిధానములతో కూడిన వాఙ్మయ వికాస విశేషములను తంజావూరు సరస్వతీ మహలులో తప్ప మరెక్కడను మనము చూడలేము, గ్రంథ రచనలతోపాటు గ్రంథ సేకరణకూడ శరవేగముతో సాగింది. తంజావూరులో. గ్రంథము లెక్కడైన దొరుకుతుందంటే ఆ రాజులకు రాజ్యం దొరికినంత సంతృప్తి. ఈక్రింది చాటు పద్యాలను పరిశీలిస్తే గ్రంథాలమీద వారి యాశ, గ్రంథసేకరణలో వారి కున్న దీక్ష వ్యక్తము కాగలదు.

గీ. మనుచరిత్రంబు కల్గిన మనుజచంద్రు
వసుచరిత్రంబు తెలుసుకో వచ్చినాడ
అన్న సంబళ మిప్పించి మనుపు నన్ను
రమ్యగుణసాంద్ర శరభోజి రాజచంద్ర,

క: సంబళము చేసి నిలిపిన
నింబున నే పుస్తకంబు నెక్కడనైనా
సంబాళించుక తెచ్చెద
శంబరహరతుల్యరూప! శరభోజినృపా!

తంజావూరు ఆంధ్ర నాయకరాజుల కాలమున ఆంధ్ర సారస్వతము వేయిభంగుల వెల్లివిరిసినది. ద్విపదకావ్యముల పట్టినిల్లైనది తంజావూరు. యక్షగానములకో కరువు లేదు. ప్రబంధము లనేకములు. అభ్యుదయ కావ్య ప్రవర్తకుడు రఘునాథుడు (1614-1633 ఏ. డి.) అనాటి సారస్వత ప్రవాహమున కద్దులేదు. కారణము సారస్వత వ్యాసంగమే ప్రభువుల కత్యంత ప్రీతికరమైనది. అంతటితో ఆంధ్రదేశపు లలిత కళలైన సంగీతం భరతనాట్యం మొదలగు వానికి సంబంధించిన గ్రంథము లన్నియు అనువాదములుగను స్వతంత్ర గ్రంథములుగను స్వరూపమును పొందినవి; ఒకటేమి ప్రబంధములు, యక్షగానములు, ఛందస్సు, నిఘంటువులు, సంగీతము, నాట్యము, వైద్యము, జ్యోతిషము, సాముద్రికము ఇత్యాది వివిధ విభాగములలోని యానాటి యుత్తమోత్తమ గ్రంథము లన్నియు నీనాడు మనకు సరస్వతీ మహల్ గ్రంథాలయము నందు లభ్యములగుచున్నవి.

ఈ గ్రంథాలయమున భద్రపరుపబడిన గ్రంథములలో ముఖ్యములైన విభాగములు నాలుగు. అందులో ప్రధాన విభాగము సంస్కృతము. సంస్కృతమున సుమారు 30000 కు పైగా గ్రంథము లున్నవి. తమిళమున 3000. తెలుగున 2000 మహారాష్ట్రమున 2000. ఇవి కాక స్వల్పముగా నైనను నితర భాషాగ్రంథములు కూడ నిట సురక్షితములైయున్నవి. పై విషయమును బట్టి చూడగా తంజావూరు పాలకులకు సంబంధించినంతవరకు భాషావిభేదమున కాస్కార మిసుమంతైనను లేకుండిన దను విషయము స్పష్టముగా గోచరించ గలదు. భాష విషయమున వారి సమదృష్టి వారి యుదార గుణమునకు ప్రథమోదాహరణ మనక తప్పదు. ఏ భాష కా భాష, ఏ గ్రంథమున కా గ్రంథము ఇతర సారస్వతమున కవిరోధముగా వర్ధిల్లినది తంజాపురమున.

తంజావూరు మహారాష్ట్ర పాలకులలో నించుమించు కడపటివాడైన శరభోజీ మహారాజు రాజ్యానికి వచ్చినతరువాత కాశీ యాత్ర చేయుచు దారిపొడగునా తారసిల్లిన చోట్ల వ్రాతప్రతులను అన్నిభాషలలోను స్వీకరించి వాని నన్నింటిని సరస్వతీ మహలులో భద్రపరచెను. ఇతని కాలమునకు (1796-1832) ఆంగ్ల ప్రభావము మన భారతదేశముమీద అధికముగా ప్రసరింప నారంభించినది. కాబట్టి యతడు సేకరించిన గ్రంథాలలో అచ్చొత్తించిన ఆంగ్ల గ్రంథాలుకూడ నెక్కువగా నున్నవి. ఈ విధముగా తంజావూరులో పాలకులు, పరిపాలనా విధానము మారినాకూడ సారస్వత వ్యాసంగము మాత్రము కుంటుపడక యథాప్రకారముగా సాగుచు వచ్చుచుండినందు

వలన తంజావూరు, దేశమంతటికిని మార్గదర్శక మైనది. తత్ఫలితముగా నేర్పడిన యొక గొప్ప వ్రాతప్రతుల గ్రంథాలయమే ఈ సరస్వతీ మహల్. ఈ గ్రంథాలయానికీ పేరు మహారాష్ట్ర రాజుల కాలంలోనే వచ్చియుండవచ్చు నని యూహ. కొన్ని వ్రాతప్రతులమీద "సద్భారతీసద్మ" యని యుండుటనుబట్టి యా పేరు బహుశః నాయకరాజుల కాలంలో నీ గ్రంథాలయానికుండవచ్చు నని విజ్ఞు లభిప్రాయ పడుచున్నారు.

మొత్తానికి జ్ఞాన తపస్వులకు విజ్ఞాన తృష్ణ గలవారికి సారస్వతోపాసనాపరులకు సరస్వతీ మహల్ గ్రంథాలయ మొక పట్టుగొమ్మ. ఆంధ్రుల దృష్టిలో పూర్వుల నిరంతర కృషికి, సారస్వతారాధనకు, యశో వైభవ వికాసములకు, పాండిత్య ప్రకర్షకు, కళారాధన కళాభిజ్ఞత్వములకు ప్రథమ తార్కాణ మీ సరస్వతీ మహల్ అనుట అత్యుక్తి కాదు. అంతియ కాక దాని ప్రారంభకులే యాంధ్రు లగుట మరియొక గర్వకారణము.

శరభోజీ కాలంలో తంజావూరులో జరిగిన విశేషము దేశమున కంతటికి మహోపకార మనక తప్పదు. ఇతడు ధన్వంతరీ మహల్ అను నొక వైద్య విషయక పరిశోధనా సంస్థను స్థాపించి, అంతకు ముందే సరస్వతీ మహలులో నుండిన సంస్కృతాంధ్ర వైద్య గ్రంథముల నాధారంగా గొనియు, దేశంలోని ప్రజలనుండి సేకరించిన ప్రక్రియల నాధారంగా గొనియు సుమారు 5000 అనుభవ వైద్య ప్రక్రియలను విశిష్టములుగా నిర్ణయించి, వానిని తమిళ భాషలో ఛందోబద్ధములు గావించి వ్యాధుల క్రమమున వర్గీకరించి 18 సంపుటములుగా నిట భద్రపరచి యున్నాడు. ఆ విధముగా వర్గీకరణ మనునది ఆయుర్వేద వైద్య విధానమున నంతకుముందు జరిగి యుండలేదు. అతి స్వల్ప వ్యయసాధ్యములైన యీ ప్రక్రియ లన్నియు దేశ ప్రజలందరి కందుబాటులో నుండునట్లు ప్రభుత్వము శ్రద్ధ తీసుకొని యన్ని భాషలలోను అనువదింపబడునట్లు చేయుట యెంతైనా వాంఛనీయము. మందుల పేళ్ళు తమిళ భాషలో నుండినను వాని ప్రభావంలో తెలుగు తమిళ భేదం లేదు గదా! ఇప్పటికే ఈ భాగము లన్నియు తమిళ భాషలో ప్రచురింప బడియున్నవి. ఇక సంగీతాన్ని గురించిగాని, నాట్యాన్ని గురించిగాని చెప్పవలసిన యక్కర లేదు, కర్ణాటక సంగీత భరతనాట్య సంప్రదాయ సర్వస్వమంతయు సరస్వతీ మహల్ గ్రంథాలయమునమాత్రమే నేడు మనము చూడగలము.

సంగ్రహంగా చెప్పవలసి వచ్చినచో "ఆంధ్ర సంగీత నృత్య నాట్య వైద్య సారస్వతా ద్యఖిల ప్రాచీన కళా విజ్ఞాన పేటిక ఈ సరస్వతీ మహల్" అని చెప్పుట యుక్తతర మగును.

(35 వ పేజీ తరువాయి)

గాని, ఒక్కటి రూఢిగా చెప్పగలను. నీమీద ప్రేమకంటేకూడా ఆయన దురహంకారం బలమైనది. నిన్ను నీ తల్లిదండ్రులనుంచి వేరు చెయ్యలేకపోవటంచేత ఆ దురహంకారం దెబ్బతిని కన్నీరుగా బయటికి వస్తున్నా నే నాశ్చర్యపడను. నే చెప్పేది అర్థమయిందా? ఇంకోటి చెబుతాను మనస్సులో ఉంచుకో. ఆయన అసలు ద్వేషం మీ అమ్మపైన. ఆవిడ పేరు చెబితే వాంతిచేసుకుంటాడు — చేసుకున్నాడు. ఆవిడ కారణంగానే మీ నాన్నపైన కత్తి కట్టాడు. ఆవిడను మీ నాన్న ఈ క్షణాన వదిలేస్తే మరుక్షణాన నిన్నొక భుజానా, మీ నాన్ననొక భుజానా ఎక్కించుకుని డాన్సు చేస్తాడు."

నర్సు తల వంచుకుని, "నాకు తెలుసు, మా అమ్మకూ్కడా తెలుసు," అన్నది.

నర్సుతో రహస్యం పంచుకున్న చనువుతో గడ్డం పట్టుకుని, మొహం పైకెత్తి, "నీకోసం నేనుకూడా ఏడవగలను. కాని నిన్ను ఘోరమైన పన్లేవీ చెయ్యమనను. ముసలాడి మాయలో పడకు. మంచి ముహూర్తంచూసి నా మాయలో పడుదువుగాని." అన్నాను.

నర్సు నాచేతినుంచి తల విదిలించేసుకున్నది (సశేషం)

ప్రభుత్వ నిర్ణయాలు

* రాష్ట్రంలో మనీసర్క్యులేషన్ పథకాలను నిర్వహించడం, ప్రోత్సహించడాన్ని నిషేధిస్తూ శాసనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

* బంజరుభూములను పంపిణీ చేసే సందర్భంలో హరిజనుల తర్వాత ప్రాధాన్యక్రమంలో బర్మా కాందిశీకులకు పంపిణీ చేయాలని నిశ్చయించారు. ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దాదాపు 60,000 మంది కాందిశీకులు వచ్చారు. వారిలో చాలామంది గ్రామాలలో స్థిరపడ్డారు. అక్కడ వారికి నివాససౌకర్యాలు కల్పించబడ్డాయి.

* పాఠశాల భవనాలకు దాతల పేర్లను పెట్టే విషయంలో ప్రతికేసునూ వాటి యోగ్యతనుబట్టి నిర్ణయించాలని నిశ్చయించారు. అయితే ప్రాథమిక పాఠశాల భవనాల విషయంలో దాతలు నికరంగా రు. 5000/-లు గానీ, ఖర్చులో 50 శాతం గానీ ఏది ఎక్కువైతే అంత మొత్తాన్ని విరాళంగా యిచ్చినప్పుడు పంచాయతీ సమితులు ఆ పాఠశాలభవనాలకు దాతల పేర్లు పెట్టడానికి అనుమతించవచ్చు.

* మునిసిపాలిటీలు, పరిశ్రమల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశ్రామిక వ్యవస్థలకు మునిసిపల్ పన్ను మినహాయింపులను యిచ్చే సమస్యను పరిశీలించడానికి వీలుగా ఆర్థికమంత్రి, పబ్లిక్ వర్క్సు శాఖమంత్రి, కార్మిక, రవాణాశాఖల మంత్రులతో ఉపసంఘాన్ని నియమించాలని ప్రభుత్వం నిశ్చయించింది.

* గ్రేటర్ హైదరాబాదు వినియోగదార్ల సహకార సంఘానికి కార్యనిర్వాహణకి పెట్టుబడి నిమిత్తం రు. 25.00 లక్షలు రుణంగా మంజూరు చేయాలని నిశ్చయించారు. యీ స్టోర్ మరియు కేంద్రం ఉద్దేశించిన పథకాలక్రింద ఉన్న వరంగల్లు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నాలలోని యితర స్టోర్లకు రు. 10/- లక్షల చొప్పున పరపతి లభిస్తుంది.

* భారత ఆర్థికసంస్థ భవననిర్మాణానికి సైఫాబాదు సమీపంలో 2000 చదరపు గజాల భూమిని విరాళంగా ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది

మిహిరకులుడు

సీరియల్ నవల :

పదవ అధ్యాయము

రాజు తలఁచికొన్నచో దెబ్బలకు గొదువయా యన్నట్లు మిహిరేశ్వరాలయము నాలుగునెలలలోనే పూర్తి యయ్యెను. ఎచ్చటెచ్చటి శిల్పులు వచ్చిరి. ప్రతిదినము లక్షమంది పనివాండ్రు పనిచేసిరి. నానావర్ణ శిలలు వచ్చెను. శివాలయమునఁ బ్రతిష్ఠ చేయకముందు నాలయముమీఁద శిఖరము నేర్పాటు చేయవలయును. ఆ శిఖరస్థాపన చేయుటకుఁ బీటలమీఁదఁ గూర్చుండి యెవరు సంకల్పము చేయుదురో వారికిఁ దొందరలో మృత్యువు వచ్చును. ఇపు డెవరు చేయవలయును ? రాజకుటుంబములోఁ బరమవృద్ధులుందురు. వారిచేతఁ జేయింపవలెను. గోనందవంశీయులైన వృద్ధులు లేరు. అందుచేత బ్రాహ్మణులు మామగారైన గాంధారరాజుచేతఁ జేయించినచో బాగుగానుండునని మిహిరకులునితోఁ జెప్పిరి. మిహిరకులుఁడుకూడ నంగీకరించెను. కాని పోయి మామగారితోఁ జెప్పవలయును. ఆయన యంగీకరించునో యంగీకరింపఁడో మఱియుఁ గల్యాణవతి కైదవనెల వచ్చెను. నీలాంకుఁడు రాజయినప్పటినుండి యింతవఱకుఁ గల్యాణవతి పుష్కలావతిపురమునకుఁ బోలేదు. నీలాంకుఁడు వివాహమాడెను. అతని కొక కుమారుఁడు కలిగెను. అతఁడు రమ్మని వార్తలు పెట్టెను. దారదులయొక్క, భాట్టులయొక్క, మ్లేచ్ఛులయొక్క యొత్తిడిలోఁ దగుల్కొనిన మిహిరకులుఁడు తాను పోవుటకు వీలులేదనియు, భార్యను వెళ్ళిరమ్మనియుఁ బలుసార్లు చెప్పెను. కాని యామె భర్తలేకుండఁ బోవుట కిష్టపడలేదు. నీలాంకుఁడే భార్యతోఁ దన కొడుకుతో గర్భవతియైన తన సహోదరిని వచ్చి చూడవలయు నని సంకల్పించెను. వృద్ధమహారాజును రమ్మనెను. ఆయన మీరు పోయి చూచి కల్యాణవతిని బురుటి కిక్కడికే తీసికొని రండని చెప్పుచుండెను. మిహిరకులుఁడు మామగారికి వార్త నంపెను. 'మీరు వచ్చి తీరవలయును. నేను మి మ్మెప్పుడు నేదియుఁ గోరలేదు. ఇదియే నా కోరిక. నా పెండ్లియయి పాతికయేండ్ల పైన నైనది. తన పుట్టింటివారు చూచిపోవుటకు వచ్చినారన్న తృప్తి యింతవఱకుఁ గల్యాణవతికి లేదు. నేను నిర్మింపఁజేసిన మిహిరేశ్వరాలయము

విశ్వనాథ సత్యనారాయణ

నకు సంప్రోక్షణ జరగవలయును. దేవాలయముమీద శిఖర మెత్తవలయును. ఆ శిఖరము ప్రతిష్ఠ మీ దంపతు లిద్దఱును గలిసి చేయవలయును. లేనిచో నేను కోట్లు వెచ్చించి చేసిన యీ మహాప్రయత్నము వ్యర్థ మగును. సంప్రోక్షణయే చేయను. ఈ నా నిర్మాణము బైరాగులమఠముగా మిగిలిపోవును,' ఎనుబదియవపడిలోఁ బడిన గాంధారరాజు తనకంటె నాలుగేండ్లు చిన్నదై తనకంటె వృద్ధురాలై యామె బ్రతికియున్నదో లేదో, యామె రాణియో కాదో యన్నస్థితిలో జీవిత మంతయు గడపిన తన మహారాణితోఁ గొడుకుతోఁ గోడలితో మనుమనితో బయలుదేరివచ్చెను.

ఒక్కొక్కజీవి యొక్కొక్కరీతిగా బ్రదుకును. ఒకఁడు జీవితాంతము రాజు. అతఁడు పేరునకు రాజు. యథార్థమైన ప్రభువులు మంత్రులును, పురోహితులును, సేనాపతులు నైయుందురు. వృద్ధుఁడైన గాంధారరాజుభార్య యట్టిది. ఆమెకుఁ దాను రాణి నని తెలియదు. రాజ్ఞీత్వ మిట్టిదని తెలియదు. భర్తతో నిది చెప్పి చేయింపవచ్చునని తెలియదు. ఒక పల్లెటూరిలో సామాన్య సంసారములో నుద్భవించి మఱియొక సామాన్యునకు భార్యయై వంటచేయుట తప్ప మఱియితర మెఱుఁగక, సంతానమును మాత్రము గనుచు, వారి గౌరవము వారు చేయు గౌరవముకూడ నెఱుగక యెనుబదియేండ్లు బ్రదికి చచ్చినను బచ్చినట్లు తెలియని యొకజీవివలె నా మహారాణి యుండెను. ఆ దంపతులు కూర్చుండి మిహిరేశ్వరాలయ శిఖరమునకుఁ ప్రతిష్ఠఁ చేసిరి. ఉత్సవములు పదిదినములు జరిగెను. పదునొకండవ దినమున గాంధారాధిపతిభార్య చనిపోయెను. అందఱును దుఃఖమై దుఃఖము కాని మొగములతో నొకదినముసంచరించిరి. ఒక్క కల్యాణవతియొక్క దుఃఖమునకు మాత్రమే మేరలేకుండెను. ఆమె నోదార్చుటకు వీలులేకుండెను. అయిదాఱుదినములైనతరువాత నామె దుఃఖమపనయించుటకు మిహిరకులుఁడామె యొద్దకుఁ బోయెను. అతని యోదార్పుమాటలు విని విని యామె భళ్ళున పగిలి యిట్లనెను. "మహారాజా ! నా దుఃఖమేమని చెప్పుదును. నేను క్షీరసాగరమున జన్మించితిని. కాకోలమును పొందితిని. నేను జన్మించిన క్షీరసాగరము యొక్క కాంతిని మఱచిపోలేను." మిహిరకులుఁడు మరల మాటాడలేదు. వెడలిపోయెను.

రెండునెలలు గడచెను. మహారాజ్ఞికి నేడవనెల వచ్చెను, నెల నాళ్లైనతరువాతఁ గల్యాణవతి భర్తకు వార్తపెట్టెను. క్షమింపు

మనియుఁ దన సౌధమునకు రమ్మనియు. మిహిరకులుఁడు వెళ్ళెను. క్షమించితిరా యని యామె యడుగగా నతఁడు యధార్థకథనమును క్షమించుట యెందు కనెను. ఆమె యీ మహాకాకోలమునం దా శాంతి బీజభూతముగ నున్నదనియే నా తృప్తి. నా జన్మసాఫల్యము ననెను. అతఁడు నవ్వి భార్యను గౌగలించికొనెను — ఏడవనెల పూర్తి కాకమున్నే నీలాంకుఁడు తన సోదరిని దీసికొనిపోదు ననెను. భార్య పుట్టినింటికిఁ బోవు దినములు దగ్గరపడినకొలఁది మిహిరకులునకుఁ గల్యాణవతిమీఁద ప్రేమ పదింత లయ్యెను. ఆమెను ప్రొద్దుట చూచును. మధ్యాహ్నమున నేగి చూచును. సాయంతనమున నేగి చూచును. రాత్రులందామెకడకు రావద్దని వృద్ధపరిచారికులు నివారించిరి. పవళ్ళ తన భర్త వచ్చి తన్ను జూచువేళలు గుర్తెఱిఁగిన కల్యాణవతి యతని కంటి కభిరామముగా నుండుటకు మూఁడు వేళలయందును మార్చి మార్చి క్రొత్త భూషణములు ధరించి, క్రొత్త చీరలు దాల్చి, క్రొత్త రైకలు తొడుగును.

ఇంక నాల్గుదినములలోఁ గల్యాణవతిని బంపవలయును. ఆరాత్రి మిహిరకులుఁడు తన సౌధమునఁ దా నొంటరిగాఁ బండుకొని నిదురపట్టకుండగా, మిథ్యాప్రజ్ఞానదేవత కనిపించెను. ఇట్లనెను. "ఓయీ! ఆ బ్రాహ్మణుఁడు చెప్పిన దైదునెలలు. ఇప్పటి కేడు నెలలైనది. ఏడునెలలనుండి దేశము శాంతముగా నున్నది. మిహిరకులుఁడు మాఱిపోయె ననుకొనుచున్నారు. రేపటి నుండి నీ జపము నీవు చేయుము." మఱునాటినుండి మూన్నాళ్ళు మిహిరకులుఁడు తన జపమును జేసెను. యముఁడును బేతాళుడును పూర్వముకంటె ఘోరమూర్తులై, పూర్వముకంటె ఘోరదీర్ఘదంష్ట్రాకరాళవదనులై, పూర్వముకంటె వికటాట్టహాసదర్శనులై కనిపించిరి. ఆ మఱునాటి ప్రొద్దున మిహిరకులుఁడు తన భార్యను జూచుటకుఁ బోయెను. ఆమె యొక్కొక పుదొక్కొకవేసము వేయును. ఇప్పుడు వేసిన వేసము విలక్షణముగా నుండెను. రత్నములు పొదిగిన బంగారపుపూలలంగా ధరించెను. కంచుకమును దాల్చెను. ఆ కంచుక మాకుపచ్చని వన్నె గల చిక్కని మెత్తని పట్టుగుడ్డ చూచుకములమీఁద బంగారు తీగతో రెండుపాదములు కుట్టఁబడియున్నది. దానిపైన సన్నని యుత్తరీయమును ధరించినది. తల పాపట తీసి శిరోజములు వెనుకనుండి పైకెత్తి నడినెత్తిన ముడి వేసినది. దాని చుట్టును బూమాలలు చుట్టినది. కనులతుదల కాటుక శ్రవణాంతరేఖగాఁ దుమ్మెదలు బారు తీర్చినట్లుండెను. మొగమున వజ్రపుఁ బొడితోఁ గలిపిన పునుగును బొట్టుగా నవరించెను. ఆమె యీ శోభ నంతయు మిహిరకులుఁడు చూడలేదు. ఆమె తొడిగిన రైక వంక చూచెను. 'ఈ రైక యెక్కడిది? ఈ పాదము లెవరివి?' యని ప్రశ్నించెను. ఆమె తనకుఁ దెలియ దనియుఁ, బరిచారికలు కొనితెచ్చి రనియుఁ, దాను భర్తయొక్క సంతోషముకొఱకుఁ దాల్చితి ననియుఁ జెప్పెను. వెంటనే మిహిరకులుఁడు అంతర్వేశికుని బిలిపించి యడిగెను. అతఁ డిట్లు చెప్పెను. "ఈ రైకలు సింహళద్వీపము నుండి వచ్చును. సింహళద్వీపము నేలు రాజుయొక్క పాదచిహ్నములు వీనిపై నుండును. బంగారుతీగతో నా పాదములు కుట్టఁబడును. ఆ వస్త్రముయొక్క తళతళకు, దాని మిలమిలలకు, దాని మెత్తదనమునకు నీ బంగారపుఁగుట్టునకు మోహపడి స్త్రీలు



ధనినిగొందురు, ధరింతురు. మహారాజ్ఞి దినదినము తమరికంటె కింపుగా నుండుటకు దినమునకు మూఁడు క్రొత్తదుస్తులు కావలయు ననుటచేత నిది క్రొత్తదికదా యని సేవకులు తెచ్చిరి". అనఁగా మిహిరకులుఁడు మండిపడి యిట్లనెను. "ఎవఁడురా వాఁడు? నా భార్య వక్షస్థలముమీఁదఁ దన పాద చిహ్నములు వెలయింపఁగలవాఁడు?" రాజిట్లనుచుండగా నంతర్వేశికునకతని వదనములో బేతాళుఁడు కనిపించెను. అతఁడు భయపడి వెడలిపోయెను.

కల్యాణవతి మఱునాఁడు గాంధారదేశమునకుఁ బోవును. ఏడు నెలలయినవరాత్రి మిహిరకులుఁ డొక్కరాత్రిలో మిహిరకులుఁ డయ్యెను. రెండులక్షల కాల్బలము, పదివేల గుఱ్ఱములు, రెండువేల యేనుగులు, పదివేల ధానుష్కులు దుర్గములను ముట్టడించుటకుఁ గావలసిన పరికరములు చెల్లెలిని బురిటికిఁ దీసికొనిపోవుచున్న నీలాంతుని చిన్నిసైన్యముతో బయలుదేరెను. ఇది యెవ్వరికి నర్థముకాలేదు. కల్యాణవతి తన భర్తకుఁ దనమీఁద నింత ప్రేమయా యనుకొనెను అతని నడుగుట కెవ్వనికిని గుండె దిటవు లేదు. అంత సైన్యమును రెండు జాములలోఁ బ్రయాణమునకు సిద్ధపఱుపఁగల శక్తి సృష్టిలో నొక్క మిహింకులునకే కలదని చెప్పవలయును రాజెవనిమీఁదకో దండెత్తిపోవుచున్నాఁడని సర్వజనులకుఁ దెలియును. ఎక్కడికో యెవ్వనికిఁ దెలియదు. దర్పమల్లునకుఁ దెలయదు; నిష్కంటకునకుఁ దెలియదు. ఈ సైన్యము గాంధారదేశమునఁ బుష్కలావతినగరము చేరెను. అచటవిడియునని నీలాంతుఁ డనుకొనెను. మిహిరకులుఁడు సైన్యమును నడపించుకొంచుఁ బోయెను. మిహిరకులుడు సైన్యమునకు ముందు భద్రదంతావళము నెక్కి పోవుచుండును. సైన్య మంతయు వెనుక నడచుచుండును. ఏనుఁగు తొందరగా నడచుచున్నచో గుఱ్ఱములుగూడ దానివేగము నందికొనలేవు. సైన్య మేమందికొనును ? వెనుకబడినవానిని నఱుకవలయునని మిహిరుని యాజ్ఞ! అంత పవమానమానస తిరస్కారిత్వరాహంకృతితో సేన పోవుచుండెను. మిహిరుఁడు పుష్కలావతియం దాగి కల్యాణవతితోఁ దనపోవు దండయాత్ర యెక్కడికో చెప్పననుకొనిరి. కల్యాణవతి యనుకొనలేదు. సైన్యము గంగాయమునలు దాటెను. వింధ్యపర్వతములు దాటెను. చోళ లాట కేరళదేశములు దాటెను. రామేశ్వరము సమీపించెను. లక్షలాది నావలు సిద్ధపడెను. సర్వసైన్యము దంతావళములు, నాజానేయములు లంకకుఁ జేరెను. తొలినాఁడు శ్రీరామచంద్రుని వానరసేన యెంతనిర్భయముగా నెంతసురక్షితముగా లంకాద్వీపమునందుఁ బ్రవేశించెనో యంత నిర్భయముగా నంత సురక్షితముగా మిహిరుని సేనలు సింహళద్వీపమును జేరెను. మహారాజనగరమును ముట్టడించెను. 'ఈ రాజెవరు ? మనమీ దికెందులకు దాడి యెత్తెను' మొదలైన ప్రశ్నలు లేపుటకుఁ గూడ వ్యవధి లేని సింహళద్వీపాధిపతి తన రాజధాని రక్షణము తాను జేసికొనుచుండెను. దుర్గమభేద్యముగా నుండెను. లోనుండి కోటగోడల కెగఁబ్రాకిన సింహళద్వీపసేవలు కాశ్మీరసేనను కందకమునే దాటనిచ్చుట లేదు క్రింద నిలబడి కోటమీఁద నున్న శత్రుసైనికులను వధించుటకు ధానుష్కులు కూడ సమర్థులు కాకపోవుచుండిరి. పది దినముల ముట్టడి వ్యర్థ మయ్యెను. అపుడు మిహిరకులుఁడు తాను ధనుస్సును జేఁబూని దుర్గద్వారమునందు మొదలుపెట్టి, తన బాణములను బ్రయోగింప నారంభించెను. తూర్పునుండి దక్షిణముగాఁ బడమరకు, మరల తూర్పునుండి యుత్తరముగా మరల పడమరకు మిహిరకులుని బాణఘాతముల చేతఁ గోటగోడలమీది సైనికులు విదారితకవచులై, విభిన్నశిరస్త్రాణులై, పరిత్యక్తకరవాలురై కుప్పలుకుప్పలుగాఁ జనిపోవుచుండిరి. ఈ మహాప్రళయమున కొడ్డుకొనలేక కోటగోడమీఁద మొగము చూపించెడి సైనికుఁడు లేకపోయెను.

అపుడు కాశ్మీర మహారణ్య భద్రదంతావళములు కోటతలుపులను భేదించెను. కోటగోడ లేరాతి కారాయిగా నూడఁదీయఁబడెను. రాజును బందిగాఁ గొనివచ్చిరి. అది పెద్దసభ. దేశమునందలి వర్తకులనందఱను బిలిపించిరి. సింహళాధిపతి బద్ధహస్తుఁడై యవనతశిరస్కుఁడై మిహిరకులునియెదుట నిలుచుండెను. మిహిరకులుఁడానాఁడు తన భార్య ధరించిన రైకను తనవెంటఁ దీసికొనివచ్చెను. సింహళాధిపతి కా రైకను జూపించెను.

మి. కు : ఈ వస్త్ర మేమియో నీకుఁ దెలియునా ?

సిం. రా : తెలియును.

మి. కు : ఇది యేమి ?

సిం. రా : ఇది యామూషదేవి యన్న వస్త్రము. ఈ ధాత్రిలో నేయుదురు.

మి. కు : ఈ వస్త్రముమీఁద బంగరుతీగలతో నల్లిన చిన్నె లేవి ?

సింహళద్వీపాధిపతి మాటాడలేదు.

మి. కు : ఇవి నీ పాదచిహ్నము లందురు, నిజమేనా ?

సింహళాధిపతి మాట్లాడలేదు.

మి. కు : ఇది నీ యాజ్ఞచేతనే యిట్లు జరుగుచున్నదా ?

సింహళద్వీపాధిపతి మాటాడలేదు.

మి. కు : ఓయీ ! నీ కింతటి దుష్టత్వ మెందులకు ? నీ పాదచిహ్నములు సర్వభారత దేశమునందలి స్త్రీలయొక్క స్తనమండలములయందుండవలయునా? సర్వదేశాధిపతుల భార్యలయొక్క వక్షఃప్రదేశములయందుండవలయునా ? నీ వంతటి వీరుఁడవా ? ఏదీ నీ పరాక్రమము ? నీ చేయి నా కందిమ్ము.

సింహళద్వీపాధిపతి వెనుకాడెను. మిహిరుఁడు లేచివెళ్ళి వాని కుడిచేతిని దన కుడిచేతితోఁ బట్టుకొని దానిని నలిపెను. సింహళద్వీపాధిపతి చేతిబొమికలు నలిసులి యయ్యెను. ఎడమచేతితో వాని కంఠమును

బట్టికొని నొక్కెను. అతఁడు విగత ప్రాణుఁడై నేలఁ బడిపోయెను.

అంత మిహిరుఁడు సింహళద్వీపమునం దన్నిచోట్ల నుండినయాముషదేవీవస్త్రములను దెప్పించెను, రాజుపాదముల గుర్తు గలిగిన వర్వవస్త్రములను దగులబెట్టించెను. బంగరు తీగలతోఁ గుట్టఁబడిన పట్టిపట్టుగుడ్డ. లేడి యొడలికంటె మెత్తనిది, నెమలియీకల కంటె మెరుపుగలది. పరిపుష్టమైయున్న యుత్తమజాత్యశ్వముయొక్క మేనివలెఁ దాకినచో గగురుపొడుచునేమో యన్నట్లున్నది. దానిని దెప్పించి పదినావలమీఁదఁ దనవెంటఁ దీసికొనిపోయెను. ఆ రాజ్యమునకు మఱియొకనిని రాజు చేసెను. అతని సేన యంతయు మరల నిన్నాళ్ళకు మిహిరుఁడు తన సహజస్వరూపమును వహించెననఁగా సింహళద్వీపవాసులను చిత్రచిత్రముగా వధింప నారంభించెను. ఆ సింహళద్వీప ప్రధాననగరవిశాల పురోభాగమున నొక పెద్ద కాలభైరవ విగ్రహమును నెలకొల్పెను. అతఁడు నెలనాళ్ళు సింహళములో నుండెను. దినమునకు నూటయెనమండుగురను నరికి వారి కపాలములతో దినదినము కాలభైరవునకు నూతన రుండమాలలు సమర్పించెను. జనము గుండె పగిలిపోయిరి. దాగికొనుటకుఁగూడ స్థలములు లేక యావటిల్లిపోయిరి. అప్పటికి మిహిరుని దృష్టి వేఱ మఱలెను. సింహళములోనికిఁ గ్రొత్తక్రొత్త సైన్యములు వచ్చుచుండెను. ఈ సైన్యము లెచ్చటివి? విచారింపఁగా చోళ లాట కర్నాటదేశాధిపతులు సింహళాధిపతికి సాహాయ్యము చేయుటకు సేనలను పంపించుచుండి రని తెలిసెను. తొలుతఁ గొందఱు సైనికులు సింహళములో దిగిరి. వారికిని గాశ్మీర సైనికులకు సంఘర్షణలు జరిగెను. దిగిన చోళ లాట కర్ణాటసైన్యములు సింహళద్వీపవాసుల నెఱుఁగుదురు; వారి దుస్తుల నెఱుఁగుదురు. కాశ్మీర సేవ దుస్తులు, వారి ముఖములు క్రొత్తగా నుండెను. వీరే పర సైన్యమని తెలిసికొని వారు వీరి నెదిరించిరి. అప్పటినుండి చిత్రవధ యారంభింపఁబడెను. చోళ లాట కర్ణాటసేనలు దిగినవి దిగినట్లే హరింపఁబడెను. సముద్రముమీఁద వచ్చుచున్న సేనలు సముద్రమునందే హరింపఁబడెను. ఈ కాశ్మీర సైనికులు సైనికులు కారు. వీరు యమభటులు. తమ పడవలపైనుండి వీరి పడవలపైకి దూకుదురు. రెండుపడవలను తలక్రిందు లగును. సముద్రకెరటములు వచ్చి ముసురుచుండును. కాశ్మీరసైన్యములు తిమింగిలములవలె వచ్చి పెద్దకోరలతోఁ గొఱికినట్లు ఖండించినట్లు జరుగును. మిహిరుఁ డెంతటి మృత్యువిద్యాపరమరహస్యవేత్తయో వాని సైనికు లంతటి మహామారులు. సముద్రమధ్యమునందు జరుగుచున్న యీ ఘోరమును జూచి రామేశ్వరమునొద్ద సేనలు వెనుకకు మరలిపోయెను. మిహిరకులుఁడు కాలభైరవునకు నలువదిదినములు దీక్షగా నష్టోత్తరశత రుండమాలలు సమర్పించి సింహళద్వీపమున బ్రదికియుఁ జచ్చియు నొకచే యైన సహస్రపరిమితులైన జీవులను వదలిపెట్టి వెనుకకు మరలెను. యాముషదేవి యన్న వస్త్రము పదినావలమీఁద వచ్చుచుండెను. కాని మిహిరకులుఁడు తనవెంట తెచ్చిన, నాఁడు తన భార్య ధరించిన రైకను భద్రముగానే తెచ్చుచుండెను. మిహిరకులుఁడు భద్రముగాఁ దెచ్చుచున్నది మూఁడువస్తువులు. ఒకటి యాముషదేవి, రెండు నాఁడు తన భార్య తాల్చిన రైక, మూఁడు సింహద్వీపాధిపతి శవము. ఆ శవము వక్షస్థలమునందు, బాహువులయందు, పాదములయందుఁ జీల్చి యది చెడిపోకుండఁ గొన్ని తైలములు వోయించి కుట్టించి దాని నొక మందసమునందు బెట్టి భద్రముగాఁ దనవెంటఁ దెచ్చుచుండెను.

సింహళద్వీపమును వదలి మిహిరుఁడు దక్షిణాపథమును ప్రవేశించెను. చోళ లాట కర్ణాటదేశములమీఁదఁ బడెను. అతఁడు వచ్చుచున్న వార్తలు విని గ్రామములలోఁ బట్టణములలో నెక్కడిజనము లక్కడ పాఱిపోయిరి. ఆవులు, కుక్కలు, మేకలు, కోళ్ళు, పిడకలగుడిసెలు, గడ్డివాములు, లెద్దులుమాత్రము మిగిలిన పల్లెలలోనుండి సర్వవస్తువులు పరిస్త్రీర్ణములై నిర్జనములైన యంగళ్ళు గల పట్టణములలో నుండి వాని సైన్యములు ప్రయాణము చేయుచు గోళ్ళను, గొఱ్ఱెలను, మేకలను జంపికొని తినుచు సైన్యములో నున్న దుంబాలు వృషభములనుగూడ నచ్చటచ్చట సంహరించి యాహారించుచుండగా లాట చోళ కర్ణాటదేశములయందలి సర్వదుర్గములను దుర్గాధిపతులు పాఱిపోవగా నీ సైన్యము దుర్గద్వారములను భేదించి గృహములను దగులబెట్టి యథేచ్ఛముగా ధనమును దోచికొని మూఁడుదేశములను మూఁడుమహాశ్మశానములను జేసి పోయినంత మేర కొనప్రాణ ముండి సన్నగా నఱచు జీవులతోఁ దిండిలేక బక్కచిక్కి కమలలోమాత్రము ప్రాణములు మిగిలిన వృద్ధ శిశు స్త్రీలతో సగము తగులబడగా వాన కురియగా సగము తగులబడ్డ కాష్ఠమువలె నున్న యిండ్లతో రక్తముతో నిండి త్రాగుటకు వీలు లేని నీళ్ళు గల బావులతోఁ జెదరిపోయిన మడురుల మీఁది తమ కులాయములను వెదకికొను పారావతస్త్రీలతో మాంసఖండములను గఱచికొని మింటఁ బోవు రాబందులయు, గృధ్రములయు వాయసములయు ముఖముల నుండి నడుమనడుమ రాలిపడు మాంసఖండములు చాలక తక్షుచుఁ దాఱుచు భయపడుచు మనుజుల మాంసపుముక్కల నెత్తికొనిపోవు జంబుకముల నోళ్ళనుండి తోడేళ్ళు లాగుకొనగాఁ జెదరిపోయి ధాత్రియంతయు నిండిన మాంసఖండములతో మూఁడుదేశములను శివునిచేత దగ్ధమైన మూఁడుపురములవలెఁ గనిపించెను.

మిహిరకులుని సేనలు ప్రయాణము చేయుచున్న సర్వదేశములయందు భయమే విజృంభించెను. ఏ దేశమువందలి సేనలును వాని కెదురురాలేదు. భిన్నదేశాధిపతులు

వారి సైన్యముయొక్క మార్గమునందుఁ దమ దుర్గములు లేకుండఁ జేయవలసిన దని భగవంతుని బ్రార్థింపఁజొచ్చిరి. అతఁడు సర్వభారతదేశమునందలి తనకు సామంత రాజ్యములవలె భావించుచు యథేచ్ఛముగా సేనలను నడిపికొనుచు గాంధారరాజ్యమునకుఁ బోయెను. పుష్కలావతీనగరము చేరకమున్న తనయొద్ద కొలది సైన్యముంచికొని తక్కినసైన్యము నంతను నతఁడు కాశ్మీరమునకుఁ బంపివేసెను. ధానుష్కులతోఁ గలిసి పాతికవేలసైన్యము, సింహళద్వీపాధిపతిశవము, యాముషదేవీ వస్త్రము, నాఁడు తన భార్య తాల్చిన రైక వీనితో నతఁడు గాంధారరాజధానికి వచ్చెను. అతఁడు సింహళద్వీపమునందుఁగాని చోళ లాట కర్ణాట దేశములందుఁగాని లక్షమందిని బంధితులను జేసెను. వారందఱు సైనికులు కారు. స్త్రీలు, బాలురు, వృద్ధులుకూడ వారిలోఁ గలరు. వారందఱను గాశ్మీరమునకుఁ బంపెను. మిహిరకులుఁడు పుష్కలావతికిఁ జేరునప్పటికిఁ గల్యాణవతీదేవి మగశిశువును గని నాల్గునెలలయినది అతఁడు పుట్టిన నక్షత్రము మంచిది కాదనియు, శాంతినక్షత్ర మఱియు, శాంతి నాల్గవనెలలోఁ జేయరాదనియు నంతవఱకతఁడు కుమారుని జూడరాదనియుఁ జెప్పిరి. అతఁడు కల్యాణవతీదేవి నివసించు సౌధమునకు దూరముగా నున్న యింకొక సౌధమున విడిసెను. ఒకనాఁ డొంటరిగాఁ గల్యాణవతి భర్తను జూచుటకు వెళ్ళెను. అప్పుడతడు భార్యకు నామె రైకను, యాముషదేవివస్త్రమును జూపి నీకు రావణాసురుని జూపింతునా యని సింహళాధిపతి శవమును జూపించెను. చూపి యిట్లనెను. "అనాథుఁడు వీఁడే! తన పాదచిహ్నములు కుట్టించిన కూర్పాసములు పతివ్రతల యూలువు చెడగా భారతదేశస్త్రీలచేతఁ దొడిగించిన దురహంకారి వీఁడే! ఇందులోని యవమాన మూహింపలేని రాజులభార్యల వక్షస్థలములందు తన పాదచిహ్నములు నెరపిన చోరశేఖరుఁడు వీఁడే! ఈ శవము యొక్క చేయి చూడుము. వాని చేయి నలిగిపోయినది. నలిగి నల్లనైనది. నాచేతిలో వాని చెయి యట్లైనది. అంతటి దుర్బలుఁడు. అంతటి యసమర్థుఁడు. కాని యంతటి దురహంకారి. ఆనాఁడు నీవు తొడిగికొన్న రైక యిదిగో ఈ రైక వానిమీఁద వైచి వాని శవమును దహింతును" — అని కట్టెలు పేర్పించి రైకతో వాని శవమును దహించెను. వాఁడు పూర్తిగా భస్మ మగువఱకు మిహిరకులుఁడు కల్యాణవతిని బసిపిల్లవాని దగ్గఱకుఁ బోనీయలేదు. వాఁడు భస్మమయిన తరువాత నిట్లనెను. "ఓ కాశ్మీరమహారాజ్ఞీ! మిహిరకులుని దేవేరీ! శ్రీరామచంద్రుఁడు రావణుని వధించి సీతను విడిపించికొని వచ్చినట్లుగా తన యపకీర్తిని ప్రక్షాళితము చేసినట్లుగా నేను నాభార్యకు జరిగిన కళంకమును దుడిచివేసితిని. దుశ్శాసనుని నెత్తురుతో భీముఁడు ద్రౌపదీదేవి శిరోజములు ముడిచినట్లు నేను వీనిని సంహరించి వాని పాదములముద్ర లేని దివ్యమైన సింహళద్వీపమునందుమాత్రమే నేయుట నేర్చిన యాముషదేవివస్త్రమును పదినావలమీఁదఁ దెచ్చితిని; ఆఱేన్గులమీఁదఁ దెచ్చితిని. ఆ వస్త్రమును నీవు యథేచ్ఛముగా నుపయోగించికొనుము. నీ దాసీజనమందఱకు నిమ్ము. నీకు మఱియు గోరికగా నున్నచో భారతదేశమునందలి సర్వరాజుల భార్యలకుఁ బంపుము. ఆ వస్త్రమును దొడిగికొనుటలో నున్న యవమానమును నిరూపించి తెలుపుము. వాఁడే లేఁడు. వాని పాదచిహ్నము లెక్కడ?" అంతట రాణి తన పిల్లవాని యొద్దకుఁ బోయెను.

ఈ కథ యంతయు నీలాఁకుడును గాంధారదేశ సేనాపతులును గనులారా జూచిరి. తాను చేసిన మహాకార్య మెట్లున్న దని పూర్వము మిహిరకుఁ డెవ్వరి నడుగలేదు. అడిగినను సాహసించి యెవ్వరును జెప్పలేదు. నీలాంకుడు మిహిరకులునకుఁ బ్రియమైన బావమఱది. వీరి బావా బావమఱది తనములు వారు మున్ను రాజకార్యముల యొత్తిడులందే సర్వకాలములందుఁ గలసియుండుటచేత వాని సుకుమారములైన వెలార్చుటలు జరుగలేదు. ఎప్పుడో నీలాంకుని పట్టాభిషిక్తుని జేసెను; తాను వెడలిపోయెను.

నీలాంకుఁడు కాశ్మీరరాజధానియందు రెండునెల లుండెను. ఆ రెండునెలలు మిహిరకులుఁడు వ్రతి. వట్టివ్రతికాదు; మౌని. అత డేడునెలలు మౌన మవలంబించెను. ఆ యేడునెలలతనికిఁ గత్తిమీఁది సాముగా నుండెను. ఏహింసయుఁ జేయరాదు తన యిష్టదేవతల జపమును జేయరాదు. అతనికి జీవితములో రెండే పరమ ప్రియము లైనవి. మొదటిదియమబేతాళులభీకరముఖదర్శనము. రెండవది హింసింపబడుచున్న జంతువుల వికారరావములు. వీనితరువాతఁ బ్రియమైనది కల్యాణవతి ఆమెది మూడవ స్థానము. కల్యాణవతి యన్నచో నతనికిఁ బ్రేమ కలదు. మఱియు భయము కలదు. తాను రెండుగడియలు ప్రయత్నించి యామె శిరస్త్రాణమును దాకలేక పోయెను. ఆమె యొక్క యా ఖడ్గవిద్యానైపుణ్యమున నతఁడు భయపడెను. ఆమె నిష్కంటకుని వంటిది కాదు. 'ఓయీ! నీ ఖడ్గమును దూరముగా వేయు' మనఁగా నతఁడు దూరముగాఁ బాఱవేసెను. బంధించుటకు నీ చేతులు వెనుకఁబెట్టికొను మనగా వెనుకఁ బెట్టికొనెను. ఈమె చేయదు. చేయనిచోఁ దానామె నేమియుఁ జేయలేఁడు. ఇంకొక విషయ మున్నది. ఇపు డామెకుఁ గొడుకు కలిగెను. అతఁడు యువరాజు. ప్రజలను మంత్రులును వానిని రాజును జేసి వానికి వయస్సు వచ్చువఱకు రాణిని రాజ్యపాలనా

వ్యవహారములు చూచుటకు నియమించి తన్ను సంహరించినచో నేమగును? ఆమె రాజనీతివిశారద. రాజ్యపాలనాదక్షురాలు. యుద్ధవిద్యావిశారద. ఈ భయ మతని కెడఁదలో నూహామాత్రమైన మనోవృత్తిగా నుండెను. ఇది యేమియు జరగదన్న నమ్మకము కొండంత యుండెను. తన్నెవ్వఁడును సంహరింపలేఁడు. తాను మనుష్యుఁడు కాడు. దక్షిణదిశాధిపతి యైన యముఁడును, సర్వభూతప్రేతములకు రాజైన బేతాళుఁడును దన్ను సర్వాదా రక్షించుచుందురు. తానింకను జాలసంవత్సరములు బ్రదుకవలయును. ఇంక నలువదియేండ్లయిన బ్రదుకవలయును. తన రాజ్యకాలము డెబ్బదేండ్లుగా నిర్ణయింపఁబడెను. ఇంతవఱకుఁ దన రాజ్యకాలము ముప్పదేఁడ్లు నిండలేదు. తానింకను నలువదేండ్లు యథేచ్ఛముగా సంహారము చేయవచ్చును. తాను పెద్దకసాయి.

తన హృదయములో వేయిపొరల లోపల మెత్తదనమొకటి యున్నది. దానిని గళ్యాణవతి గనుగొనెను. ఆమె దన గుండెలోపలి యీ మెత్తదనమును వెలికిదీసిన తరువాత నా మెత్తదనము వాగ్రూపమునఁగూడ వచ్చుచుండెను. ఇన్నాళ్ళు తన్మార్దవమునకుఁ గల్యాణవతి యొక్కతయే విహారభూమిగా నుండెను. ఇంకొకరిమీఁద నట్టి చమత్కారపుమాటలు ప్రయోగించుటకుఁగాని, యింకొకరియందీ మార్దవమును బ్రదర్శించుటకుఁగాని వీలు లేకుండెను. నిద్రపోవునపుడుకూడ తన వదనమండలము మృత్యుకరాళమైయుండునని జనులు చెప్పుదురు. నిదురపోవునపుడు మన మెగమును మన మేల చూచికొనలేము? నిదురపోవువేళ మన మొగమును మనము చూచికొనుటకు మేల్కొన్నవేళ మన మొగమును మనము చూచుకొనుచున్నామా? అద్దములోఁ జూచికొనుచున్నాము. మేల్కొన్నప్పుడు కన్నులు తెఱచియుంతుముకనుక నద్దములోఁ జూచికొనగలుగుచున్నాము. నిద్రపోవునపుడు కనులు మూసికొనియుందుము. అద్దమువలనఁ బ్రయోజనములేదు. మన మొగము మన మెట్లు చూచికొనఁగలము. మన మొగము వంటి మొగమింకొకని కున్నచో వానిని జూచి వాఁడు సరిగా మనవలె నున్నాఁడని యనుకొందుము. మన మొగము మనకెట్లు తెలియును. అద్దములోఁ జూచికొనిన ప్రతిబింబముయొక్క స్మృతియా? లేదా మన మొగము మనకుఁ దెలియునా? మనము చూచికోని మొగము మనకుఁ జూచినట్లుండునా? మనము చూచికోని మన మొగము పరుల మొగమును జూచినంత విస్పష్టముగా జూచికొన్నట్లుండుటకు లోననేదో యొక ప్రత్యభిజ్ఞాన ముండవలయును. ఆ ప్రత్యభిజ్ఞానము నిదురపోవునప్పుడుకూడ నుండవచ్చును. ఉన్నచో నది నిదుర కాదేమో! ఈ యొకదానికొకటి పొసఁగని వింతవిషయముల సమాహారమైన యీ జన్మమే యాశ్చర్యముగా నున్నది; మఱియును మనుజులకు రెండుమెగము లుండవచ్చును. ఒకటి శారీరకమైనది. రెండవది వాని జీవలక్షణమును భాసింపఁజేయునది. నేను నిద్రపోవుచుండగాఁ గల్యాణవతి నా మొగమును బలుసార్లు చూచియుండవలయును. ఆమె నడుగవలయును.

ఇది యిట్లుండగా నితఁడు తన మృదువైన హృదయవృత్తి వాగ్రూపమును దన భార్యయందు గాక మఱి యొకరియందు వెలయింపవలయును. నీలాంకుని దన మామగారి రాజ్యముకు రాజును జేసినదిందుకేయేమో. భార్యయొక్క తమ్ముఁడు భార్యవలెనే కనిపించును. ఒక్కటే భేదము. అది లైగింకము. ఈ నీలాంకునియందు మిహిరకులునకుఁ దొలుతటినుండియు ప్రేమయే. ఆ ప్రేమ పాతికయేండ్లనుండి యున్నది. పూర్వ మెప్పుడో మిహిరకులుని బాధలు పడలేని గాంధారరాజ్యరాజాధికారులు నీలాంకుని, నీలాంబరుని మిహిరకులుఁడు తమ్ము దయతోఁ జూచునట్లు చేయుఁడని ప్రార్థించినపుడు నీలాంకుఁడు మిహిరకులుని గూర్చి 'యతఁడు బకాసురుఁడు. దినదినము వానికిఁ బుట్టెడు బియ్యమన్నమును, రెండుదున్నలు, నొక మనుష్యుఁడును గావలయు' నని చెప్పెను. ఆమాటలు మిహిరకులునకుఁ దెలిసెను. అప్పుడే తెలిసెను. కాని నీలాంకు నేమియుఁ జేయలేదు. చేయలేదు సరిగదా వానికి రాజ్య మిచ్చి వానిని బావమఱదినిగాఁ జేసికొనెను. ఆ పాతికయేండ్ల క్రిందనే మిహిరకులుఁడు కల్యాణవతియందుఁ దన మనస్సెట్లున్నదో యించుమించుగా నీలాంకునియం దట్లున్నదని తెలిసికొనెను. ఇప్పటికి దానికి వికాసము కలిగెను. సింహళాధిపతిని హేమలతావిరచితతధిపతిచరణరమణీయమైన యాముష దేవితో దహనము చేసి కల్యాణవతి వెడలిపోయినతరువాత సర్వజనులు నిష్క్రమించినతరువాత నీలాంకు నడిగెను. 'నేను చేసిన పని యెట్లున్నది?' – అహో వైచిత్ర్యము. శ్రీరామచంద్రుఁ డొంటివింటిమీఁద రావణాసురుని మూలసైన్యమును గొన్నిలక్షలమంది నొకపూటలో నిర్జించి సమీపస్థులైన జాంబవదంగదాదులతో నిట్లనెనఁట! 'ఈ పని నేను జేయవలయును. లేనిచోఁ బినాకహస్తుఁడైన ధూర్జటి చేయవలయును. అంతటి ప్రభువుకూడఁ దన్నుఁ దాఁ బొగడికొనకుండ నుండలేకపోయెను. అట్లే సర్వజనులును దమ చేసిన పనిని దాము ప్రశంసించికొందురు. అంతకంటెఁ గూడఁ బరులు ప్రశంసించినచో నెక్కువ యానందపడెదరు. మిహిరకులునకుఁ దాను చేసిన పనులు మహాశ్చర్యకరము లని తాననుకొని తృప్తిపడుటయేగాని పరులచేత నట్టిప్రశంస పొందలేదు. నీలాంకుఁడు ప్రశంసించినచోఁ దన కధికానందము కలుగును. నీలాంకుఁ డిట్లనెను. "ఈ కార్యము చాలా దుర్ఘటమైనది. మహాయోద్ధలును గజబలులును సింహపరాక్రములును గోపము యొక్క పరిధిని నెఱపగలవారును నైన తమవంటివారుతప్పఁ దక్కినవారు చేయలేరు. తమరే యనినట్లిది యొక్క రామ

చంద్రుఁడు చేయవలసిన పని. ఒక భీముఁడు చేయవలసిన పని. అన్నిటికన్న నాశ్చర్యము వాని శరీరమును దైలాదులచేత సంస్కరించి యిక్కడికిఁ దెచ్చుట. ఇందులో నొక వైలక్షణ్యము కలదు. పగ సాధించుటలోఁ బరలోకములందుగూడ సాధించుట యున్నది. లంకాద్వీపమునందలి జనులు శైవులు. వారి మృతకళేబరములను ఖననము చేసి పూడ్చిపెట్టుదురు. వాని దేహములు భస్మసాత్కృతములు కావు. ఇది యొక శిక్ష. వాని విశ్వాసము వేఱు. వాని పరలోకగతి వేరు. పరలోకగతులు వారివారి విశ్వాసానుకూలముగా నుండును. కొంతవఱకంత్యక్రియలమీఁద నాధారపడి యుండును. వానిప్రేతము వానిశరీరమునంటివచ్చుచున్నది. త్రవ్విపూడ్చబడెడు మతములయందు విశ్వాసముకల జీవులు వారి శరీరములు దగ్ధములైనచో నా ప్రేతము లేమగునో తెలియదు. అవి సృష్టమైయనిరూపితమైన పరలోకములయందు సంచరించుచుండునేమో. మీ పగ యింతదూరము పోయినది" ఈ మాటలు విని మిహిరకులుఁడు సంతోషించెనో దుఃఖపడెనో తెలియదు. పరలోకములను గూర్చి భావించెనేమో తెలియదు. అనంతకర్మాధీనమైన యీ జీవులనుగూర్చి తలపోసెనేమో తెలియదు. కాని నీలాంశుఁడు చేసినది ప్రశంస కాదనుటకు వీలులేదు ప్రశంసయే. మిహిరకులునకొక తృప్తి కలుగలేదని చెప్పుటకు వీలులేదు.

ఆనాఁడు రాత్రి మిథ్యాప్రజ్ఞానదేవత, స్వప్నగురువు వానిముందఱ కూర్చుండెను.

మి. కు: నే నింతమందిని క్రూరముగా హింసించుచున్నాను. నా భవిష్యత్తేమగునో!

మిథ్యా: వారి భవిష్యత్తేమగును?

మి. కు: భవిష్యత్తెంతకలదు?

మిథ్యా: భూత మెంతకలదు?

మి. కు: నీవు గురువవు. ప్రశ్నలకు సమాధానము నీయవలయును గాని యిట్లా?

మిథ్యా: ప్రశ్నలయందే సమాధానములుండును.

మి. కు: నా భవిష్యత్తు నాకుఁ దెలియవలయును.

మిథ్యా: ఓయీ! ఈ యుగమున నీ విప్పుడే మొదలుపెట్టితివి. నీ భవిష్యత్తు చాలకలదు. కలియుగము ప్రారంభించిన తరువాత నీవంటివాఁడు సృష్టింపఁబడలేదు. నీవే మొదటివాడవు. నిన్నే వర్తమానజనులు హూణుఁ డనుకొనుచున్నారు. భవిష్యజ్జను లింకెట్లను కొందురో. నీ యీ క్రూరకార్యములను బట్టి సుక్షత్త్రియుఁ డైన నిన్ను హూణుఁ డనుకొన్నచో హూణుల దుష్కార్యము లెట్లుండునో యాలోచించికొనుము. ఇప్పటికిఁ గలియుగము ప్రారంభించి రెండువేల మూడువందల సంవత్సరము లైనది. ఇంకఁ బదునేను పదునాఱు వందలయేండ్లు గడువనిమ్ము నీవంటివారు వందలు జన్మింతురు. వారు మ్లేచ్ఛులలోననే జన్మింతురు. భవిష్యత్తున మ్లేచ్ఛులను సృష్టించుటకు బ్రహ్మదేవుఁడు నిన్న భ్యాసపీఠిగా సృష్టించెను.

మి. కు: నన్ను భవిష్యత్ప్రజలు మ్లేచ్ఛుఁ డనుకొందురా?

మిథ్యా: ఒక్క మ్లేచ్ఛుఁడే యను కొనరు, నీ వింక వేయియేండ్లైనతరువాతఁ బుట్టితి వని చెప్పికొందురు.

మి. కు: భవిష్యత్ప్రజ లంత మూర్ఖులా?

మిథ్యా: మూర్ఖత్వమున కవధి యేమున్నది? అది యిట్లుండు నని చెప్పుటకు వీలులేదు. అది యెంత గొప్పదనఁగాఁ దన్నుఁ దానే మోసము చేసికొనును. తాను తన్ను మోసము చేసికొనుచుఁ దాను జేసికొనుచున్నానని యితరులకు దెలియుచున్న దని తెలిసినతరువాతఁ గూడ నా మోసము మోసము కానట్లు నటించును. ఇంతకంటె మూర్ఖతకు వేఱొకయుదాహరణము కావలయునా? ఈ మూఢత్వము విజ్ఞులైనవారియందుండును. వారు పండితులు. భావనాశీలురు. కాని వారి మనస్సులు జగద్ద్రోహమును ధర్మద్రోహమునే భావించుచుండును. పాండిత్యము పాండిత్యమునే కలిగించును. ప్రజ్ఞానమును గలిగింపదు. వీరుకాక యజ్ఞు లుందురు. సృష్టిలో మానవులలో నూటికిఁ దొంబదిమంది యజ్ఞులు. పదిమంది విజ్ఞులు. అట్టి వందమంది విజ్ఞులలోఁ దొంబదిమంది మిథ్యాప్రజ్ఞానవారులు. నేను వారి యధిదేవతను. నీవు వారిలో నగ్రగణ్యుఁడవు. క్షత్రియుఁడవు. ఉపాసనాపరుఁడవు. ఏకపత్నీవ్రతుఁడవు. పరమ క్రూరుఁడవు. క్రూరముగా హింసింపఁబడి ప్రాణనిష్క్రమణవేళ జంతువు చేసెడి మహాభీకరధ్వని నీ కిష్టమైనట్లు మఱియొకటి కాదు. అయినను నీవు వేదమార్గావలంబివి. దేవతారాధకుఁడవు. అందుచేత నేను నీకుఁ గనబడుచున్నాను. నీకు గురువ నగుచున్నాను. ఉపాసనానిరహితులు, నపేతదేవతాబుద్ధులు, నగు వారికి మేము దేవతామూర్తులము కనిపింపము. వారు దేవతలే లేరందురు. వారు మేము లేకున్న నేమి? వారు మా శక్తిచేతనే సంచరింతురు. మే మేగుణములకు దృష్టిగోచరమైన తేజోభావమూర్తులమో యా గుణములన్నియు వారియం దుండును. తత్తదనుకూలకార్యములు వారు చేయుచుందురు. మాకుఁ దృప్తి కలుగుచుండును. మాకుఁ బుష్టి కలుగుచుండును. ఇంక భవిష్యత్తులో సర్వదేవతారాజ్యము హూదియే నీచేతఁ బునాది వేయించితిమి.

మి. కు: అది యట్లుంచి నేను హూణుఁడ నని భవిష్యత్తులో నెవరో చెప్పుదురనియు నే నింక వేయియేండ్లతరవాత జన్మించితి నన్నట్లుగా నెవరో

వాకొందరనియుఁ జెప్పితివే; వారిని నాకుఁ జూపింపుము. నాకు వారి గుండెలలోని నెత్తురు త్రాగవలయునని యనిపించుచున్నది.

మిథ్యా: ఓయీ! ఈ భావము లన్నియు గల్పితములు; శరీరము లంతకంటెఁ గల్పితములు. ఒక భావముగాని యొక దేహముగాని పరిణతకాలమున రూపము కట్టును; పరిణతకాలమునఁ బుష్టి నందును. నీ వీనాఁడు క్రొత్తగా జన్మింపలేదు. నీ బ్రదుకు యుగయుగమ్ముల నాటినుండి పరమ సూక్ష్మబీజరూపమున నున్నది. ఆ భవిష్యత్తున వచ్చెడివారిని నీవు చంపుదు ననుచున్నావు. అట్లైనచో శ్రీరామచంద్రుఁడు త్రేతాయుగాంతమునందు నిన్ను సంహరింపవలసి యుండెడిది. శ్రీ మహావిష్ణువు దశావతారముల నెత్తి యవికాక యనంతావతారముల నెత్తి యెవరిని జంపుచున్నాఁడు. ఆ భావము శరీరములు తాల్చిన జీవులయొక్క దేహములను వధించుచున్నాఁడు. భావమును జంపుట లేదే! మూఢరాక్షసులని యున్నారు. విష్ణుమూర్తి వారిజోలికిఁ బోఁడు. అతనికి దైత్యారి యని పేరు. ఏ దైత్యుల నతఁడు సంహరించును? మూల దైత్యులను గాదు. ఈ సృష్టియందలి జగత్తు ప్రయాణించుచుండగా ముదిరిన జీవులుందురు. వారు పరమదైత్యులు. వారిని సంహరించును.

మి. కు: నే నట్టివారిలో నొకఁడను గానా?

మిథ్యా: నీ లెక్క యేమి? రావణ హిరణ్యాక్ష కంసాదులముందు నీవు తృణము గూడఁ గావు.

మి. కు: నేనును దానవులను హింసించుచున్నానుగదా?

మిథ్యా: అందు కనియే పరమేశ్వరుఁ డూరుకొన్నాఁడు —

అనుచు మిథ్యా ప్రజ్ఞానదేవత యంతర్హితమయ్యెను.

తరువాతఁ బదిదినములకు మిహిరకులుని కుమారునకు శాంతియు బారసాలయు జరిగెను. ఆనాఁడు నీలాంకుఁడు తన నగరము నంతయు స్వర్గమువలె భాసింపఁజేసెను. పుష్కలావతీనగర మమరావతీనగర సబ్రహ్మచారిగఁ గనిపించెను. బారసాల జరుగు వింటిలో మరకతముల తోరణాలు కట్టిరి. ముత్యములు పిండి విసిరి ముగ్గులు పెట్టిరి. మయుఁడు ధర్మరాజునకుఁ గట్టిపెట్టిన సభ యువంతవిచిత్రముగా లేదనిపించెను. నీలాంకుఁడు తన సహోదరియైన కళ్యాణివతికిని బావగారైన మిహిరకులునకును గాంధారదేశమున నుత్తరభాగమున నున్న తన రాజ్యములోని మూడవవంతు కట్నము చదివించెను. అక్కగారికిని బావగారికిని బెట్టిన నూత్న వస్తువుల వెలతో రెండురాజ్యములు కొనవచ్చును. శాంతి జరిపినది. నూనెలో మిహిరుఁడు కుమారుని ముఖమును జూచెను. పిల్లవానికి నామకరణము చేయవలయును. పే రెవరు చెప్పుదు రెవరు చెప్పుదు రనఁగా మిహిరకులుఁడు నీలాంకుఁడు చెప్పవలయు ననెను. నీలాంకుఁడు నివ్వెఱపోయెను. మిహిరుఁ డిట్లనెను. "బావా! ఇరువదియేండ్ల క్రింద నీవు నన్ను బకుఁడంటివి. దానిని నీకు జ్ఞాపకము చేయుచున్నాను. నే నెట్లును బకుఁడను గాను. నా కొడుకైన బకుఁడైనచో నేను సంతోషింతును. నా కొడుకునకు మేనమామ పెట్టిన పేరు బకుఁడు." (సశేషం)

(8 వ పేజీ తరువాయి)

వించడం. నీకునీవు క్రమశిక్షణలో ఉంచుకోవడమేనా జీవిత పరమావధులు? కాదు. మన యీ లోకంలో భూతల స్వర్గం నిర్మించాల్సి ఉన్నది.

ఆకుపచ్చవర్ణం జీవితానికి అన్వయిస్తుంది ఇది వృక్షకోటివర్ణం. పురోభివృద్ధికి చిహ్నం. అదే మనం సూచించాము.

అందుకే, నేను మొదట వివరించినట్లు యీ పతాకం ప్రత్యేకంగా భారతీయులకు ఉద్దేశించినదికాదు. కాలచక్రం ఉన్నది. శాశ్వతత్వ మున్నది. క్రమశిక్షణ ఉంది. ఇక్కడ భూతలస్వర్గం నిర్మించడానికి నిర్మాణాత్మకమైన కృషి నీపరంగా ఉన్నది. న్యాయం, సౌభ్రాతృత్వం మార్గంగా మానవ సమాజాన్ని నెలకొల్పడానికే యిదంతా కావాలి.

నేటి మన స్థితిలో శాంతి, సమైక్యతలో నివసించాల్సిఉన్నది. అదే మన ధ్యేయం కావాలి కాల ప్రవాహంలో బంధింపబడితే మనం యివి సాధించలేము. దైవ సహాయంతోనే ప్రతిపని నెరవేరుతుంది' అని నిశ్చయం చేసుకుంటే మనం సాధించగలుగుతాము. ఇది అంతా యీ పతాకములో సూత్రీకరించబడింది. కాలం, శాశ్వతత్వం క్రమశిక్షణ, సృజనాత్మక జీవనం — యివి ఇందులో మీకు లభిస్తాయి. మానవకోటి కంతటికీ యీ పతాకం చెందుతుంది. దీన్నిగూర్చి ఆలోచించే ప్రతివ్యక్తి దీనిని అర్థం చేసుకోవచ్చు.

(కృష్ణాష్టమి)



కృష్ణావతార తత్త్వము

కె. కమల

శ్రీకృష్ణుని మనము రెండు విధముల భావింపవచ్చును. మహాభారత కథయందు శ్రీకృష్ణుని ఒక గొప్ప రాజకీయ తత్త్వవేత్తగా, ధర్మజ్ఞునిగా, తంత్రజ్ఞునిగా, భగవంతుడై విశ్వరూపమును చూపిన వానిగా, రాయబారములు నడిపిన చతురునిగా, ఆపన్నులను రక్షించిన వానిగా, భగవద్గీత నుపదేశించిన మహాపురుషునిగా భావింతుము. భగవంతుడే తన అవతారముయొక్క ప్రయోజనము నిట్లు గీతలో వివరించెను:-

"పరిత్రాణాయ సాధూనాం
వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామి యుగే యుగే."

దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, ధర్మసంస్థాపన మొనరించుటకై కృష్ణుడవతరించెను.

ఇక భాగవతము చదివినచో మన కేర్పడుచిత్రము ఇంతకంటె భిన్నముగా నుండును. భాగవతమునందు బాలకృష్ణునిగా, వెన్నదొంగగా, గోపీవస్త్రాపహారకునిగా, మన్ను తినువానిగా చిత్రించుకొందుము. రాధ గోపికలు శ్రీకృష్ణుని నాథునిగా సేవించుచు ముక్తి నొందిరట. పరమాత్మునిపై ఇట్టి మధురభావన ఏర్పడి, అతనిని నాథునిగా తలచి అతనికై పరితపించుచు, ఆతనిని పొందుటకు చేసిన యత్నము సఫలమైనచో, ధన్యులుగా భావించుట, మధుర భక్తి యనబడును. ఇట్టి మధురభక్తిని గోపికలు కలిగియుండిరి. తాపసు లిట్టి భావనను ఉత్తమోత్తమ మార్గముగా భావింతురు.

శ్రీకృష్ణ జన్మాష్టమి శ్రావణ బహుళములో వచ్చును. ఇట్టి పవిత్రావసరమున భాగవతములో వివరించిన కృష్ణలీలలను కొంత విచారింతము. భగవంతుడు లీలామానుష విగ్రహుడు. పెక్కులీలలచే నతడు విధివశమున తనకు బంధుజనముగా జన్మించిన గోప గోపికలను, జననీ జనకులను తనియింపగోరెను.

కృష్ణుని జన్మ కేర్పడిన పరిస్థితులే ప్రత్యేకముగా నున్నవి. రామావతారముతో కృష్ణావతారమును పోల్చినచో రాముడాదర్శమానవుడై, మానవుడే యను భ్రాంతిని కలిగించునట్లు తోచును. రామాయణమునందెచ్చటను రాముడు దేవుడుగా కనిపించడు. రామ జననము కర్కాటక లగ్నములో మిట్టమధ్యాహ్నమున పట్టపగలులో జరుగగా, శ్రీకృష్ణుడు, అర్ధరాత్రమునందు కారాగృహములో పుట్టి, పుట్టుకతోడనే శంఖ చక్రాదులతో తల్లికి దర్శన మిచ్చి తాను జన్మించిన ప్రయోజనము తెలుపును. కాని వెంటనే తాను భగవంతు డని తల్లిదండ్రులకు తెలియకుండునట్లుగా మాయను కప్పి వేయును. యోగమాయ శ్రీకృష్ణునితోడనే జన్మించినది. బలరాముడు రోహిణి కడుపునందు పుట్టుటకు గూడ ఈ యోగమాయయే కారణము. ఈ మాయతోనే కృష్ణుడు పలుమార్లు తన దివ్యత్వము చూపుచుకూడా వెంటనే తన తోడివారి నా విషయము విస్మరించునట్లు చేయును శ్రీకృష్ణుని లీలలు. మానవు లెట్లు మాయలోపడి తమ యెదుట నున్న పరమసత్యమును గ్రహింపలేక, మిథ్యాజగత్తు యొక్క అశాశ్వతత్వమును తెలిసికొనికూడా అందే మగ్నులైయున్న క్రమమును వివరించును. నందగోకులమునందు ప్రతిసారి కూడా యశోద కృష్ణుడు భగవంతుడని తెలిసికొనును. అయినను ఆ విషయమును మరచి, సామాన్య బాలకునివలె ఆతనిని

దండింప నెంచును. యశోద దండించి నప్పుడు, కృష్ణుడు, భక్తజన పరవశుడు కావున, సామాన్య బాలునివలెనే బెదరి నట్లు నటించును. భగవంతుని కొడుకుగా గారవించిన యశోద భాగ్య మెట్టిదో కదా! పూతన విషము పెట్టి శ్రీకృష్ణుని చంపనెంచినప్పుడు ఆతడు స్తన్యమును గ్రోలుచు పాలతో పూతన జీవితమును కూడ త్రాగివేసెనట. అప్పుడు పోతనామాత్యుడు భాగవతములో ఇట్లు చెప్పెను:-

"హరి తన మీదం బదములు
గరములు నిడి చన్ను గుడిచి కదిసినమాత్రన్
హరిజనని పగిది పరగతి
కరిగెను దురితములు వాసి యసురాంగన యున్

కేవలము శ్రీహరికరసంస్పర్శచే విపదిగ్ధమైన స్తన్యము నిచ్చిన పూతన, శ్రీకృష్ణునికి పాలిచ్చి పెంచిన తల్లివలె పరమ పదమును కైవల్యమును పొందెనట. భగవంతుడు కరుణామయుడు కదా! ఆతని భక్తులనే కాక, వైరులను గూడ ముక్తులను చేసెను. జయ విజయులు, హరి వైరులై యేగదా మూడు జన్మము లలోనే వైకుంఠమును తిరిగి చేరిరి.

భాగవత పురాణము అష్టాదశ పురాణములలోకెల్ల విశిష్టస్థానమును వహించి యుండుటకు కారణము అందు నవనీత చోరుని యీ లీలలు వర్ణితములై యుండుటయే. కావుననే భాగవతమునందంతటి లోనూ దశమస్కంధము రసవత్తరమైన దందురు. ఈ దశమస్కంధము దేవకీ వసుదేవుల వివాహముతో నారంభమయి, వారి కారాగృహప్రాప్తి, బలరామకృష్ణుల జననము, యోగమాయా జననమున్నూ ఇందు వర్ణింపబడును. కృష్ణుని వసుదేవుడు అర్ధరాత్రమున యమునానదిని దాటి నందగోకులమునందు యశోదవద్ద విడిచి యశోదకు పుట్టిన యోగమాయను దేవకి వద్దకు తీసుకొనివచ్చును. నందనందనుడు దిన దిన ప్రవర్ధమానుడై పూతనను, శకటాసురాది రాక్షసులను వధించును. బాలకృష్ణుడుగా తన చిలిపిపనులచే వ్రేపల్లె నంతటిని ఒక్క కొలికికి తీసికొనివచ్చును. అచ్చటి స్త్రీలందరును యశోదాదేవితో శ్రీకృష్ణుని చేష్టలనుగూర్చి మొరపెట్టుచు చివరకు,

ఓ యమ్మ నీ కుమారుడు
మాయిండ్లను పాలు పెరుగు మన నీ దమ్మా
పోయెద మెచ్చటికైనను
మా యన్నల సురభులాన మంజులవాణీ.

యని చెప్పుచు మేము వ్రేపల్లెను విడిచిపోయెదమని చెప్పిరి. అట్టి గోపికలే క్రమక్రమముగా కృష్ణప్రియలై యమునా తీరమందు రాత్రింబవళ్ళు ఆతనితో విహరించుచు అతని సాన్నిధ్యమున సర్వము మరచిపోయి ఆ నందనందనుడు నందగోకులము విడిచి మధురానగరమును చేరగా, ఆతనికై పరితపించి వియోగము నోపజాలరైరి. శ్రీకృష్ణుడు వారితో సలిపిన రాసక్రీడలు, జలక్రీడలు, వనభోజనములు, వస్త్రాపహరణములు, గోవర్ధన పర్వతము నెత్తి, కాళియ మర్దనము గావించి వారిని రక్షించిన క్రమము, కేవలము ఒక మధురస్వప్నమై వారి యెదుట నిలిచెను. అప్పుడు కృష్ణుడు దూతగా పంపిన ఉద్ధవుని యెదుట వారు అన్యాపదేశముగా ఒక భ్రమరమును నిందించు నెపముతో తమ బాధలను వెల్లడించిరి. ఉద్ధవుడు తానే మహాభక్తుడ నను గర్వము కలిగియుండెను. గోపికలకు కృష్ణునిపై గల భక్తి కాతడు విస్మితుడై:-

జప దాన వ్రత హోమ సంయమ తప
స్స్వాధ్యాయ ముఖ్యంబులన్
నిపుణుల్ గోరియు నే విభున్ మనములో
నిల్పంగ లేరట్టి స
ద్విపులాకారునిపై మహామహిముపై
విశ్వేశుపై మీ కజ
స్రపటుధ్యానము లిట్లు నిల్చునె భవ
చ్చారిత్రముల్ చిత్రముల్.

అని ఏ దేవదేవుని యుగయుగములుగా ధ్యానించు యోగులు వానిని పొందలేక, ఏకాగ్రచిత్తులు కాలేక, విఫల మనోరథులైరో, అట్టి ఈశునిపై మీకు ఇట్టి ధ్యానము కలిగియుండుట విచిత్రము కదా యని అనును. గోపికలు తమ వ్యక్తిత్వమునే మరచిపోయి కృష్ణ ధ్యానమునందు లీనులైరి కావున వారి ప్రేమను ప్రాపంచికతృష్ణగా భావింపరాదు. అట్టి స్థితినిపొందిన ఏ ప్రేమికులైనను ఎట్టి దుర్భరవిరహమునైనను సహించి ఫలసిద్ధికై వేచియుందురు. కావుననే రాధను జీవాత్మగాను, కృష్ణుని పరమాత్మగాను వర్ణించి, రాధ అనుభవించు పరితాపమును జీవుడు తనను తాను భగవంతునిగా తెలిసికొనుటకై చేయు ప్రయత్నముగా విజ్ఞులు భావింతురు. ఈ ప్రయత్నము సఫలమైనచో రాధయే కృష్ణుడు, కృష్ణుడే రాధ. తన ప్రతిబింబమును చూచి ఒక శిశువు, అది మరియొక శిశువుగా భావించి దానిని పొంద ప్రయత్నించును. ఆ ప్రతిబింబమే తాను అని తెలిసినప్పుడు మన కెట్టి తత్తరపాటును కలుగదు కదా.

శౌరి మన్ను తినె నని వాడలోని వారు వచ్చి చెప్పగా యశోదకు కృష్ణుని పై కోపము వచ్చును. కోపముచే ఆమె

ముఖ మెట్టనై సూర్యబింబమువలె ప్రకాశించును. ఆమెకు తన విశ్వరూపమును చూపవలెనను భావము భగవంతునకు ఎన్నటికిని లేదు. వాసుదేవుని ముఖకమలము యశోదాదేవి యొక్క ముఖమనెడు సూర్యబింబము యొక్క ఉదయముతో వికసించును. అనగా కృష్ణుడు తనకు తెలియకుండగనే భయముతో నోరు తెరచును అప్పుడు సమస్తలోకముల నాముఖమునందు చూచిన యశోద "ఇది కలయా, వైష్ణవ మాయయా, స్వప్నమా, నేను యశోదాదేవిని కానా" యని విస్మయమంది వితర్కించుకొనును. మరుక్షణమే ఆ భావమంతయు పోయి, కృష్ణుని తన కుమారునిగా భావించుకొనును.

శ్రీకృష్ణునిపై గోపికలకు గల ప్రేమకును, కుబ్జకు గల ప్రేమకును భేదము నీ క్రింది భాగవత పద్యము వివరించును:-

"ఏవేదంబులు గానని
దేవోత్తము గాంచి ముక్తి తెరవడుగక రా
జీవేక్షణ రతి యడిగెను
భావింప తదీయ కర్మఫలమెట్టిదియో.

కుబ్జ కోరినది శరీరభోగము, రతి కావున అది ముక్తిని కలిగింపజాలదు. శ్రీకృష్ణుని పరమప్రేమధామములో ఇందిరాదేవి ఊడిగము చేయుచుండును.

ఈ దశమస్కంధములో రుక్మిణీ కళ్యాణ ఘట్ట మతిరసవత్తరమైనది ముద్దరాలైన రుక్మిణికి భగవంతునిపై ఎట్టి భావన యుండెనో, తన కారణముగా రుక్మి పరాభవింపబడినప్పు డామె ఎట్లు క్లేశము నొందెనో చూచినచో ముగ్ధా నాయిక మన కన్నులయెదుట నిలుచును. శ్రీకృష్ణుని ఒక తులసీదళముతో తన వానిగా చేసికొనిన మహాభక్తురా లామె.

సత్యభామయొక్క పాత్రగూడా నీ భాగవతమునందు విశిష్టస్థానమును వహించుచున్నది. వీరనారియై, ఈమె నరకాసురునితో యుద్ధము చేయునప్పుడు పోతనమహాకవి ఇట్లు వర్ణించును.

"వీరశృంగార భయరౌద్ర విస్మయములు
గలిసి భామిని యయ్యెనో కాక యనగ
నిషువుదొడుగుట విడుచుట యేయుటెల్ల
నెఱుగ రాకుండనని సేసె నిందువదన."

యుద్ధము చేయుచున్న సత్యభామ యొక్క ముఖమునందు వీర, శృంగార, భయ రౌద్ర రసములు కలిసిన ఒక భావశబలత కన్పట్టుచుండెనట.

మహాకవి పోతనామాత్యుని యొక్క భాగవతము ఆంధ్రభాషలో అమరమై నిలిచెను భాగవతములోని పద్య మొక్కటియైనను కంఠస్థము చేయని ఆంధ్రు డుండడు. భగవంతుని లీలలే మధురములైనవి, ఇక పోతనవంటి భక్తుడు, వానిని గానము చేసినచో నవి రసవత్తరములు కావా? హిందీ భాషలో "సూరసాగరము'' అను పేరట శ్రీకృష్ణలీలను వర్ణించిన "సూర్‌దాసు" అను అంధ కవి "సూరసాగరము" నకమరత్వమును కలిగించెను ఈ గ్రంథములో కూడా మధుర భక్తియే వర్ణింపబడినది. ఈ సూర్‌దాసు గీతములు హిందీని మాటలాడు ప్రాంతములో ఆబాలగోపాలమునకు సుపరిచితములే. బెంగాలు దేశమునందు కూడా మధురభక్తి మధ్యయుగములో నభివృద్ధి చెందెను. చైతన్యగౌరాంగునివంటి యోగులు రాధామాధవ మతమును స్థాపించిరి. పదునొకండవ శతాబ్దిలో లక్ష్మణసేనుని ఆస్థానమునందున్న "జయదేవ" మహాకవి అష్టపదులలో రాధ యొక్క విరహమును అతిమధురముగా గానము చేసెను. ఈ అష్టపదులు, సాహిత్యములో, సంగీతములోను విశిష్టస్థానమును వహించి, దేవాలయములందు నర్తకీగణముల చే అభినయింపబడు చుండెను. ఇట్లే ఆంధ్రదేశమునందు బిల్వమంగళుడను పేరుగల లీలాశుకుడను మహాకవి "శ్రీకృష్ణ కర్ణామృతము"ను రచించెను. ఇందు రాసక్రీడాద్యభివర్ణనములు కలవు. గీతగోవిందము వలెనే శ్రీకృష్ణ కర్ణామృతము గూడ మిక్కిలి ప్రశస్తి నొందినది. నారాయణ తీర్థుల "కృష్ణలీలా తరంగిణి"యు నిట్టిదే. ఈ మూడు గ్రంథములున్ను సంస్కృత భాషలో కృష్ణలీలలను గానము చేయు ఖండకావ్యములుగా అత్యున్నతస్థానము నాక్రమించినవి.

భ్రమర గీతికలలో గోపికలు, శ్రీకృష్ణుని, ఒక పువ్వులోని తేనెద్రావి అచ్చటినుండి మరియొక పువ్వుపై వ్రాలు మధుపముగా వర్ణించిరి. తిరుగుచున్న భ్రమరమునకు, అంతకుపూర్వము మధువును సేవించిన పుష్పము జ్ఞాపకము రానట్లే కృష్ణుడు కూడ తమతో రమించి, ఇప్పుడు తమను మరచిపోయి అన్యాసక్తుడయ్యెనని వీరి భావము. ఈ భ్రమర గీతలతో ప్రభావితుడైన కాళిదాసుడు శాకుంతలములో హంసపదిక గానమును గూర్చెనని చెప్పవచ్చును.

ఇట్లు శ్రీకృష్ణలీలలు అనంతములు. వానిని మనము లౌకికపరముగా కాక మోక్షపరముగా నన్వయించుకొనవలెను.

పంచతంత్రము

(గత సంచిక తరువాయి)

అనేక రాష్ట్రములను తెలిసి ఉన్నవాడగుటచేత సంజీవకుడు కొన్ని రోజులలోనే మూర్ఖుడైన పింగళకుని బుద్ధిమంతునిగా తీర్చి అతని అవివేకత్వమును పోగొట్టి ఉత్తమ పౌరజ్ఞాన సంపన్నునిగా తయారు చేసెను. ప్రతిదినము ఆ యిరువురే రహస్యాలోచనము చేయుచుండిరి. ఇతరులు దూరముగా నుండిరి. వారి ఆలోచనలలో కరటకదమనకులకు కూడా ప్రవేశము లేకుండెను. మృగములన్నియు ఏమిచేయలేక పోయెను.

రాజానుగ్రహమునుండి దూరమైపోయిన కరటకదమనకులు ఈ క్రింది విధముగా ఆలోచించిరి.

దమ : కరటకా ; మన యిరువురి ప్రాముఖ్యము తగ్గిపోయెను. పింగళకుడు సంజీవకునియందే అనురక్తుడై తన పనులను అన్నిటిని విడిచిపెట్టెను. పరిజనులందరు విడిచిపోయిరి.

కరట : మన ప్రభువు ఒకవేళ నీమాట యిప్పుడు మన్నించక పోవచ్చును. అయినను అతనితప్పును దిద్దుకొనుటకు నీవు అతనికి ఇప్పుడు ఉపదేశించుట మంచిది. గడ్డి తినిబ్రతుకు ఈ ఎద్దును నీవు ప్రభుసన్నిధికి తెచ్చికొరవితో తల గోకుకొంటివి.

దమ : ఔను సత్యమే ! యీదోషము నాదే కాని ప్రభువుది కాదు.

ఇట్లే పూర్వము ఒక నక్క ఒక మేకతో పోరాడి నశించెను. మనము ఆషాఢభూతివలన నశించితిమి. ఒక దుంతి సాలెవానిచేత నశించెను. స్వయంకృతాపరాధమువలన ఈ మూడు దోషములు కలిగినవి.

కరట :— ఆకథ చెప్పుమని అడిగెను.

ఆషాఢభూతి కథ

ఒకానొక నిర్జన ప్రదేశమునందు ఒక మఠము ఉండెను. దానియందు దేవశర్మ అను సన్యాసి నివసించుచుండెను. అతనికి అనేకులు సజ్జనులు ఎన్నో విలువగల వస్త్రములను సమర్పించుచుండిరి. ఆ వస్త్రములను అమ్ముచుండుట వలన కొంత కాలమునకు అతనికి విశేష ధనము చేకూరెను. ఎవనియందుకూడ నమ్మకములేక అతడు ఆ ధనమును తన దగ్గరనే రహస్యముగ దాచుకొని రేయింబవళ్ళు కాపాడుచుండెను.

ఆషాఢభూతి అను పేరుగల దొంగ ఒకడు ఆ సన్యాసివద్ద ఆ ధనము ఉండుటను కనిపెట్టి దానిని అపహరించుటకు యోచించుచుండెను. ఆ మఠము దృఢమైన పాషాణములతో కట్టబడినది కనుక దానిని భేదించి అతడు ఆ ధనమును అపహరించ లేకుండెను. అందువలన ఏవో బూటకపు మాటలు చెప్పి ఆ సన్యాసిని నమ్మించి అతనికి శిష్యుడుగా ఉండి ఆ ధనమును అపహరించదలచెను. అట్లు తలచి సన్యాసి వద్దకు వెళ్ళి "ఓం నమఃశివాయ" అని చెప్పి సాష్టాంగముగా అతనికి నమస్కరించి ఇట్లు పలికెను.

ఆషాఢ : మహాత్మా ! యీ సంసారము అపారమైనది. యౌవనము సెలయేరువలె వేగముగలది. జీవితము గడ్డిమంటతో తుల్యముగ సరసరమండి ఆరిపోవును. సుఖములు శరత్కాలమేఘచ్ఛాయలవలె అస్థిరములు. మిత్రులు, పుత్రులు, కళత్రము, భృత్యులు, మొదలైనవారితో గల సంబంధము స్వప్నదృశ్యము అని నేను బాగుగా తెలిసికొన్నాను. కనుక ఈ అనంతమైన సంసారసముద్రమును దాటుటకు నేను ఏవిధానము అవలంబించవలెనో తెల్పుడు.

దేవశర్మ : (ఆదర పూర్వకముగా) వత్సా ! యువకుడవుగా నుండికూడ నీవు సంసారమునందు విరక్తుడవయినావు. ఎంత ధన్యుడవు ? సంసార సముద్రమును దాటుటకు ఉపాయము వినుము ఏజాతివాడైనను సరే, శరీరముపై విభూతి ధరించి శివమంత్ర దీక్షను గైకొన్నచో అతను శివుడే అగును.

ఆషాఢ : (పాదములకు నమస్కరించి వినయముతో) మహాత్మా నాకు ఆ దీక్షను ఇచ్చి నన్ను అనుగ్రహింపుడు.

దేవ : నాయనా ! నిన్ను అనుగ్రహించెదను కాని నీవుమాత్రము రాత్రివేళలలో ఈ మఠమునందు ప్రవేశించకూడదు. యతులు నిస్సంగముగా ఉండకోరెదరు కదా ! దీక్ష గైకొనుచున్నావు. కనుక ఇప్పటినుండి నీవును యతివగుచున్నావు. కనుక మనము ఇరువురము నిస్సంగముగా నుండుట మంచిది. నీవు శైవ మతమును గ్రహించిన తర్వాత ఈ మఠద్వారమునందు ఒక పూరిగుడిసెలో రాత్రివేళల నిద్రించు చుండవలెను.

ఆషాఢ : మహాత్మా! చిత్తము అలాగే చేసెదను. అట్లుండుట నాకుకూడ మంచిదేకదా.

ఇట్లు ఇరువురును ఒడంబడిక చేసుకొనిన పిదప అతనికి శివమంత్రమును అనుగ్రహించి అతనిని శిష్యుడుగా స్వీకరించెను. అతడును గురువుగారి కాళ్లు చేతులు పిసుకుట మొదలగు పరిచర్యలు చేయుచు గురువును సంతోషపరచెను. అయినప్పటికిని గురువుమాత్రము తన చంకలో నుండి ఆ ధనపు మూటను మాత్రము విడువకుండెను. ఇట్లు కొంత కాలము గడవగా ఆషాఢభూతి :— 'అయ్యో,

ఎంత కష్టపడినను ఈయనకు నాపై నమ్మకము కుదురకున్నది, పగలేయీయనను శస్త్రముతో చంపుదునా? లేక విషము పెట్టుదునా? లేక పశువును కొట్టినట్టు కొట్టుదునా?' అని చింతించెను.

ఇట్లు ఆషాఢభూతి చింతించుచుండగనే దేవశర్మ శిష్యుని కొడుకు ఒకడు గ్రామాంతరమునుండి దేవశర్మను పిలుచుటకు వచ్చి దేవశర్మతో "మహాత్మా! మాయింటిలో జరుగు ఉపనయనమునకు దయచేయవలయును." అని ఆహ్వానించెను. అది విని దేవశర్మ సంతోషించి ఆషాఢభూతితో పయనమయ్యెను పోవుచుండగా దారిలో ఒక నదిలో దేవశర్మ స్నానము చేయ దలచి తన చంకలోనుండి ధనపు మూటను దించి సంచిలో భద్రపరచి ఉంచెను. నదిలో స్నానము చేసి దేవతార్చనను ముగించుకొని ఆషాఢభూతితో — "ఓయీ! నేను బహిర్భూమికి (మలవిసర్జనము) పోయివచ్చు వరకు ఈ యోగేశ్వరుని సంచిని జాగ్రత్తగా కాపాడుము" అని చెప్పిపోయెను. ఆషాఢభూతి గురువు పోవగానే ఆ సంచిని తీసుకొని పారిపోయెను. దేవశర్మ శిష్యుడు తన యెడల చూపిన బూటకపు గౌరవము నిజమైనదేయని తలచి సంతోషించి ఉండెను గనుక శిష్యుని నమ్మియుండెను. అందుచేత బహిర్భూమికి కూర్చున్నవాడు, అక్కడ జరుగుచుండిన మేకలపోరాటమును చూచుచు అట్లే కూర్చొని యుండెను. మేకలు కోపముతో ఒండొంటిని కొట్టుకొనుచుండగా వాటితలపై నెత్తురు స్రవించుచుండెను. ఒక నక్క ఆపోరాటములో ప్రవేశించి ఆ నెత్తురును ఆస్వాదించుచుండెను. దేవశర్మ ఆదృశ్యమును చూచి "అయ్యో, యీనక్కకు తెలివిలేదుకదా! అది ఒకవేళ రెండుమేకల ఒత్తిడిలో చిక్కుకొనినచో మరణించును కదా" అని చింతించెను. అతడనుకున్నట్లే నెత్తురు లౌల్యముచేత నక్క మేకలమధ్యలో ప్రవేశించి ఆరెంటితలల దెబ్బలచేత క్రింద పడి చచ్చెను.



దేవశర్మ దానికి దుఃఖించుచు తన ధనము కొరకై తిరిగిరాగా అక్కడ ఆషాఢభూతి కనపడలేదు. అప్పుడు వెంటనే తనమూటను చూడగా అదియును లేదు. అప్పుడు "అయ్యో! మునిగిపోతిని" అని అరచుచు భూమిపై మూర్ఛపడిపోయెను. క్షణములో తేరుకొని "ఓ ఆషాఢభూతీ? నను మోసగించి యెక్కడ పోయితివి? ఉత్తరము చెప్పుము." అని అనేక విధముల దుఃఖించి అతని అడుగుజాడలను బట్టి వెదకుచు మెల్లగా పోయెను. సాయంకాలమునకు ఒకఊరు చేరెను. ఆ గ్రామము నుండి ఒకసాలెవాడు భార్యతో కలిసి మద్యపానము చేయుటకు సమీపనగరమునకు వెళ్ళుచుండెను. అతనిని చూచి దేవశర్మ "ఓయీ? నేను సూర్యాస్తమయకాలమందు నీ దగ్గరకు వచ్చిన అతిథిని. ఈ గ్రామమునందు ఎవరిని గూడ నేనెరుగను నన్ను అతిథిగా స్వీకరింపుము." అని వేడుకొనెను. సాలెవాడు ఆ మాట విని భార్యతో — ప్రియురాలా? నీవు ఈ అతిథిని తోడుకొని యింటికి పొమ్ము. ఇతనికి స్నాన భోజనాదులచేత సత్కారము చేయుము. నేను నీ కొరకు మద్యము చాలా తెచ్చెదను" అని చెప్పి పోయెను.

ఆమె కులట కాబట్టి ఆవచ్చిన పరపురుషునితో కలిసి సంతోషముగా స్వగృహమునకు పోయెను.

(సశేషము)

పృథు చక్రవర్తి

యమ్. సంగమేశ్వర్

ధ్రువుని పేరు తెలియనివాడంటూ ఉండడం మన భారతీయులలో అసంభవం. సవతితల్లి తీక్ష్ణాధిక్షేపణకు కడుంగడు వేదనాభరితుడై నారదమహర్షి అమోఘాశీర్వాదమును పొంది కాళింది నది తీరప్రాంతములో కఠోర నియమాగరిష్టుడై అనన్యభక్తితో ఏకపాదాస్థితుడై ఘోరతప మాచరించి ఆ పరంధామునిచే వరముల బొంది సప్తర్షి మండలముపైనున్న పరమపదాన్ని యధిష్ఠించి ముల్లోకాల్లో కీర్తిమంతుడైనాడు బాలధ్రువుడు.

పృథుచక్రవర్తి ఆ వంశానికి చెందినవాడు. మంచిలో చెడు, చెడులో మంచి యుండడము సహజము. లోకకంటకుడైన హిరణ్యకశ్యపుని సుపుత్రుడైన సీతారాముల పాదాల దాసుడయ్యాడు. కురువంశములో దుర్యోధనాది దుర్మార్గులుద్భవించారు అదేవిధంగా ధ్రువుని వంశములో పృథువుని జనకుడైన వేను డొక అధర్మగామియయ్యాడు. యజ్ఞయాగాది క్రతువులను జరుపరాదని శాసించాడు. సర్వసంపన్నుడైన పరాత్పరుని కొల్వక తననే పూజించవలయునని నిర్బంధించాడు. తత్కారణంగా ధర్మవాంఛితులైన సర్వబల సంపన్నులగు మహర్షులు తమ తపోమహిమచే వేనుని వధించి ఆయన కుమారుడగు పృథువును మహారాజుగా అభిషేకించి రాజనీతిని బోధించారు.

పృథువు భగవదంశ సంభూతుడని ప్రతీతి. అతని దక్షిణ హస్తంలో చక్ర రేఖయున్నపాదాలలో అరవిందలాంఛనాలు యున్నవి. ఆయన అర్చిస్సు అనే సుందరాంగనను వివాహమాడాడు.

పట్టాభిషేకోత్సవ సమయంలో కుసుమవర్షం కురిపించి ముప్పదిమూడుకోట్ల దేవతలు ఆ సుందర దృశ్యాన్ని తిలకించి శుభాశీస్సులు పలికారు. అట్టి సమయంలో సూత మాగధ వంది జనులు సల్పిన పొగడ్తలకు ఖిన్నమనస్కుడై అఖిలబ్రహ్మాండ వ్యాపకుడైన అనామకుడయిన యా సర్వేశ్వరుణ్ణి కొలువడము మానవ కర్తవ్యము. నావంటి మానవుణ్ణి కీర్తించడము అసహజము వ్యర్థము అని యన్న రాజుమాటలకు, యాతని నిరాడంబరతకు బహు సంతుష్ట హృదయులైన మహర్షులాశీర్వదించి తపోవనాల కెళ్ళిపోయారు.

ఆ విధంగా సర్వజనరంజకంగా పాలన చేస్తున్న సమయంలో ఒకసారి క్షామం సంభవించింది. అన్న పానాదులకు ప్రజలు అష్టకష్టాలననుభవింపవలసి వచ్చింది. క్షామపరిస్థితికి భూదేవిపైకినుకపూని రాజు ఆమెను శిక్షించడానికై బాణాన్ని సంధించాడు. ఆ సమయంలో భూదేవి చక్రవర్తికి గోరూపంలో దర్శనమిచ్చి ఆయనతో ఇలా అంది. "రాజా సకల జీవరాసులకు జీవనాధారమైన నన్ను శిక్షించటము అనుచితము. ప్రతిప్రాణికి భుక్తి ప్రసాదించడానికి నాలో శక్తిఉంది. అలాంటి శక్తిని నేను దాచుకోవడం లేదు. మహాత్ములు సర్వప్రాణిశ్రేయస్సు కోరి వారికి ఇహ పరసౌఖ్యాలు కలిగేవిధంగా వివిధయోగాలను కనిపెట్టారు. అలాంటి మహర్షులఅడుగుజాడలలోమార్గంలోనే పయనించడం మానవ ప్రప్రథమ విధ్యుక్తధర్మం జ్ఞానహీనులైన పురుషులు యుక్తాయుక్త జ్ఞానరహితులై అధర్మపథంలో పయనించడంవల్ల తమ గమ్యస్థానాన్ని చేరుకోలేరు. ప్రజారంజకంగా ధర్మపాలన చేసే ప్రభువుల కర్తవ్యం ప్రజలను సుశిక్షితులు చేయడం. అలా నీవు కర్తవ్యపారీణ ధురంధరుడవైనచో నాకున్నూ నీ లోకానికిన్నీ మేలుకలుగుతుంది''.

భూమాత పలుకులు విన్న పృథుకువు పరమసంతోషం కలిగింది. భూదేవిని పృథుచక్రవర్తి తన పుత్రికగా స్వీకరించాడు. నాటినుండి ఆమెకు పృథివి అని సార్థకనామ మయింది. ప్రజలు సుఖులయ్యారు. తమ ఇష్టాభిమతాలను తీర్చుకున్నారు.

తర్వాత మహారాజు అనేకాశ్వమేధ యజ్ఞాలు నిర్వహించి శతక్రతు డనే ప్రసిద్ధి పొందాలని ఆశించాడు. ఆయన కోరికను తెలిసిన ఇంద్రుడు అసూయాపరుడై తన ఇంద్రపదవికి భంగం కలుగుతుందని ఎలాగైనా ఆ నూరవ యజ్ఞ భంగం చేసే సంకల్పంతో అదృశ్యరూపుడై మేధాశ్వాన్ని అపహరించాడు. ఈ విషయం గ్రహించిన అత్రిముని పృథుకుమారుడగు నముచికి మేధాశ్వాన్ని వశం చేసుకోవలసిందిగా ఆదేశించగా నముచి అస్త్రశస్త్రాలతో మహేంద్రుని పైకి వెళ్లాడు. ఇంద్రుడు భీతహృదయుడయ్యాడు. మాయవలన మారువేషాన్ని ధరించాడు. అతణ్ణి ఉపేక్షాభావంతో వదలి తన మేధాశ్వాన్ని తీసుకొని వెళుతాడు. దానితో సురనాథుడు ద్విగుణీకృత ఆక్రోశంతో ఎలాగైనా యజ్ఞభంగం చేయ సంకల్పించి యజ్ఞశాలను కటిక చీకటిగా మార్చి తిరిగి అశ్వాపహరణ చేశాడు. అత్రిమహర్షి వెంటనే ఈ విషయాన్ని నముచికి తెలియపరిచాడు. విజితాశ్వుడని బిరుదాంకితుడైన నముచి సశస్త్రుడై మహేంద్రుని వధించడానికి వెళ్ళాడు. ఇంద్రుడు జడిసిపోయి తురంగాన్ని వదలివెళ్ళిపోయాడు. కాని పృథువు అతణ్ణి ఒక కుత్సిత తుచ్ఛునిగా భావించి ఆయనను నిర్జించడానికై కృతనిశ్చయుడయ్యాడు. అది గ్రహించిన మహర్షులు అతణ్ణి వారిం

చారు. యజ్ఞాన్ని జరిపే దీక్షముందు మేధ్య పశువధ మినహా ఎలాంటి జీవ హింస చేసినా పాపహేతు వని. శక్తి వంతమైన మంత్రబలముచే ఆహుతులు స్వీకరించే నిమిత్తం వచ్చే ఇంద్రుణ్ణి శిక్షిస్తా మని ఊరడించారు.

ఈ విషయాన్ని గ్రహించిన బ్రహ్మ దేవుడు వారికి ప్రత్యక్షమై మహారాజు నుద్దేశించి "రాజా ఇంతవరకు నీవు తొంబది తొమ్మిది యజ్ఞాలు నిర్వహించి నూరవ క్రతువు పరిసమాప్తి చేసి శతక్రతుడవు కాదలచావు. కాని అది సురనాథునకు అయిష్టంగా నున్నది. ఈ క్రతువుల వల్లనే మీ ఇద్దరకున్నూ మనస్పర్థలు కలిగాయి. మోక్షగామివైన నీవు భగవత్ప్రీత్యర్థం సల్పే ఈయజ్ఞాన్ని చాలించినప్పటికిన్నీ నీకు ఏలాంటి లోపమేర్పడదు. అదీగాక మీ రిర్వురును భగవదంశ సంభూతులు. మీలో మీకు వైరమేర్పడటము నింద్యమైనది. కావున మీరు లోక కల్యాణార్థమై అన్యోన్యానురాగాలు పెంచుకోవటం ముదావహం" అని నీతి గరిపాడు. తర్వాత పృథువు మహేంద్రునితో మైత్రి కోరాడు. ఇంద్రునితోసహా అక్కడకు వేంచేసిన ఆదిదేవుడాది వేల్పులాయన త్యాగనిరతికి, విశాలమనోప్రవృత్తికి సంతుష్టులయ్యారు. పిదప పృథువునకు క్షీరసాగరుడు హితబోధగావించాడు.

ఆ విధంగా జనరంజకంగా పాలన చేసే సమయంలో ఒకతూరి సకలమహర్షుల సమావేశం జరిగింది. ఆ మహోత్సవానికి చక్రవర్తికూడ ఆహ్వానింపబడ్డాడు. అక్కడ ఆయనకు సిద్ధపురుషులైన సనకసనందాదులు దర్శనమిచ్చారు.

దాని వలన ఆయనకు అనన్యమైన భక్తి కలిగి వైరాగ్యాన్ని పొందాడు. పిదప సంసారాన్ని త్యజించి తన సహచరిణితోసహా తపోవనాలకు వెళ్ళి అచ్చట ఉగ్రతపమాచరించిపరమపదంపొందాడు.

(8 వ పేజీ తరువాయి)

వారు. వ్యూహరచనలో దక్షుడు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు గారు. వ్యూహాన్ని రక్షించుకుంటూ ఎదుటి వ్యూహాన్ని చిందరవందర చేయుటలో ప్రజ్ఞావేత్త శ్రీ సంజీవరెడ్డిగారు. ఇరువురి భారాలలోను, బాధ్యతలలోను భాగము పంచుకుంటూ యిద్దరికీ సలహా, సంప్రదింపులు యిచ్చే పాత్ర శ్రీ బ్రహ్మానందరెడ్డిగారిది. ఆయా సందర్భాలలో వారిద్దరూ యింజనులుగా వ్యవహరిస్తే యీయన బ్రేకుగా వ్యవహరించేవాడు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండీ, నేటివరకు వివిధ పోర్టుఫోలియోలను నిర్వహిస్తూ, అన్నిటా యోగ్యుడు, సమర్థుడూ అనిపించుకుంటూన్న మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవరెడ్డిగారున్న రెండు సందర్భములలోనూ, ఆయన అఖిలభారత సంఘ అధ్యక్షుడుగా వున్నప్పుడునూ ఆయనకు ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలలో ముఖ్యసలహాదారు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు.

1962 శాసనసభ ఎన్నికలకు కాంగ్రెసు అభ్యర్థుల నిర్ణయించు నాయకత్రయం శ్రీ పల్లంరాజు, శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు గార్లతో శ్రీ బ్రహ్మానందరెడ్డి సభ్యులై గురుతర బాధ్యతలను నిర్వహించారు. ఈనాటి శాసనసభల బలా బలాలకు ప్రాతిపదిక ఆనాటి సెలక్షన్సున్నూ, తరువాత జరిగిన యెన్నికలున్నూ అయివున్నవి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నాటినుండి అన్ని మంత్రివర్గాల్లోనూ ఉంటూన్న ఏకైక మంత్రి వీరు. అనేక మంత్రిత్వశాఖలను వీరు నిర్వహించారు. అన్నిటా తృప్తికరంగా, సమర్థతతో ప్రజారంజకత్వంగా పాలించారు. వారికి అభిమానశాఖ ఆర్థికశాఖ. అందుచే ఆర్థికశాఖామాత్యులుగానే హెచ్చుకాలం వ్యవహరించటం జరిగింది. రాష్ట్రాలలోని ఆర్థికశాఖామాత్యులందరిలోను సమర్థులని పేరు ప్రతిష్ఠలు గడించుకున్నారు. దక్షతతో రాష్ట్రాదాయాన్ని దాదాపు మూడురెట్లకు పెంచి అనేక ప్రజోపయోగ కార్యనిర్వహణకు కారకులయ్యారు.

ఆర్థికమంత్రిగా అన్ని శాఖలతో సంబంధం వుండటం సహజం. అన్ని శాఖల పరిపాలనానుభవం నేడు ముఖ్యమంత్రిత్వ పాలనకు వుపయోగపడుతోంది. అఖిలభారత కార్యసంఘసమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్ళుతున్న సందర్భలోనూ, తరచు జరుగుతున్న ముఖ్యమంత్రుల సమావేశాల్లోను వీరు ప్రముఖంగా చర్చల్లో పాల్గొంటూ, ఆంధ్రప్రతిష్ఠను ఇనుమడింప జేస్తూన్నందులకు మనం గర్వపడుచున్నాం. ఈయన పరిపాలనాదక్షుడుగా అఖిలభారత నాయకుల మన్ననల పొందుతున్నారు. చక్కని సమయస్ఫూర్తి, వాదనా పటిమతో వ్యతిరేకపక్షంవారి సానుభూతిని సహితం పొందడం ఆనందదాయకము.

వీరి ప్రాపుకు వీరిజీవితంలో ముఖ్యకారకులు ముగ్గురు : 1. వీరి పెద్దఅన్న కీ. శే. వెంకటరెడ్డిగారు. 2. కీ. శే. ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశం పంతులుగారు. 3. వీరికి సన్నిహిత మిత్రుడైన శ్రీ సంజీవరెడ్డిగారు.


వారిని గురించి వారి మాటల్లోనే ఇట్లా చెప్పాలి. "ఎవరినీ నొప్పించరాదనే నా అభిమతం. ఎదుటివారి భావాన్ని, దృక్పథాన్ని అర్థం చేసుకోవాలనే నా తాపత్రయం. సమస్యా పరిష్కారంలో రాజీమార్గంగా పోవాలనేది నా విశ్వాసం. రాజకీయ భేదాలున్నప్పటికి వ్యక్తిగతస్నేహసంబంధాలు వమ్ముకారాదని నా అభిప్రాయం. మితభాషణ, కృతనిశ్చయం ఇవేవిధి నిర్వహణలో నాకుగీటురాళ్ళు."

ప్రియమిత్రులు శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు 55 సంవత్సరాలు ముగించుకొని, 56 వ సంవత్సరంలో అడుగుపెట్టే పుట్టినపండుగ రోజున, ఆయన పూర్ణాయువుకలిగి, ప్రజాసేవ, దేశసేవ జేయ దగినంత శక్తి భగవంతుడివ్వాలని, అఖిల ఆంధ్రావని ఆకాంక్షించే శుభ సమయంలో, వారికి నా అభినందనలు, ఆశీర్వచనములు ప్రేమ పూర్వకముగ అందజేస్తున్నాను.

జంటనగరాలను సందర్శించినప్పుడు సికింద్రాబాద్-హైదరాబాద్ నగరాల్లోని

తాజ్ మహల్ గ్రూపు హోటళ్ళలోనే బసచేయండి

అన్ని ఆధునిక సౌకర్యాలతో సింగిల్, డబుల్ మరియు ఎర్ కండిషన్ గదులు;
సత్వరముగాను, సవినయముగాను లభ్యమయ్యేసేవ; శుభ్రమైన, ఆహ్లాద
కరమైన చుట్టుప్రక్కల వాతావరణం; ప్రశస్తమైన పాకముతో కూడిన
వంటకాలు; అన్నిటికీ అందుబాటులో ఉన్న అనువైన స్థలం;



హైదరాబాదు తాజ్ మహల్ హోటల్ యొక్క ఒక దృశ్యం

తాజ్ మహల్ హోటల్	తాజ్ మహల్ హోటల్	తాజ్ మహల్ కేఫ్
సరోజినీదేవిరోడ్	కింగ్ కోఠిరోడ్	నారాయణగూడ
సికింద్రాబాద్	హైదరాబాద్	హైదరాబాద్
ఫోన్: 72561 & 73171	ఫోన్: 33401 & 35591	ఫోన్: 32136

గ్రామ్స్: "కర్డైస"

ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ మరియు హిందీ భాషలలో **82,000** లకు
మించిన సర్క్యులేషన్‌తో వెలువడుచున్న

ఆంధ్ర ప్రదేశ్‌లో

ఈ క్రింది రేట్ల ప్రకారము వ్యాపార ప్రకటనలు అంగీకరించబడతాయి

సంచిక వెలువడుతున్న భాష	II వ లేక III వ కవర్ పూర్తి పేజీ రేటు	పూర్తి పేజీ రేటు	II వ మరియు III వ కవర్లు మినహా అరపేజీ రేటు
	రూ.	రూ.	రూ.
ఇంగ్లీషు	400/-	300/-	150/-
తెలుగు	500/-	400/-	200/-
ఇంగ్లీషు మరియు తెలుగు రెండింటికీ కలిపి	600/-	500/-	250/-
ఉర్దూ లేక హిందీ	75/-	50/-	25/-
ఉర్దూ మరియు హిందీ రెండింటికీ కలిపి	100/-	75/-	40/-

✻ పత్రిక సైజు :— డెమీ క్వార్టో (9" × 7") ✻


నియమాలు


1. ఆరు నెలలకుగాని అంతకు మించిన కాలానికి గాని కాంట్రాక్టుకు తీసుకున్న స్థలానికి 10% రిబేటు ఇవ్వబడును.
2. అరపేజీకి తక్కువయిన వ్యాపార ప్రకటన అంగీకరించబడదు.
3. I మరియు IV వ కవరు పేజీలలో వ్యాపార ప్రకటనలు ప్రచురించబడవు.
4. II మరియు III వ కవర్ పేజీలలో పూర్తి పేజీ కంటె తక్కువయిన వ్యాపార ప్రకటనలు ఆమోదించబడవు.
5. రానున్న నెల సంచికలో వ్యాపార ప్రకటనను ప్రచురించడానికి అంతకు ముందునెల 8వ తేదీ లోపలనే వ్యాపార ప్రకటన, అందుకు సంబంధించిన వివరాలు మరియు డబ్బుతో సహా, అందవలెను.
6. వ్యాపార ప్రకటనతో పంపిన బ్లాకును జాగ్రత్తగా ఉంచడానికి అవసరమైనంత శ్రద్ధ తీసుకోబడును; కాని బ్లాకు మెషిన్‌మీద విరిగిపోతే అందుకు ఈ డిపార్ట్‌మెంటు బాధ్యతవహించదు.
7. "ఒకే సంచికలో ప్రచురించవలెనా, యే స్థలములో యే భాషా సంచికలో యే విధముగా ప్రచురించవలెను" ఈ మొదలయిన వివరాలను స్పష్టంగా నిర్దేశించవలెను.

ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ యీ క్రిందివారితో జరుపవలెను:

డైరెక్టర్
సమాచార పౌరసంబంధాలశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాద్–1

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad.
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.





Regd. No. H 133